ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి

ప్రకాశం

శుక్రవారం 30, ఆగస్టు 2024

విపక్ష వైసీపీకి జిల్లాలో ఆ పార్టీ నాయకులు గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు అనేక మంది కూటమివైపు దృష్టిసారిస్తున్నారు. అవకాశం ఉంటే టీడీపీలోకి లేదంటే.. జనసేనలోకి.. మరీ కాదంటే బీజేపీలో చేరేందుకు పావులు కదుపుతున్నారు. అందుకనుగుణంగా ఇప్పటికే కొందరు నాయకులు అడుగులు వేయటం ప్రారంభమైంది. గిద్దలూరు, అద్దంకి నియోజకవర్గాల్లో కొందరు బీజేపీలో చేరగా, పొదిలిలో కొందరు జనసేన జెండా పట్టుకొని తిరుగుతున్నారు. తాజాగా వైసీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. ఇంకోవైపు జిల్లాలో కీలకనేత బాలినేనితో పాటు మరో ఇద్దరు, ముగ్గురు మాజీలు కూటమిలోని నేతలకు టచ్‌లో ఉన్నట్లు సమాచారం. దీనికితోడు వైసీపీ జిల్లా అధ్యక్ష పదవి తీసుకునేందుకు ఎవ్వరూ ముందుకు రావటం లేదు. ఓటమి చెందిన పలువురు మాజీలు తిరిగి తమకు పాత నియోజకవర్గాలు కేటాయించాలని అధినేతపై ఒత్తిడి చేస్తున్నారు.

- కూటమివైపు వైసీపీ నేతల చూపు
- ఎమ్మెల్సీ సునీత పార్టీకి, పదవికి రాజీనామా
- ఆయా పార్టీల నేతలు టచ్‌లో.. మరో ముగ్గురు మాజీలు
- జిల్లా అధ్యక్ష పదవికి ససేమిరా అంటున్న నేతలు
- కొన్ని అసెంబ్లీలకు దూరమైన ఇన్‌చార్జిలు





జెండా ఎత్తేద్దాం!

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికారాన్ని కోల్పోవటమే కాక భారీ ఓటమి ఎదురైన మా నాయకుడిలో(జగన్) ఎలాంటి మార్పు కనిపించటం లేదు. పాత పద్ధతిలోనే ఆయన పోకడ ఉంది. అందుకే మాదారి మేము చూసుకోక తప్పటం లేదు. జిల్లాలోని వైసీపీ నాయకుల్లో కొందరు చెబుతున్న మాట ఇది. అలా చెప్పే సీనియర్ నాయకులు రోజురోజుకు పెరిగిపోతుండగా గ్రామ, మండల స్థాయిలో వైసీపీ నాయకులైతే ఎప్పుడో పక్కదారి పట్టారు. కూటమి ప్రభుత్వంలోని మూడు పార్టీలు కూడా వైసీపీ నుంచి వచ్చే వారిని చేర్చుకొని ఆ పార్టీని నిర్వీర్యం చేయాలనే ఆలోచనలో ఉన్నాయి. దీంతో కూటమి వైపు దృష్టిసారించిన వైసీపీ నేతలకు కూడా సానుకూల సంకేతాలు అందుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో కూటమిలోని మూడు పార్టీల నేతలు వైసీపీ వారిని తమ పార్టీలోకి చేర్చుకునేందుకు శ్రీకారం పలికారు. ఒంగోలులో వైసీపీ కార్పొరేటర్లతోపాటు వారి వెంట వచ్చిన కొందరు నాయకులకు పచ్చకండువాలు కప్పారు. గిద్దలూరు, చీరాల మున్సిపాలిటీల్లో ఈ తంతు సాగింది. దర్శిలోని ముండ్లమూరు మండలంలోని వైసీపీ ఎంపీటీసీ సభ్యులంతా టీడీపీలో చేరిపోయారు. పొదిలిలో భూవివాదాల్లో చిక్కుకున్న ఒక వైసీపీ నాయకుడు జనసేనలో సభ్యులను చేర్పించి ఆ పార్టీలో పెత్తనం కోసం తహతహలాడుతున్నాడు. ఇటీవల గిద్దలూరు, అద్దంకి నియోజకవర్గాలకు చెందిన కొందరు వైసీపీ నాయకులు నేరుగా బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరీ వద్దకు వెళ్లి ఆ పార్టీలో చేరిపోయారు. ఇలా చూస్తే ప్రతి నియోజకవర్గంలోనూ ఏదోస్థాయిలో వైసీపీ శ్రేణులు, నాయకులు కూటమి పార్టీల్లో చేరిపోయే తంతు జరుగుతుంది.

టచ్‌లో మరికొందరు మాజీలు

వైసీపీలో కీలకంగా ఉన్న ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేనితో పాటు మరికొందరు కీలక నాయకులు కూటమిలోని మూడు పార్టీల్లో కొందరికి టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరు ముగ్గురు మాజీలైతే ఆయా పార్టీల్లోని నాయకులతో టచ్‌లో ఉన్నారు. ఆ పార్టీలో ఉన్న ఇద్దరు ముగ్గురు ప్రజాప్రతినిధులు కూడా కూటమి పార్టీల్లోని నేతలకు టచ్‌లో ఉండటం విశేషం. ఇక జిల్లాలోని వైసీపీ ఎంపీపీలు, జడ్పీటీసీలు అయితే ఇప్పటికే టీడీపీ ఎమ్మెల్యేలకు టచ్‌లోకి వెళ్లారు. కొన్ని నియోజకవర్గాలకు చెందిన ఐదారుగురు ఎంపీపీలు, జడ్పీటీసీలు ఇటు బీజేపీ అటు జనసేన నేతలకు టచ్‌లో ఉండటం విశేషం.



వైసీపీకి ఎమ్మెల్సీ సునీత రాజీనామా

ఎమ్మెల్సీ, వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలైన పోతుల సునీత బుధవారం శాసనమండలి సభ్యత్వానికి అలాగే వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు ఆ మేరకు అటు శాసనమండలి ఛైర్మన్‌కు, ఇటు వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు రాజీనామా లేఖలు పంపారు. వైఎస్ కుటుంబానికి సన్నిహితుడైన రాజ్యసభసభ్యుడు మోపిదేవి వెంకటరమణ, బీదా మస్తాన్‌రావులు తమ పదవులకు రాజీనామా చేశారు. మరికొందరు రాజ్యసభ సభ్యులు పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయబోతున్నట్లు వెల్లడైంది. రాజ్యసభలో అలాగే శాసనమండలిలో టీడీపీ కూటమి పార్టీలు తమ బలాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. పార్టీకే కాక పదవులకు రాజీనామా చేసి రావాలని కోరుతున్నారు. తదనుగుణంగా వారికి ప్రత్యామ్నాయ పదవులపై హామీలు కూడా ఇస్తున్నారు. రానున్న వారం రోజుల్లో వైసీపీ రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు కూటమి పార్టీల్లో చేరే ప్రక్రియ ముమ్మరమయ్యే అవకాశం ఉంది. పోతుల సునీత రాజీనామాను అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 2014లో టీడీపీ తరఫున చీరాల నుంచి పోటీచేసి ఓడినా, ఆమెను గౌరవించి ఎమ్మెల్సీని చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే ఆమె టీడీపీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. ఒప్పందం మేరకు అక్కడ తిరిగి ఎమ్మెల్సీ అయ్యారు. నిన్నమొన్నటివరకు టీడీపీపై ముఖ్యంగా చంద్రబాబుపై తీవ్ర విమర్శలు చేసిన సునీత అకస్మాత్తుగా వైసీపీ పదవికి రాజీనామా చేయటంలోని పరమార్థం ఇట్టే అర్థమవుతుంది.

...లతో చర్చలు కూడా జరిపారు. కుదిరితే టీడీపీ, కాకపోతే జనసేన, అదీ కాకపోతే బీజేపీలో చేరేందుకు సిద్ధమై కొందరు ముఖ్యమైన నాయకుల వైపు అడుగులు వేస్తున్నట్లు సమాచారం. టీడీపీ విషయానికి వస్తే రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు ఆ తర్వాత కీలకమైన ప్రజాప్రతినిధులను మాత్రమే చేర్చుకునేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉదాహరణకు టీడీపీలో చేరబోతున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ ప్రకాశం జిల్లాలోని ఒకరిద్దరు కీలక నేతల పేర్లు కూడా టీడీపీ నాయకుల వద్ద ప్రస్తావించి తీసుకోవాలని చెప్పినట్లు తెలిసింది. ప్రస్తుతానికి బాలినేని జనసేన ముఖ్య నాయకుల మధ్య చర్చలు జరుగుతుండగా మరో ఇద్దరు మాజీలు కూటమిలోని వివిధ పార్టీల నేతలతో...

జిల్లా అధ్యక్ష పదవికి ముందుకు రాని వైనం

వైసీపీ జిల్లా అధ్యక్ష పదవి తీసుకునేందుకు ఆ పార్టీ నాయకులు ముందుకు రాకపోవటం గమనార్హం. ప్రస్తుత అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి పార్టీ ఓటమి అనంతరమే అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత జగన్ జిల్లాకు చెందిన నాయకులను పక్కనపెట్టి తిరుపతి జిల్లాకు చెందిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని పార్టీ అధ్యక్షుడిని చేయాలని భావించారు. ఆ ప్రతిపాదనను బాలినేనితో పాటు నాయకులందరూ వ్యతిరేకించారు. దీంతో చెవిరెడ్డికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చిన జగన్ జిల్లా అధ్యక్ష పదవికి పేర్లను ఇటు బాలినేని అటు వైవీలను సూచించాలన్నట్లు తెలిసింది. ఆ పదవి తీసుకునేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవటం విశేషం. దీంతో జగన్ బలవంతంగానైనా దర్శి ఎమ్మెల్యే బూచేపల్లికి పార్టీ బాధ్యతలు అప్పగించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.



డోర్లు తెరవక ముందే వైసీపీ ఖాళీ

వైద్య ఆరోగ్యశాఖను భ్రష్టు పట్టించిన వైసీపీ సర్కార్

రాష్ట్రమంత్రి డాక్టర్ స్వామి



మాట్లాడుతున్న మంత్రి స్వామి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 29 : తెలుగుదేశంపార్టీ డోర్లు ఓపెన్ చేయకుండానే వైసీపీ ఖాళీ అవుతోందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎ స్‌బీవీ స్వామి చెప్పారు. స్థానిక రిమ్స్‌లో బంగారు బాల్యం కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం వచ్చిన మంత్రి స్వామి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నుంచి వచ్చే వారి జాబితా ఇప్పుడే చెప్పలేమని, ఒకసారి తెలుగుదేశం పార్టీ డోర్లు ఓపెన్ చేస్తే వైసీపీ క్లోజ్ చేసుకోవాల్సిందేనని స్వామి స్పష్టం చేశారు. జగన్ సర్కార్ వైద్యఆరోగ్య శాఖను భ్రష్టు పట్టించిందని, ఇప్పుడు వైద్యశాఖపై మాట్లాడే అర్హత అతనికి లేదని చెప్పారు. సింగరాయకొండలో 30 పడకల ఆసుపత్రిని ఆరుపడకల ఆసుపత్రిగా మార్చిన ఘనత జగన్‌దని ఆయన మండిపడ్డారు. వైద్య, ఆరోగ్యశాఖను నిర్వీర్యం చేసిన వ్యక్తులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. అందరికీ వైద్యం అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తున్నామని వివరించారు. అలాగే జిల్లా వైద్యశాలలో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

గిడుగు సేవలు చిరస్మరణీయం

కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 29 : వ్యవహారిక తెలుగు భాషకు పెద్దపీట వేసేలా కృషిచేసిన గిడుగు వెంకటరామమూర్తి సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ తమీమ్ అన్సారియా కొనియాడారు. గిడుగు రామ్మూర్తి 162వ జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి జేసీ గోపాలకృష్ణతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రాంధికంలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చిన సంస్కర్త గిడుగు అని అన్నారు. వ్యవహారిక భాషా ఉద్యమానికి మూలపురుషుడని, ఆయన జయంతి రోజునే తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరరావు, డీఈవో సుభద్ర, డిప్యూటీ డీఈవో అనితారోజ్‌రాణి, కనిగిరి ఆర్డీవో జాన్ ఇర్విన్ పాల్గొన్నారు.

ఒక రోజు ముందే పింఛన్

రేపే పంపిణీ

జిల్లాకు రూ.123 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

ఉబ్బితబ్బిబ్బు అవుతున్న లబ్ధిదారులు



ఒంగోలు నగరం, ఆగస్టు 29 : రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్లను ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు అందజేయనుంది. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ సొమ్మును అందిస్తున్న ప్రభుత్వం సెప్టెంబర్ మాసానికి సంబంధించిన సొమ్మును ఆగస్టు నెల 31వ తేదీనే లబ్ధిదారుల చేతిలో పెట్టనుంది. ఒకటో తేదీ ఆదివారం కావటంతో ఒక రోజు ముందుగానే అంటే శనివారం నాడే పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం శుక్రవారం నాటికి పూర్తి చేయనుంది. శనివారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో మొత్తం 2,89,096 పింఛన్లు ఉండగా వీరికి పింఛన్ సొమ్మును అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.123,01,33,000లను విడుదల చేసింది. శనివారం జిల్లాలో పింఛన్లను పంపిణీ చేసేందుకు బ్యాంకుల నుంచి డబ్బులను సచివాలయ సిబ్బంది శుక్రవారమే డ్రా చేయనున్నారు. గతంలో వలంటీర్ల ద్వారా పింఛన్ల సొమ్మును పంపిణీ చేయగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీంతో ఈ నెల 31వ తేదీన కూడా ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారానే పింఛన్లను పంపిణీ చేయనుంది. జిల్లాలో వృద్ధాప్య పింఛన్లు 1,57,116, వితంతు పింఛన్లు 67,913, దివ్యాంగుల పింఛన్లు 33,590, ఒంటరి మహిళల పింఛన్లు 7,808 చర్మకారుల పింఛన్లు 5,339, డప్పు కళాకారుల పింఛన్లు 4,682,మత్స్యకారుల పింఛన్లు2,530, చేనేత కార్మికుల పింఛన్లు 1,811, కల్లుగీత కార్మికులు 246, హిజ్రాల పింఛన్లు 90తో పాటు అభయహస్తం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, సైనిక సంక్షేమశాఖ ద్వారా గుర్తించిన వారికి ఇచ్చే పింఛన్లు మొత్తం కలిపి జిల్లాలో 2,89,096 మంది ఉన్నారు. వీరందరికీ ఈ నెల 31వ తేదీనే సెప్టెంబర్ మాసానికి సంబంధించిన పింఛన్లను ప్రభుత్వం ఇంటి వద్దనే అందించనుంది. శనివారం అందుబాటులో లేని లబ్ధిదారులకు సోమవారం ఇంటి వద్దకే వెళ్లి అందజేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. సోమవారం నాటికి నూరుశాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పింఛన్ల పంపిణీకి తగినంత మంది సచివాలయ సిబ్బంది లేకపోవటంతో ఇతర శాఖల ఉద్యోగులను కూడా కేటాయించారు. వీరు శనివారం ఇంటింటికీ తిరిగి పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించి అమలు చేస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఒక రోజు ముందుగానే చేపట్టి లబ్ధిదారుల కళ్లల్లో ఆనందాన్ని చూడనుంది.ఈ విషయం తెలియగానే లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బాలినేని అక్రమాలపై దర్యాప్తు చేయించండి

సీఎంను కోరిన దామచర్ల, రియాజ్

అందరూ చెప్పిన అధికారులనే నియమించాలని విజ్ఞప్తి



చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తున్న జనార్దన్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు జరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్‌లు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు పలు అంశాలతో కూడిన సమాచారం లేఖను ఆయనకు అందించారు. గురువారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రిని వారు కలిశారు. ఇటీవల ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మేయర్, మరో 18 మంది కార్పొరేటర్లను దామచర్ల చంద్రబాబు వద్దకు తీసుకెళ్లారు. ఆ సందర్భంగా ముందుగా రియాజ్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సింగరాజు రాంబాబులను తీసుకొని చంద్రబాబును జనార్దన్ కలిశారు. ఒంగోలులో బాలినేని వియ్యంకుడు భాస్కర్ రెడ్డి నిర్మిస్తున్న విల్లాస్ ప్రాజెక్టు నిర్మాణంలో చోటు చేసుకున్న అవకతవకలపై ప్రత్యేకంగా దర్యాప్తు చేయించాలని కోరినట్లు తెలిసింది. యరజర్ల కొండ నుంచి అక్రమంగా ఎర్రమట్టిని తోలుకోవటంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా పైపులైన్ వేసి మంచినీటిని నిర్మాణ పనులకు వాడుకున్నారని, విద్యుత్‌శాఖ అధికారులు కూడా నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారని వారు పేర్కొన్నట్లు తెలిసింది. ఈ విషయాల్లో లోతైన దర్యాప్తు జరిపితే పలు అక్రమాలు వెలుగులోకి వస్తాయని వారు సీఎంకు వివరించే ప్రయత్నం చేశారు. అలాగే యరజర్ల కొండల ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు భూమి అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని వివరించినట్లు తెలిసింది. బాలినేని మంత్రిగా ఉన్న సమయంలో అక్కడ రూ.40 కోట్లు వెచ్చించారని, దర్యాప్తు చేస్తే అవినీతి బాగోతం బయటపడుతుందని తెలిపినట్లు సమాచారం. ఒంగోలులో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూకబ్జాలపై సిట్‌ను ఏర్పాటు చేసినా సక్రమంగా దర్యాప్తు చేయలేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కొందరు భూముల ఆక్రమణల్లో బాలినేనితో పాటు అతని సన్నిహితులు హస్తం కూడా ఉందని చెప్పినట్లు తెలిసింది. సిట్‌ను పటిష్టపర్చి విచారణ చేయించాలని కోరినట్లు తెలిసింది. అలాగే ఎన్నికలకు ముందు హడావుడిగా పేదలకు నివేశన స్థలాలు కేటాయించారని అందులో సుమారు 12వేల మంది బోగస్ లబ్ధిదారులు ఉన్నారని పేర్కొంటూ ఆ అంశాన్ని పరిశీలించాలని కోరినట్లు తెలిసింది. వారు చెప్పిన అంశాలను సావధానంగా విన్న సీఎం చంద్రబాబు సీఎంవో అధికారులను వాటిని పరిశీలించాని సూచించినట్లు తెలిసింది.

బదిలీలపై కలిసి మాట్లాడండి

ఎమ్మెల్యే దామచర్ల జిల్లా అధికారుల బదిలీల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. తాము సూచించిన అధికారులను నియమించే విధంగా చూడాలని కోరినట్లు తెలిసింది. మూడు నాలుగు శాఖల అధికారుల నియామకంపై ప్రతిష్టంభన ఉందని, మిగిలినవి ఎమ్మెల్యేల అందరి అంగీకారంతో ఎంపిక చేసిన వారిని ఆ పోస్టులకు కేటాయించాలని కోరినట్లు తెలిసింది. సీఎం స్పందిస్తూ అన్నీ పరిశీలించే నియామకాలు జరుపుతున్నారని జిల్లా పరిధిలోని వారందరూ కూర్చుని మాట్లాడుకోవాలని చెప్పినట్లు తెలిసింది. అనంతరం ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మరో 18 మంది కార్పొరేటర్లతో పాటు టీడీపీ, జనసేనకు చెందిన ఆరుగురు కార్పొరేటర్లను ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. ఒంగోలు అభివృద్ధిని కాంక్షించి వారంతా పార్టీలో చేరారని ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని జనార్దన్, మేయర్ సుజాతలు సీఎంను కోరారు. అనంతరం కార్పొరేటర్లతో సీఎం గ్రూపు ఫొటో దిగారు.

నర్సింగ్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్

పాస్ చేసేందుకు విద్యార్థుల నుంచి భారీగా వసూళ్లు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 29 : ఒంగోలులోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జరుగుతున్న నర్సింగ్ పరీక్షలలో మాస్ కాపీయింగ్‌కు తెరదీశారు. పరీక్ష పేపర్ల కింద స్లిప్‌లు పెట్టుకుని యథేచ్ఛగా పరీక్షలు రాయడం కనిపించింది. గురువారం నుంచి మొదలైన జనరల్ నర్సింగ్ పరీక్షలలో ఆయా కళాశాలల యాజమాన్యాలు రిమ్స్ అధికారులతో కుమ్మక్కయ్యాయి. సుమారు వారం రోజులపాటు(ఈనెల 29 నుంచి వచ్చే నెల 4 వరకు) జరిగే ఈ పరీక్షలకు జిల్లాలోని వివిధ ప్రయివేటు నర్సింగ్ కాలేజీల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఇదే తరహాలో ఇక్కడ మాస్ కాపీయింగ్ జరుగుతోంది. అందుకు సంబంధించి రిమ్స్ అధికారులతో కుదిరిన ఒప్పందంతో ప్రయివేటు నర్సింగ్ కాలేజీలది ఇష్టారాజ్యం అయ్యింది. గ్యారెంటీ పాస్‌తో విద్యార్థుల నుంచి భారీ మొత్తంలో వసూలు చేశారు. పరీక్షల సమయంలో కాపీలు రాసుకునేందుకు అదనంగా మరి కొంత నగదు వసూలు చేసినట్లు సమాచారం. దీంతో విద్యార్థులు విద్యా సంవత్సరం మొత్తం చదవకపోయినా, గ్యారెంటీ పాస్ ఉందనే ధైర్యంతో పరీక్షలకు హాజరయ్యారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న విషయం తెలుసుకున్న పలు మీడియా సంస్థలు ఆకస్మిక తనిఖీలు చేశాయి. దీంతో పరీక్ష పేపర్ల కింద స్లిప్‌లు పెట్టుకుని విద్యార్థులు యథేచ్ఛగా పరీక్షలు రాయడం కనిపించింది. మాస్ కాపీయింగ్‌పై రిమ్స్ అధికారులను ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా తమకేమి తెలియదంటూ బుకాయించారు. రెండేళ్లుగా తమ భాగస్వామ్యం ఏమీ లేదంటూ సమాధానం దాటవేశారు. అందిన సమాచారం మేరకు అటు జీజీహెచ్, ఇటు రిమ్స్ అధికారులకు ప్రయివేటు నర్సింగ్ కాలేజీల యాజమాన్యాలు భారీగా ముడుపులు ముట్టచెప్పినట్లు సమాచారం. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి, మాస్ కాపీయింగ్‌లు జరగకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాల్సిన అవసరం ఉంది.



కాపీలతో సిబ్బంది



పరీక్షలు రాస్తున్న నర్సింగ్ విద్యార్థినులు


ఒంగోలులో సాహితీవేత్తలకు సన్మానం


జిల్లా గ్రంథాలయంలో..


పేర్నమిట్టలో క్రీడా సామగ్రి ఇస్తున్న కందుకూరిబాబు


గాంధీపార్కు వద్ద విద్యార్థుల వేడుకలు

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

పలు సాహిత్య సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహణ

ఒంగోలు(కల్చరల్)/ఒంగోలు(విద్య), ఆగస్టు 29: తెలుగుభాషా దినోత్సవాన్ని, గిడుగు రామ్మూర్తిపంతులు జయంతి వేడుకలను గురువారం పలు సాహిత్య సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

- నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం), కళామిత్ర మండలి ఆధ్వర్యంలో స్థానిక ఉత్తర బైపాస్ ఫ్లైఓవర్ దగ్గర ఉన్న తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల సమర్పించారు. కళామిత్ర మండలి తెలుగు లోగిలి జాతీయ అధ్యక్షుడు నూనె అంకమ్మరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ మాజీ డైరెక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ నేటి యువత జీవనోపాధి కోసం ఆంగ్ల మాధ్యమంలో చదివినా పిల్లలకు మాతృభాష తెలుగును చిన్నతనం నుంచి తప్పనిసరిగా నేర్పించాలని కోరారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి, గిడుగు రామ్మూర్తిపంతులు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాగభైరవ ఆదినారాయణ, కుర్రా ప్రసాద్‌బాబు, మాగంటి శ్రీనివాసమూర్తి, నూకతోటి శరత్‌బాబు, మిడసల మల్లిఖార్జునరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, గాయకురాలు నాళం నరసమ్మ, బీరం అరుణ, ధేనువకొండ వెంకటసుబ్బారావు, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

- ప్రకాశం జిల్లా రచయితల సంఘం(ప్రరసం) ఆధ్వర్యంలో స్థానిక గాంధీపార్కు దగ్గర ఉన్న తెలుగుతల్లి, తాళ్లపాక అన్నమయ్య, శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాలకు సంఘం అధ్యక్షుడు పొన్నూరి వేంకట శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూలమాల వేసి తెలుగు భాషా కీర్తిని కొనియాడారు. లలిత కళా అకాడమీ అధ్యక్షుడు సంతవేలూరి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. సంఘ ప్రధానకార్యదర్శి యత్తపు కొండారెడ్డి, షేక్ మహబూబ్‌జాన్, పాలూరి శివప్రసాద్, పొన్నలూరి జానకిరామ్, పత్తి రంగమన్నార్, పి.శబరినాథ్, కోటి సూర్యనారాయణ, ధేనువకొండ సుబ్బయ్య, పింగళి పూర్ణచంద్రరావు, మైనంపాటి సాయికుమార్, గుర్రం కృష్ణ, ఎన్నూరి నాగేశ్వరరావు, గంగిశెట్టి నరసింహారావు, రాఘవరెడ్డి పాల్గొన్నారు. చిన్నారులు ఆలపించిన తెలుగు గీతాలు ఆకట్టుకున్నాయి.

- లాయర్‌పేట మాంటిస్సోరి పబ్లిక్ స్కూల్‌లో గిడుగు రామ్మూర్తిపంతులు, ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని కరస్పాండెంట్ పి.శబరినాథ్, ప్రిన్సిపాల్ నూరుద్దీన్‌లు వారిని చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్వేష్, సూర్యవర్ధన్, జస్వంత్‌లు బుర్రకథ ద్వారా ప్రదర్శించిన గిడుగు రామ్మూర్తి జీవిత చరిత్ర విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థినుల తెలుగుతల్లి వేషధారణ, నృత్య ప్రదర్శన, గీతాలు అలరించాయి. అనంతరం వ్యాసరచన, శతకపద్య పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీదేవి, గోపి, కేశవ, రమేష్, అనిల్, గోపీ పాల్గొన్నారు.

- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తిజయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, బొమ్మల కోటేశ్వరి, కె.సంపూర్ణమ్మ, డి.సందీప్, పి.ఇమ్మానుయేలు, జి.శాంసన్, టి.కృష్ణవేణి, వై.మృదుల్‌కుమార్, పాఠకులు పాల్గొన్నారు.

- పింగళి కోదండరామయ్య సంస్కృతాంధ్ర ఓరియంటల్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నిడమానూరు శ్రీకాంత్, ఉపాధ్యాయులు సోమినేని సురేష్, చంద్రశేఖర్, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

- స్థానిక మంగమూరురోడ్డులోని ఎస్‌ఎస్‌ఎన్ డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తిపంతులు చిత్రపటానికి డైరెక్టర్ వై.సత్యనారాయణరెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.రాజేంద్రబాబు, టి.రాజశేఖర్‌రెడ్డి, ఎం.పద్మ పాల్గొన్నారు.

- స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం ప్రిన్సిపాల్ డి.కళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పి.యామిని, అమ్మాజి, వైస్ ప్రిన్సిపాల్ డి.అనంతలక్ష్మి, అకడమిక్ కౌన్సిల్ ఎం.శ్రీనివాసరెడ్డి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- ట్రిపుల్‌ఐటీలో గిడుగు రామ్మూర్తిపంతులు, మేజర్ ధ్యాన్‌చంద్‌ల జయంతి, అలాగే తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ భాస్కర్ పటేల్, ఏవో చంద్రశేఖర్, డీన్ రూపస్‌కుమార్, సురేష్‌బాబు, ఎఫ్‌వో షేక్ మీరావళి, పీడీ భాస్కర్ పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో..

సంతనూతలపాడు: మండలపరిధిలోని పలు పాఠశాలల్లో గురువారం తెలుగుభాసా దినోత్సవం, మేజర్ ధ్యానచంద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పేర్నమిట్ట జడ్పీహైస్కూల్లో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కందుకూరిబాబు ముఖ్యఅతిథిగా హాజరై రూ.30వేల విలువగల క్రీడాసామగ్రిని అందించారు. టీడీపీ నాయకుడు కరిచేటి శ్రీను విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఏపీజీబీ మేనేజర్ సుబ్బారావు, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ వి.శ్రీనివాసరావు, వివరం గోవిందు, హెచ్‌ఎం పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే సంతనూతలపాడు జడ్పీహైస్కూలు, ఎండ్లూరు డొంకవద్ద నున్న ట్రిపుల్‌ఐటీ ఒంగోలు క్యాంపస్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈతముక్కలలో..


నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపట్నం(ఒంగోలునగరం): తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం కొత్తపట్నం మండలం ఈతముక్కల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు చెంచుపున్నయ్య మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామమూర్తి పంతులు ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయలక్ష్మి, శివయ్య, సతీష్, నగేష్‌బాబు, డాక్టర్ పి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు రూ.20లక్షల విరాళం అందజేత


సీఎం చంద్రబాబునాయుడుకు చెక్కును అందజేస్తున్న నవీన్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 29: టీడీపీ కూటమి ప్రభుత్వం పేదలకు రూ.5లకే అన్నం అందిస్తున్న అన్నా క్యాంటీన్ల పథకంలో పలువురు మేము సైతం అంటూ భాగస్వాములవుతున్నారు. ఈ మేరకు ఒంగోలుకు చెందిన లాస్య గ్రాండ్ రెస్టారెంట్ అధినేత అబ్బూరి నవీన్‌కుమార్ అన్న క్యాంటీన్ల కోసం తన వంతు సహకారాన్ని అందజేశారు. గురువారం అమరావతిలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నేతృత్వంలో నవీన్‌కుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి రూ.10లక్షల చెక్కును అందజేశారు. అలాగే తెలుగుదేశం పార్టీ ఫండ్ కోసం మరో రూ.10లక్షలు అందించారు. ఈ సందర్భంగా ఆయన పలు గ్రానైట్ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

ఐవోసీ డిపోను కొనసాగించాలి : మాగుంట


సెక్రటరీ పంకజ్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 29 : ఒంగోలు సమీపంలోని సూరారెడ్డిపాలెం వద్ద ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) డిపోను కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. ఢిల్లీలో గురువారం పెట్రోలియం అండ్ న్యాచురల్ గ్యాస్ సెక్రటరీ పంకజ్‌జైన్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఐవోసీ డిపో జిల్లా ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. అందువల్ల దానిని కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో ఎంపీ కోరారు.

పీఏసీ సమావేశంలో.. ఢిల్లీలోని పార్లమెంట్‌భవన్‌లో గురువారం జరిగిన ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ కేసీ.వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఇతర సభ్యులతో కలిసి పలు అంశాలపై మాట్లాడారు.

బీజేపీ సభ్యత్వ నమోదును చేపట్టాలి


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు ఆగస్టు 28 : బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు గుండా శ్రీనివాసరావు కోరారు. గురువారం నాగులుప్పలపాడులోని బీజేపీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన నాయకులు,కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభించాలని, ఈ నేపథ్యంలో శ్రేణులు సన్నద్ధమవ్వాలన్నారు. కార్యక్రమంలో కేంద్ర టుబాకో బోర్డు సభ్యులు పొద వర ప్రసాదరావు, బాపట్ల పార్లమెంట్ యువమోర్చా నాయకులు లచ్చంశెట్టి టీగ్రా, భైరపునేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి : కలెక్టర్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ అన్సారియా



పలు పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 29: ప్రతి ఒక్కరూ రోజువారీ కార్యక్రమాలలో క్రీడలకు కూడా స్థానం కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. క్రీడల ద్వారా ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణతో కూడిన జీవన విధానం కూడా అలవడుతుందన్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వివిధవిభాగాలలో నిర్వహించిన క్రీడా విజేతలకు గురువారం స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించిన సభలో బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలోనూ రాణించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులందరూ పాఠ్యాంశాలతో పాటు క్రీడలకు కూడా సమ ప్రాధాన్యత ఇచ్చి రాణించాలని కోరారు. ఆ దిశగా వారికి అవసరమైన ప్రోత్సాహాన్ని జిల్లా యంత్రాంగం ఇస్తుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజరాజేశ్వరి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నవోదయ ప్రిన్సిపాల్ గీతాలక్ష్మి, డీడీ లక్ష్మానాయక్, స్టెప్ సీఈవో లోకేశ్వరరావు, మేనేజర్ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

మోదీ పాలనలో దిగజారిన కార్మికుల బతుకులు

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు విజయరాఘవన్


సంఘం జెండాను ఆవిష్కరించిన విజయరాఘవన్, నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 29: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలోనే దేశంలో వ్యవసాయ కార్మికుల బతుకులు మరింత దిగజారాయని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు ఎ.విజయరాఘవన్ విమర్శించారు. ఒంగోలులోని కాపు కళ్యాణమండపంలో గురువారం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో వ్యవసాయరంగంతో పాటు ఉత్పత్తి రంగాల్లో సంక్షోభాలు కొనసాగుతున్నాయని, ఉపాధి తగ్గి నిరుద్యోగం కూడా పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలు పేదల జీవితాలను ఛిద్రం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో భూమిలేని వ్యవసాయకూలీలు, పేదలు ఇప్పటికి 47శాతం మంది ఉంటే, రాష్ట్రంలో 54శాతం మంది ఉన్నారని, ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఇక్కడే ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైందన్నారు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, దానిని కాపాడుకునేందుకు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. దేశంలో సంపన్నులైన ఎంపీపీలు ఆంధ్రప్రదేశ్ నుంచే ఢిల్లీకి వచ్చారన్నారు. వాళ్లు గెలిచాక జనం కోసం పనిచేయకుండా తమ వ్యాపారాలు చూసుకుంటున్నారని ఆరోపించారు. అంతకు ముందు సంఘం జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జాలా అంజయ్య, జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకుడు సయ్యద్‌హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్‌గా శంకర్

చీమకుర్తి, ఆగస్టు 29 : లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్‌గా చీమకుర్తి పట్టణానికి చెందిన ఆర్‌డీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్తర్ల శంకర్‌ని నియమిస్తూ పార్టీ వ్యవస్థాపకులు విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ బలోపేతానికి తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా శంకర్ తెలిపారు.

క్విస్‌లో జాతీయ క్రీడా దినోత్సవం


క్రీడా పరికరాలను ప్రారంభిస్తున్న రవికుమార్


చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న సభ్యులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 29: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలల హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని గురువారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ సేవలను కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీలను నిర్వహించారు. విజేతలకు సూర్యకళ్యాణచక్రవర్తి, ప్రిన్సిపాల్ హనుమంతరావు బహుమతులను అందజేశారు.

అపెక్స్ స్కూలులో..

ఒంగోలు(కలెక్టరేట్): స్థానిక సుజాతనగర్‌లోని అపెక్స్ స్కూలులో గురువారం క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గోరంట్ల రవికుమార్ రూ.లక్ష విలువైన స్పోర్ట్స్ కిట్లను ప్రారంభించారు. అనంతరం అంతర్జాతీయ క్రీడాకారులు రాఘవేంద్ర, సుప్రజలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కె.శివకోటిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆట్యా-పాట్యా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా నంబూరి శ్రీనివాసరావు, చైర్మన్‌గా ఎస్‌కే.బాషా, కార్యదర్శిగా వి.డేవిడ్, కోశాధికారిగా శివారెడ్డిలను ఎన్నుకోగా వారిని అభినందించారు.

చీమకుర్తిలో 10కే నడక

చీమకుర్తి: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని 10కే నడక కార్యక్రమాన్ని హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సభ్యులు తొలుత ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏడీఈ కృష్ణారెడ్డి, ఏఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు సుబ్బారెడ్డి



సుబ్బారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కరణం బలరాం, కుటుంబసభ్యులు

ఒంగోలు, ఆగస్టు 29: పొగాకు రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన ఆదర్శమూర్తి తాటిపర్తి సుబ్బారెడ్డి అని పలువురు కొనియాడారు. గురువారం ఒంగోలు నగరం భాగ్యనగర్‌లోని సుబ్బారెడ్డి నివాసంలో సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం, పలువురు నాయకులు, ప్రముఖులు హాజరై సుబ్బారెడ్డి చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

నగర అసిస్టెంట్ కమిషనర్‌గా శ్రీనివాసరావు

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 29 : ఒంగోలు నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్‌గా పి.శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సీడీఎంఏ ఆఫీస్‌లో కమిషనర్ హోదాలో విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసరావును ఒంగోలుకు బదిలీ చేయగా, ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డి.రవీంద్రను డీఎంఏ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. కాగా విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న డీవీఎస్. నారాయణను మార్కాపురం మునిసిపల్ కమిషనర్‌గా నియమించారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఈ కిరణ్‌ను ఆయన మాతృసంస్థ అయిన స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేశారు.

నందమూరి హరికృష్ణకు ఘన నివాళి

మద్దిపాడు, ఆగస్టు 29: సినీనటుడు, మాజీ ఎంపీ నందమూరి హరికృష్ణ తెలుగుదేశం పార్టీ కోసం చేసిన సేవలు మరువలేనివని ఆ పార్టీ నాయకులు బీవీ.సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం నందిపాడులో హరికృష్ణ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, మండవ లక్ష్మీనారాయణ, మారెళ్ల సురేంద్రబాబు, మద్దినేని రంగారావు, పోతుల పవన్, తన్నీరు ప్రశాంత్, నాదెండ్ల రాము, మండవ వెంకటేష్, పొదిలి అంకమ్మరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో 1 నుంచి స్వచ్ఛతపఖ్వాడా

ఒంగోలు(విద్య), ఆగస్టు 29: జిల్లాలోని అన్ని యజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలల్లో వచ్చేనెల 1నుంచి 15వ తేదీ వరకు స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఈవో సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 1న పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలన్నారు. 2న తల్లిదండ్రుల సమావేశం, 3న పారిశుధ్యంపై జాగ్రత్తలు, 4న గ్రామాల సందర్శన, 6న నీటి సంరక్షణ, 7న పరిశుభ్రతపై విద్యార్థులకు పోటీలు, 9న చేతుల పరిశుభ్రత, 11న వ్యక్తిగత శుభ్రత, 12న స్వచ్ఛతపఖ్వాడా ఎగ్జిబిషన్, అలాగే 13,14 తేదీల్ల భవిష్యత్ ప్రణాళిక, 15న విజేతలైన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేయాలని పేర్కొన్నారు. ఎంఈవోలు, ఉప విద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాలల్లో ఆయా కార్యక్రమాలను విజయవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డీఈవో కోరారు.

22న 'హలో మాల-చలో ఒంగోలు' సదస్సు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 29 : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబరు 22న నగరంలో మాల సంఘాలు, దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో హలో మాల-చలో ఒంగోలు సదస్సును నిర్వహిస్తున్నట్లు దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, దళిత కవి చప్పిడి కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ గ్రంథాలయంలో గురువారం జనంపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ ఆధ్వర్యంలో ప్రచురించిన సదస్సు కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బాధకరమన్నారు ఇప్పటికే ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో రిట్ పిటీషన్ వేసినట్లు పేర్కొన్నారు. తీర్పును రద్దుచేసేంత వరకు పోరాటం జరుగుతుందన్నారు. అందువల్ల ఒంగోలులో జరిగే సదస్సులో జిల్లాలోని మాలలందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు సంపత్‌కుమార్, యరజర్ల రమేష్, అంచిపోగు వెంకటేశ్వరరావు, శ్రీరామ్ రాజేష్, చవల పీటర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

పేస్‌లో ముగిసిన శిక్షణ


ఉమాశకుంతులను సత్కరిస్తున్న మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు(విద్య), ఆగస్టు 29: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. కళాశాల పూర్వ విద్యార్థిని ఉమాశకుంతుల ఏఐఎంఎల్ విభాగంలో బీటెక్ పూర్తి చేసి ఎక్సెంచర్ అనే బహుళజాతి కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు కళాశాల విద్యార్థులతో జరిగే సమ్మేళనంలో భాగంగా ఈనెల 27నుంచి ఏఐఎంఎల్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్వ్యూలపై పట్టు సాధించడం, నైపుణ్యాలు పెంపొందించుకునే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, ఏఐఎంఎల్ విభాగాధిపతి హీనాకౌశర్, వై.అరుణ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరం


మాట్లాడుతున్న వైద్యాధికారి


ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 29: మాదకద్రవ్యాలు, మద్యం, పొగాకు, పాన్ పరాగ్‌లు, ఖైనీ, గుట్కాలు, సిగరెట్లు ఆరోగ్యానికి హానికరమని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.సమీర్ పేర్కొన్నారు. గురువారం గుడిమెళ్ళపాడులో పీహెచ్‌లో డి ఎడిక్షన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా గుండె, ఊపిరితిత్తుల సమస్యలు ఏర్పడి చిన్న వయస్సులోనే గుండెపోటుకు గురవుతున్నారని చెప్పారు. అందువల్ల యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగామ్ ఆఫీసర్ సుందర్‌ప్రసాద్, వైద్యులు భగీరథి, వివేకానంద, శ్రీనివాస్, పద్మ పాల్గొన్నారు.

ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానం


అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

సంతనూతలపాడు, ఆగస్టు 29: మైనంపాడు డైట్ కళాశాలలో జిల్లా స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డు గ్రహీతలకు గురువారం బహుమతులను అందజేశారు. మైనంపాడు, దొనకొండ, జరుగుమల్లి, గురవాజీపేట, పాకల జడ్పీ హైస్కూళ్ల వారికి అవార్డులను ఎంఈవోలు వెంకారెడ్డి, డీవీఎల్.నరసింహారావు, తదితరుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ సెక్రటరీ శ్రీనివాసరావు, డైట్ లెక్చరర్ శ్రీనివాసరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వనజ, ఎస్ఎంసీ చైర్మన్ బ్రహ్మయ్య, డైట్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


సీజ్ చేసిన ట్రాక్టర్‌తో ఎస్ఐ శ్రీకాంత్

నాగులుప్పలపాడు ఆగస్టు 29: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొన్నారు. చదలవాడ వద్ద గుండ్లకమ్మ వాగు నుంచి గురువారం ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఐ శ్రీకాంత్ దాడిచేసి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 29: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ పి.కిరణ్ కోరారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ, హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం స్థానిక కలెక్టరేట్ నుంచి 5కే రన్‌ను ఆయన ప్రారంభించారు. హెల్ప్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ.సాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మీకు తెలుసా అనే అనే పేరులు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంస్థల నాయకులు జి.స్వరూప్‌కుమార్, కోటేశ్వరరావు, ఎస్‌కే.పీర్‌బాషా, సునీల్, డి.శ్రీనివాసరావు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు అవగాహన

నాగులుప్పలపాడు: నాగులుప్పలపాడులోని ఐకేపీ కార్యాలయంలో హెచ్‌ఐవీపై గురువారం డ్వాక్రా గ్రూపు మహిళలకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావే శంలో డీఆర్‌డీఏ డీఎంసీ వెంకటసుబ్బయ్య మాట్లాడారు. హెచ్‌ఐవీ సోకిన వారితో శృంగారం, రక్తమార్పిడి, వాడిన సూదుల ద్వారా వ్యాధి సంక్రమిస్తుందన్నారు. కార్యక్రమంలో సీసీ కిషోర్, మల్లేశ్వరి, కృష్ణవేణి, దివ్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గిడుగు వెంకటరామ్మూర్తికి నివాళులర్పిస్తున్న విద్యాదాత వెంకటేశ్వర్లు, గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధనరాజు, విద్యార్థులు

తెలుగుభాషా పితామహుడు గిడుగు

టంగుటూరు, ఆగస్టు 29 : తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామూర్తి 162వ జయంతి వేడుకను గురువారం టంగుటూరులోని గ్రంథాలయంలో వైభవంగా నిర్వహించారు. విద్యాదాత చిడిపోతు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిడుగు కృషి ఫలితమే నేటి వ్యవహారిక భాష రూపుదాల్చిందన్నారు. అనంతరం గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లైబ్రరియన్ విద్యార్థులకు పెన్నులు బహూకరించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధనరాజు పాల్గొన్నారు.

వాడుక భాషను వేడుక చేసిన ఘనుడు

వాడుక భాషను వేడుక చేసిన ఘనుడు గిడుగు వెంకటరామ్మూర్తిపంతులని మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ముప్పరాజు సురేష్ కొనియాడారు. ఆలకూరపాడు ఉన్నత పాఠశాలలో గురువారం గిడుగు, హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యానచంద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పల్లిపాటి వెంకట్రావు, ఉపాధ్యాయులు దామచర్ల శ్రీధర్, డి. భుజంగభూషణరెడ్డి, పి. జ్యోతి, పి. సుభాషిణి, ఏ విజయలక్ష్మి, సీహెచ్ చెన్నయ్య, పి. శ్రీనివాసులు పాల్గొన్నారు.



బేళ్ల తూకాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎం లక్ష్మణరావు

వేలంలో నోబిడ్లు తగ్గించాలి

● ఆర్ఎం లక్ష్మణరావు

కొండపి, ఆగస్టు 29 : వేలం కేంద్రానికి వచ్చే బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసి నోబిడ్‌లు తగ్గించాలని పొగాకు బోర్డు ఒంగోలు ప్రాంతీయ అధికారి ఎం. లక్ష్మణరావు సూచించారు. ఆయన గురువారం కొండపి పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పొగాకు వేలాన్ని పరిశీలించారు. పొగాకు బోర్డు మెంబరు బొడ్డపాటి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రేపే పింఛన్ల పంపిణీ

టంగుటూరు, ఆగస్టు 29 : వచ్చేనెల 1న ఆదివారం కావడంతో వచ్చేనెల పింఛన్లను ఈనెల 31, శనివారమే పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో రత్నజ్యోతి గురువారం వెల్లడించారు. 31 నాడే పింఛన్‌దారులంతా అందుబాటులో ఉండి తమ పింఛన్లను తీసుకోవాలని ఆమె కోరారు. మండలంలో సెప్టెంబర్ నెలకు 9,452 పింఛన్ల నగదు విడుదలైనట్లు ఎంపీడీవో వెల్లడించారు.



విజయవాడలో గురువారం జరిగిన తెలుగుభాషా దినోత్సవంలో పడమటి గాలి రచయిత పాటిబండ్ల ఆనందరావుకు అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు

పీటీసీ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు బాధ్యతలు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 29 : పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ) ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.వి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి ఇంటెలిజెన్స్ ఆర్ఐవోగా పనిచేస్తున్న శ్రీనివాసరావు బదిలీపై ఒంగోలు పీటీసీకి వచ్చారు. అక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఏఆర్ దామోదర్ జిల్లా ఎస్పీగా బదిలీ కావడంతో ఆ స్థానంలో శ్రీనివాసరావును నియమించారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్న శ్రీనివాసరావును పలువురు పీటీసీలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.



నిరాదరణకు గురైన పిల్లలకు అండగా ఉండాలి

నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 29 : నిరాదరణకు గురైన బాలబాలికల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని వారికి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నోబెల్ బహుమతి గ్రహీత, బాలల హక్కుల కార్యకర్త కైలాష్ సత్యార్థి అన్నారు. స్థానిక రిమ్స్ ఆడిటోరియంలో గురువారం 'బంగారు బాల్యం' పేరుతో జిల్లా యంత్రాంగం నిర్వహించిన వర్క్‌షాపులో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని కైలాష్ సత్యార్థి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలల బంగారు భవిష్యత్ వైపు ప్రకాశం జిల్లా వందశాతం సాధన దిశగా.. అనేక కాన్సెప్ట్‌తో రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో కైలాష్ సత్యార్థి మాట్లాడుతూ ప్రతి బిడ్డ సురక్షితంగా, స్వేచ్ఛగా, ఆరోగ్యంగా, విద్యావంతులుగా ఉండేలా ప్రతి ఒక్కరు తోడ్పాటును అందించాల్సిన అవసరం ఉందన్నారు. బాలల హక్కులను కాపాడటంతోపాటు సమాజంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషిచేయాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు కలెక్టర్ ప్రత్యేకశ్రద్ధ తీసుకొని జిల్లాలో బంగారు బాల్యం అనే విస్తృతమైన కార్యక్రమానికి రూపకల్పన చేసి, దానిని ప్రారంభించేందుకు తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. మంత్రి స్వామి మాట్లాడుతూ ఇటీవల కాలంలో సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఘటనలను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేయడం అభినందనీయమన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం చేస్తున్న కృషిని మనతో పంచుకునేందుకు వచ్చిన కైలాస్ సత్యర్థిని మంత్రి అభినందించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ నిరాదరణకు గురైన బాలబాలికలకు మంచి భవిష్యత్ కల్పించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఎస్పీ ఎఆర్.దామోదర్ మాట్లాడుతూ పిల్లలు స్కూలుకు వెళ్లేలా చేయడం, వారికి తగిన గుర్తింపు ఇవ్వడం, హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో కైలాస్ మొక్కలు నాటారు. అనంతరం ప్రత్యేక డ్రైవ్‌లో స్కూలులో చేర్పించిన పిల్లలను అందరూ సన్మానించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, అధికారులు మాధురి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బంగారు బాల్యం వర్క్‌షాపులో మాట్లాడుతున్న నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, వేదికపై మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్, జేసీ గోపాలకృష్ణ

సీఎంను కలిసిన కార్పొరేటర్లు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 29 : ఒంగోలు నగర పాలక సంస్థ కార్పొరేటర్లు గురువారం అమరావతిలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నేతృత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిశారు. నిన్న మొన్నటివరకు వైసీపీ పాలకవర్గం సభ్యులు మెజారిటీతో ఉండగా, టీడీపీ కార్పొరేటర్లు ఆరుగురు, జనసేన కార్పొరేటర్ ఒకరు ఉన్నారు. కాగా వైసీపీ సభ్యులు 43 మంది ఉండగా, ఇటీవల కాలంలో మేయర్ గంగాడ సుజాతతోపాటు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ(బుజ్జి), పలువురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. అయితే తాజాగా టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్లతోపాటు, టీడీపీ, జనసేన కార్పొరేటర్లు గురువారం ముఖ్యమంత్రిని అమరావతిలోని సచివాలయంలో కలిశారు. కాగా కొద్దిరోజుల క్రితం వరకు ఒంగోలు కార్పొరేషన్ పగ్గాలు వైసీపీ చేతిలో ఉండగా, తాజా పరిణామాలతో ప్రస్తుతం ఒంగోలు కార్పొరేషన్ పీఠం టీడీపీ కైవసం చేసుకుంది. ఈ మేరకు జనార్దన్ పాలకవర్గ సభ్యులను సీఎంకు పరిచయం చేశారు.



సీఎం చంద్రబాబుతో ఒంగోలు నగర కార్పొరేటర్లు

బాలుడి హత్యకేసులో జవాన్‌కు జీవిత ఖైదు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 29: బాలుడిపై హత్యాచారం చేసిన ఆర్మీ జవాన్ డోనంపాటి వెంకటప్రశాంత్‌కు ఒంగోలులోని పోక్సో కోర్టు న్యాయాధికారి రాజా వెంకటాద్రి జీవితఖైదు విధిస్తూ గురువారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కొమరోలు మండలం అక్కపల్లికి చెందిన డోనపాటి వెంటక ప్రశాంత్ ఆర్మీలో జవాన్‌గా పనిచేస్తున్నాడు. సెలవుపై ఇంటికి వచ్చిన ఆయన 2022 జనవరి 22న తన బంధువుల కుమారుడు 11ఏళ్ల బాలుడిని రాత్రి 8 గంటల సమయంలో ఊరి చివరకు తీసుకెళ్ళి అఘాయిత్యానికి పాల్పడి అనంతరం హత్య చేసి బావిలో పడేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీటు వేశారు. ఈ మేరకు సాక్షులను విచారిచిన న్యాయాధికారి నిందితుడిపై నేరం రుజువుకావడంతో జీవితఖైదుతో పాటు రూ.50 వేలు జరిమానా విధించారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తీర్పునిచ్చారు.

హెడ్ కానిస్టేబుల్ వెంగళరెడ్డి సస్పెన్షన్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 29 : చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ వెంగళరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు స్టేషన్‌లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నహెడ్ కానిస్టేబుల్‌ను మూడు రోజుల క్రితం వీఆర్‌కు పిలిచారు. అయితే ఇంతవరకు స్టేషన్‌లో ఇచ్చే మెమోను వెంగళరెడ్డి తీసుకోలేదు. అదే సమయంలో పోలీసు స్టేషన్ వాట్సాప్ గ్రూపులో క్రమశిక్షణారాహిత్యంగా ఓ పోస్టింగ్ పెట్టారు. పోలీసు శాఖ ప్రతిష్టను దిగజార్చే విధంగా ఆ పోస్టింగ్ ఉండటంతో చీమకుర్తి సీఐ సుబ్బారావు ఎస్పీకి ప్రత్యేక నివేదిక అందజేశారు. ఈ మేరకు ఎస్పీ ఏఆర్ దామోదర్ హెడ్ కానిస్టేబుల్ వెంగళరెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు.

టూరిజం హబ్‌గా కనిగిరికి గుర్తింపు తీసుకొస్తాం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి ఆగస్టు 29: ఎంతో పురాతన చరిత్ర వైభవం కల్గిన కనిగిరి దుర్గం టూరిజం ప్రాంతంగా గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. హనుమంతునిపాడు మండలంలోని హాజీపురం గ్రామ పరిధిలోని ఎకో టూరిజం ఆఫ్ ఇండియా చేపట్టిన పార్క్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈప్రాంతంలో ఆహ్లాదకరమైన ప్రాంతంలో టూరిజం ఏర్పాటుచేయటం శుభపరిణామమన్నారు. పార్క్ లో జరిగే ఏర్పాట్లపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.రామిరెడ్డితో చర్చించారు. పార్క్ ఏర్పాటుపై విస్తృత ప్రచారం జరగాలని సూచించారు. పార్క్‌లో ఏర్పాటుచేసిన క్రీడా వస్తువులను పరిశీలించారు. ఇలాంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలు తమ కుటుంబ సభ్యులతో సేద తీ రితే ఎంతో ఆటవిడుపుగా ఉంటుందన్నారు. పార్క్ అభివృద్ధికి తన సహ కారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఫారెస్ట్ డీఆర్‌వో తులసీరావు, బీట్ ఆఫీసర్ నరసింహం, టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరు పతిరెడ్డి (ఎస్‌టీఆర్), గాయం తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పార్క్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వైద్యాధికారి కుర్చీలో టీడీపీ ఇన్‌చార్జ్

వివాదాస్పదంగా మారిన లక్ష్మి తీరు

దర్శి, ఆగస్టు 29: ప్రకాశం జిల్లా దర్శి ప్రభుత్వ ఆస్పత్రి పనితీరును టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పరిశీలించటం వివాదాస్పదమైంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ కుర్చీలో కూర్చొని ఆమె డాక్టర్లతో చర్చించటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో ప్రజలు సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ హాస్పటల్‌లో వైద్య సేవలు ఎలా జరుగుతున్నాయో తెలుసుకునేందుకు బుధవారం ఆమె ప్రభుత్వ వైద్యశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సూపరింటెండెంట్ సీట్‌లో కూర్చొని డాక్టర్లతో మాట్లాడారు. రోగులకు వైద్యం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆమెకు ఎలాంటి హోదా లేకపోయినా నేరుగా సూపరింటెండెంట్ సీట్‌లో కూర్చోవటం వివాదాస్పదమైంది. ఈ విషయం సర్వత్రా చర్చనీయాంశమైంది.



సూపరింటెండెంట్ కుర్చీలో కూర్చొని మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ఆ సీటు సూపరింటెండెంట్‌ది కాదు

ప్రభుత్వ హాస్పటల్‌లో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కూర్చున్న సీటు సూపరింటెండెంట్‌ది కాదని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సుమన్ తెలిపారు. ఒక డాక్టర్ గదిలో ఆమె కూర్చొని మాట్లాడారని తెలిపారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మంచి పేరున్న డాక్టర్ అయినప్పటికీ డాక్టర్ సీటు పక్కన ఉన్న సీట్‌లో కూర్చునే ప్రయత్నం చేశారన్నారు. ఆ కుర్చీ సరిగా లేకపోవటంతో డాక్టర్ సీట్లో కూర్చోమని చెప్పామన్నారు. తమ విజ్ఞప్తి మేరకే అక్కడ కూర్చొని రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారని, ఆమె సూపరింటెండెంట్ సీట్‌లో కూర్చున్నారని వస్తున్న కథనాలు అవాస్తవమన్నారు. ప్రభుత్వ పరంగా అవసరమైన అన్ని వనరులను హాస్పటల్‌కు సమకూర్చుతామని ఈ సందర్భంగా ఆమె చెప్పినట్టు వివరించారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి

● కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 29: ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. గురువారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ల సూపరింటెండెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన తల్లి, బిడ్డల సంరక్షణే లక్ష్యంగా వైద్యసేవలు అందించాలని అందుకోసం ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని డీసీహెచ్ఎస్‌ను ఆదేశించారు. గిద్దలూరు, పామూరు, ఎర్రగొండపాలెం, కంభం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో నిర్దేశించిన లక్ష్యం వరకు ప్రసవాలు నిర్వహించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రసవాల సంఖ్య మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా ఆసుపత్రులలో సౌకర్యాలు, సిబ్బంది కొరత లేకుండా చేసి రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని చెప్పారు. జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల వారీగా ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను, అవసరమైన వైద్యపరికరాల నివేదికను సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ శేషు తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఎం, పీడీలను సన్మానిస్తున్న అధికారులు

జరుగుమల్లి జడ్పీస్కూల్‌కు పురస్కారం

జరుగుమల్లి(కొండపి), ఆగస్టు 29 :జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లాలో క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జరుగుమల్లి జడ్పీస్కూల్ హెచ్ఎం శ్రీనివాసులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు ఎన్వీ ప్రసాద్‌ను గురువారం సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు డైట్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అతిథులు సన్మానించారు. స్కూల్‌కు జిల్లా స్థాయి స్కూల్ సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డును డైట్ ప్రిన్సిపాల్ ఆర్. శ్రీనివాసులు, సంతనూతలపాడు ఎంఈవో డి. వెంకారెడ్డి పాల్గొన్నారు.

కోఆర్డినేషన్ సమావేశం

పొన్నలూరు (కొండపి) : మండలంలోని సచివాలయం ఈడబ్ల్యూఏలకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఎస్ఎంసీ ఛైర్మన్‌లకు జరుగుమల్లి ఎంఈవో కార్యాలయంలో గురువారం కోఆర్డినేషన్ సమావేశం ఎంఈవో రవిచంద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఎస్ యాప్‌లో టాయిలెట్ మానిటరింగ్ ఫోటోలు, ఇన్‌స్పెక్షన్ ప్రొఫార్మాలను ఆన్‌లైన్ చేసే విధానాలపై అగాహన కలిగించారు. సమావేశంలో ఎంఈవో-2 టి. హరిబాబు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి కూలీ మృతి

బల్లికురవ, ఆగస్టు 29 : బెండ కాయలు కోసి ఇంటికి ట్రాక్టర్ గొర్రుపై కూర్చొని వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ షేక్ కరీమూన్ (46) మృతి చెందగా, మరో కూలీ రెహానా తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం జరిగింది. కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన రైతు కొమ్మినేని పోతురాజు తన తోటలో బెండకాయలు కోసేందుకు అయిదుగురు కూలీలను ట్రాక్టర్‌పై తీసుకుని వెళ్లి తిరిగి గొర్రుపై ఎక్కించుకొని ఇంటికి తీసుకువస్తుండగా ట్రాక్టర్ పిన్ను కూలీలకు తగలడంతో ఒక్క సారిగా గొర్రుపై ఉన్న షేక్ కరీమూన్ కింద పడి పోయి కొంత దూరం ఈడ్చుకు వచ్చి తీవ్రంగా గాయపడింది. రెహానా కూడా కిందిపడి గాయపడింది. ఇద్దరినీ నర్సారావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా సంతమాగులూరు వద్దకు వెళ్లే సరికి కరీమూన్ మృతి చెందింది. బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

విద్యార్థినిపై ఆటో డ్రైవర్ లైంగిక దాడి

అద్దంకి, ఆగస్టు 29 : విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక దాడికి పాల్పడ్డ సంఘటనపై అద్దంకి పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన 16 ఏళ్ల బాలిక హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల యువకుడు ఆటో నడుపుతూ 6నెలలుగా పాఠశాలకు వెళ్లి వచ్చే సమయంలో బాలిక వెంట పడుతూ బెదిరిస్తున్నాడు. తల్లిదండ్రులకు చెబితే చదువు మాన్పిస్తారన్న భయంతో బాలిక ఇంట్లో చెప్పలేదు. స్కూల్ నుంచి వచ్చే సమయంలో బెదిరించి పలుమార్లు దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆ యువకుడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ప్రవీణ పలు సెక్షన్‌లతోపాటు పోక్సో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బైక్ కవర్‌లో నుంచి రూ.2.50 లక్షలు చోరీ

అద్దంకి, ఆగస్టు 29 : ఆపి ఉన్న మోటార్‌సైకిల్ ట్యాంక్ కవర్‌లో నుంచి రూ.2.50లక్షల నగదు అపహరించుకు పోయిన సంఘటనపై పోలీస్ స్టేషన్ లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కలవకూరుకు చెందిన బిక్కా అంజిరెడ్డి వ్యవసాయ పనుల నిమిత్తం బుధవారం అద్దంకి పట్టణంలోని ఎస్‌బీఐ (ఏడీబీ) నుంచి రూ.2.50లక్షలు డ్రా చేసి ఇంటికి వెళ్తూ టీ తాగేందుకు భవానీసెంటర్‌లోని మసీదు సమీపంలోని టీ దుకాణం వద్ద ఆగాడు. అంజిరెడ్డి మోటార్‌సైకిల్ ఆపిన వెంటనే గుర్తు తెలియని వ్యక్తి వచ్చి రూ.2.50లక్షల నగదు తీసుకొని పరిగెత్తాడు. సమీపంలో మరో వ్యక్తి మోటార్‌సైకిల్‌పై ఆగి ఉండడంతో ఇద్దరు కలిసి ఆ మోటార్‌సైకిల్ పై వెళ్లారు. వెంబడించినప్పటికీ దొంగలు దొరకలేదు. అంజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మహిళా ఎస్ఐ ప్రవీణ తెలిపారు.

చెరువు అలుగుపై యథేచ్ఛగా అక్రమ కట్టడాలు


అలుగు గోడలపై కట్టిన అక్రమ నిర్మాణాలు

- పట్టించుకోని మున్సిపల్ ప్లానింగ్ అధికారులు
- నిద్ర నటిస్తున్న నీటిపారుదల శాఖ విభాగం

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 29: మార్కాపురం పట్టణంలోని చెరువును దాదాపు 500 ఎకరాలలో నిర్మించారు. ఆంగ్లేయులు చెరువును మరింత పటిష్ఠ పరుస్తూ, అలుగులు, తూములు నిర్మించారు. పట్టణంలోని రేడియో స్టేషన్ సమీపంలో పారిశ్రామికవాడ వద్ద చెరువు అలుగు పూర్తిస్థాయిలో ఆక్రమణలకు గురైంది. రేడియోస్టేషన్ సమీపంలో వెలసిన అక్రమ కట్టడాలు చిన్నమసీదు వద్ద ఉన్న తూము వరకు విస్తరించాయి. 1976లో వచ్చిన తుఫాన్‌కు అలుగు పారి సమీపంలోని గృహా ల వద్ద నీరు చేరింది. దీంతో నీరు పారకుండా గోడకట్టి రాతి రివిట్‌మెంట్ వేశారు. కాలక్ర మేనా ఆక్రమణదారులు అలుగుకట్టను ఆక్రమించారు. తొలుత దిబ్బలు వేస్తూ, అనంతరం చుట్టూ రాళ్లు పేరుస్తారు. ఆపై రేకుల షెడ్లు నిర్మిస్తు మరికాస్త ముందుకు వెళ్లి ఇంకా కట్టడాలు నిర్మించారు. ఎటువంటి అనుమ తులు లేకపోయినా చెరువు అలుగు నుంచి చిన్నమసీద్ వరకు పక్కా కట్టడాలు వెలిశాయి. పట్టణ ప్రణాళిక విభా గం అధికారులు మాత్రం ఎటువంటి అనుమతులు లేని ఈ కట్టడాలను పట్టించుకోవడం లేదు. తమ ఆస్తులు కాపాడుకోవాల్సిన నీటి పారుదల శాఖ నిద్ర నటిస్తోంది. ఇదేవిధంగా పారిశ్రామకవాడ సమీపంలోని రెండో అలుగు వద్ద కూడా కట్టడాలు వెలిశాయి. చెరువు నిండినప్పుడు అధికమైన నీరు బయటకు పోయేందుకు ఏర్పాటు చేసిన ఈ అలుగులు ఆక్రమణలతో నిండి చిన్న మురుగు కాలువల మాదిరి మారి పోయాయి. విశాలమైన ఈ అలుగులను పక్కా కట్టడా లతో పాటు జీబ్ స్టాండ్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నారు. సాక్షాత్తు అలుగు గోడలపైనే నిర్మాణాలు సాగించారంటే రెండు శాఖల అధికారులు మాత్రం కళ్లు మూసుకుంటు న్నారు. రేడియో స్టేషన్ నుంచి తిరువీధుల బావి వరకు మార్కాపురం పట్టణం నుంచి వెళ్లే ప్రధాన రహదారిగా ఉండేది. అక్రమ కట్టడాలతో ఈ రహదారి కుంచించుకుపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అలుగుపై ఉన్న అక్రమ కట్టడాలు తొలగించాల్సి ఉంది.


ఆక్రమణలతో కుంచించుకుపోయిన అలుగు

ఉసురుతీసిన అప్పులు

- పురుగుల మందుతాగి రైతు ఆత్మహత్య


చిన్నదిబ్బారెడ్డి (ఫైల్)

కంభం, ఆగస్టు 29 : అప్పుల బాధతో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అర్ధవీడు మండలం కాకర్లలో గురువారం చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన చిన్నదిబ్బారెడ్డి(42) నాలుగేళ్లుగా తన కున్న ఎనిమిది ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేశాడు. ఏ పంట వేసినా సరిగా దిగుబడి రాలేదు. దీంతో సుమారు రూ.15 లక్షల మేర అప్పులు చేశాడు. ఈ ఏడాది బోర్ల కింద రెండెకరాల్లో పొగాకు నారుమడి పోశారు. మరో ఐదెకరాల్లో మిర్చి సాగు చేశారు. తీవ్ర వర్షాభావంతో వేసిన పైరు అంతా ఎండిపోయింది. ఓ వైపు అప్పులు, మరో వైపు పంట ఎండిపోవడంతో కుంగిపోయాడు. దీంతో బుధవారం సాయంత్రం పొలానికి వెళ్లి పురుగులమందు తాగాడు. చీకటిపడినా ఇంటికి రాక పోవడంతో కుటుంబసభ్యులు దిబ్బారెడ్డిని వెతుక్కుంటూ పొలం వద్దకు వెళ్లారు. గట్టుపై అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గమనించి హుటాహుటిన కంభం వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

పశువుల సీజనల్ వ్యాధులపై అవగాహన

మార్కాపురం రూరల్, ఆగస్టు 29: పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై మండలంలోని దరిమడుగు గ్రామంలో గురువారం పశువైద్యాధికారి అశోక్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులలో గాలికుంటు బ్రోసిల్లోస్ జబ్బులు పశువులకు రాకుండా పశుపోషకులు తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పశువులకు అందించే మేత, తాగునీటి విషయాలలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రెస్టారెంట్‌లలో వ్యర్థపదార్థాలను పశువులకు ఇవ్వడం ద్వారా పశువులు అనారోగ్యానికి గురవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రామాంజులరెడ్డి, అశోక్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

గిద్దలూరు, ఆగస్టు 29 : రాచర్ల మండలం అంకిరెడ్డిపల్లె గ్రామంలో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయగా అదే రోజు మళ్లీ కాలిపోయింది. అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎల్.వెంకటరెడ్డి, కె.గంగయ్య పొలంలో ఆరు రోజులక్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఉన్నతాధికారులకు తెలియజేయగా, బుధవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఇదేరోజు రాత్రి కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కూడా కాలిపోయింది. దీంతో ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఉన్న 2 వ్యవసాయ బోర్ల కింద ఉన్న పంటలు ఎండిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ తెచ్చేందుకు రవాణా ఖర్చులు సైతం రైతులతోనే వసూలు చేస్తున్నారు. దీంతో ఇటు రవాణా ఖర్చులు భరించలేక, ఎండిపోతున్న పంటలు కాపాడుకోలేక రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

బడ్డీ బంకులో చోరీ

త్రిపురాంతకం, ఆగస్టు 29: మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు పక్కన ఉన్న బడ్డీ బంకులో చోరీ జరిగింది. బంకు నిర్వాహకుడు నాసరయ్య తెలిపిన వివరాల ప్రకారం, బంకుకు బుధవారం సాయంత్రం తాళం వేసి ఇంటికి రాగా రాత్రి చోరీ జరిగింది. అందులో ఉంచిన రెండు వేల రూపాయల విలువైన సిగరెట్ పెట్టెలు, రూ 1500 నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్సై శివబసవరాజు క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరించారు. దర్యాప్తు చేపట్టారు.

ప్రత్యేకాధికారికి చెక్‌పవర్ ఇవ్వరూ !


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న వార్డు సభ్యులు

మార్కాపురం రూరల్, ఆగస్టు 29: మండలంలోని కె.కొత్తపల్లి గ్రామంలో పంచాయతీ చెక్‌పవర్‌ను ప్రత్యేక అధికారికి ఇవ్వాలని కోరుతూ వార్డు సభ్యుడు ఇమ్మడి శ్రీనివాసులు ఎంపీడీవో చందనకు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఉన్న ఉమ్మడి శ్రీరాములు అనారోగ్యం రీత్యా సుదీర్ఘకాలం సెలవు పెట్టారన్నారు. ఆ స్థానంలో ఇన్‌చార్జ్ సర్పంచ్ ఆ వార్డు సభ్యుడు మట్టం వెంకటేశ్వర్లును నియమిం చినట్లు తెలిపారు. ఇన్‌చార్జ్ సర్పంచ్ వెంకటేశ్వర్లు ఏకపక్షంగా వ్యవహరిస్తూ, పంచాయతీ నిధులను దుర్వినియోగం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఆర్థికసంఘం, సాధారణ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను పంచాయతీ వార్డు సభ్యుల ఏకగ్రీవ తీర్మానాల ద్వారానే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మండలాభివృద్ధికి తోడ్పాటు అందించాలి

ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నరసింహులు

తర్లుపాడు, ఆగస్టు 29: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి తోడ్పాటు అందించి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మీ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎస్.నరసింహులు మాట్లాడుతూ.. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు. సర్పంచులు, అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. నీళ్ల ట్యాంకులను 15 రోజులకొకసారి ఖచ్చితంగా క్లోరినేషన్ చేయాలన్నారు. దోమలువ్యాప్తి చెందకుండా మందులు పిచికారి చేయాలని సూచించారు. ఏపీవో ఎం.చిన్నకొండయ్య మాట్లాడుతూ, ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలో 214 ఎకరాల పండ్ల తోటలు పెంచుకునేందుకు దరఖాస్తులు అందినట్లు ప్రస్తుతం 100 ఎకరాలకు పండ్ల తోటలు పెంచుకునేందుకు మంజూరైనట్లు ఆయన తెలిపారు. మండలంలో 25 గోకులంషెడ్లు కూడా మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మండలానికి 200 రైతు కుంటలు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ.. మండలంలో రూ.3.61కోట్లతో సీసీ రోడ్లు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆర్అండ్‌బీ ఏఈ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. మార్కాపురం నుంచి తర్లుపాడు వరకు కొత్తరోడ్లు వేసేందుకు రూ.3కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. సదరు కాంట్రాక్టర్ పనులు చేయడానికి పనులు మొదలు పెట్టలేదన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కదుల నారాయణరెడ్డి డబల్ రోడ్డు వేసేందుకు కూడా ప్రతిపాదన పంపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కేతగుడిపి, సూరెపల్లి, జగన్నాథపురం, పోతలపాడు గ్రామాలలో జల జీవన్ మిషన్ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని పలువురు సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కేతగుడిపి, బుడ్డపల్లి, పోతలపాడు, గానుగపెంట గ్రామాల్లో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొందని సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెన్నా ఇందిరా, వ్యవసాయాదికారి చంద్రశేఖర్‌రావు, వెలుగు ఏపీఎం డి.పిచ్చి, విద్యుత్ శాఖ ఏఈ హనుమాన్ నాయక్, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మా భూమిని మాకు అప్పగించండి!

తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితుల ధర్నా


పురుగుమందు డబ్బాతో బాధిత కుటుంబ సభ్యుల ధర్నా

తర్లుపాడు, ఆగస్టు 29: మా భూమి మాకు అప్పగించండి అంటూ తర్లుపాడులోని ముదిరాజ్ కాలనీకి చెందిన గోవు అంకమ్మ కుటుంబ సభ్యులు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తమ కుటుంబానికి జీవనాధారంగా ఉన్న భూమి లేకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ పురుగుమందు డబ్బాతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. 1994లో ఇంటి స్థలాల కోసం గోవు అంకమ్మకు చెందిన సర్వే నెం.391లో మొత్తం 3.94 ఎకరాల భూమి ఉండగా, అందులో 3.50ఎకరాల భూమిని ప్రభుత్వం పరిహారం ఇచ్చి తీసుకుందన్నారు. అప్పట్లో ముదిరాజ్‌లకు ఇంటి స్థలాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఆ సర్వే నెంబర్‌లో మిగిలిన 44 సెంట్ల భూమికి భూమిని తమకు చూపించాలని పదేళ్లగా తహసీల్దార్ కార్యాలయం, కందుకూరు ఆర్డీవో కార్యాలయం, మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామన్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. విధిలేని పరిస్థితుల్లో పురుగు మందు డబ్బాతో ధర్నా చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తమకు న్యాయం జరగకపోతే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని అంకమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ధర్నా చేశారు. గురువారం తహసీల్దార్ ఒంగోలు సమావేశానికి వెళ్లగా.. డిప్యూటీ తహసీల్దార్ సెలవులో ఉన్నారు. కార్యాలయంలో సిబ్బంది కూడా ఎవరూ లేకపోవడంతో సాయంత్రం 6గంటల వరకు ధర్నా చేసి ఇంటికి వెళ్లిపోయారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 29 : రక్తదానంతో మరొకరిని ప్రాణపాయస్థితినుంచి కాపాడవచ్చునని టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ముస్లిం యూత్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ రక్తదానాలు చేయించడం అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్న వ్యక్తులకు రక్తదానం చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఏ వైద్యశాలలో ఎవరికి రక్తం అవసరం ఏర్పడిన తమ సంస్థలోని యువకులను పిలిపించి అర్ధరాత్రి సైతం ఆయన రక్తదానం చేయించారన్నారు. ముస్లిం యూత్ సొసైటి అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ప్రాణపాయ స్థితిలోఉన్న వారికి రక్తదానం చేయించాలన్న ఆలోచనతో ఐదేళ్లగా సేవచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో 80 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఎర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాల బ్లడ్‌బ్యాంక్ టెక్నికల్ సిబ్బంది రక్తసేకరణ చేశారు. రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన యువకులకు జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో ముస్లిం యూత్ సొసైటి అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్, వైద్యశాల కో-ఆర్డినేటరు యాదిద్య, డాక్టరు శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు శనగా నారాయణరెడ్డి, వేగినాటిశ్రీను, తోట మహేష్, కంచర్ల సత్యనారాయణగౌడ్, మంత్రు నాయక్, ముస్లిం యూత్ సొసైటి సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలి


మాట్లాడుతున్న ఎంఈవో మస్తాన్‌నాయక్

పెద్ద దోర్నాల, ఆగస్టు 29: పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంసీ ఛైర్మన్లు తోడ్పడాలని ఎంఈవో మస్తాన్‌నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మిడ్‌డేమీల్, స్కూల్ శానిటేషన్ కో-ఆర్డినేషన్ కమ్యూనిటీ ఇన్వాల్వ్‌మెంట్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఎస్ఎంసీ ఛైర్మన్లు మధ్యాహ్న భోజనం పరిశీలించాలన్నారు. వారంలో రెండు రోజులు పాఠశాలలోని మరుగుదొడ్లను ఫోటోలు తీసి ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. విద్యార్థుల హాజరును ఉపాధ్యాయులు సమయానికి నమోదు చేయాలన్నారు. సిలబస్ ఆధారంగా విద్యాబోధన ఉండాలన్నారు. అదేవిధంగా సెప్టెంబరు 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పాఠశాలలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 30వ తేదీన వన మహోత్సవం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కొండలరావు, ప్రధానోపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, ఎస్ఎంసీ ఛైర్మన్లు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

అష్టావధానంతో అలరించిన విద్యార్థులు


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కంభం, ఆగస్టు 29 : కంభం పట్టణంలోని పలు పాఠశాలల్లో తెలుగుభాషా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. హజరత్‌గూడెంలో పాఠశాల విద్యార్థులు చేసిన అష్టావధానం పలువురిని అలరించింది. 6, 7, 8 తరగతుల విద్యార్థులు వేమన శతకాలు అప్పచెప్పారు. 50 పద్యాలు నేర్చుకున్న విద్యార్థులను ప్రశంసిస్తూ, బహుమతులు అందజేశారు. గురువారం దాత వల్లంశెట్టి వెంకటేశ్వర్లు సహకారంతో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని, తరగతిగదిని గదికి రక్షణగా గ్రిల్‌ను ప్రారంభించారు. భాషపై పట్టు కలిగిన వారు అలవోకగా మాట్లాడగలరన్నారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం సరోజ, గ్రామస్థులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, సీఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికలకు అవగాహన


బాలబాలికలకు అవగాహన కల్పిస్తున్న కమ్యూనిటి వైద్యాధికారి

గిద్దలూరు, ఆగస్టు 29 : మండలంలోని వెల్లుపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో 'గుడ్ టచ్, బ్యాడ్ టచ్'పై కమ్యూనిటీ వైద్యాధికారిణి శివభాయ్ అవగాహన కల్పించారు. బాలికలపై, యువతులపై అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ట్లు పేర్కొన్నారు. బంధువులు గాని, అపరిచిత వ్యక్తులు గాని అనుచితంగా ప్రవర్తిస్తే ఎలా వ్యవహరించాలో విషయంపై చిత్రపటాల ద్వారా బాలబాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశావర్కర్ సాలమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

31న పింఛన్ల పంపిణీ

గిద్దలూరు, ఆగస్టు 29 : ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వృద్ధాప్య, వితంతు, వికలాంగ ఫించన్లను ఈ నెల 31న లబ్ధిదారులకు అందచేయనున్నట్లు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఫించన్‌దారులు గమనించి తమ వద్దకు వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో 31వ తేదీనే ఫించన్లు తీసుకోవాలని సూచించారు.

రేపు సామాజిక పింఛన్లు

పొదిలి, ఆగస్టు 29: ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఈ నెల 31న లబ్ధిదారులకు పంపిణీ చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిందని ఎంపీడీవో శ్రీకృష్ణ తెలిపారు. సెప్టెంబరు 1న ఆదివారం కావడం ఆ రోజు ఉద్యోగులకు సెలవుదినం కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. 31వ తేదీన పెన్షన్ తీసుకోని వారికి 2వ తేదీన పెన్షన్ నగదు అందజేసేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఆయన అన్నారు.

దోర్నాలలో మినీథియేటర్ ప్రారంభం


సినిమా మినీ థియేటర్‌ను ప్రారంభిస్తున్న కందుల, గూడూరి

పెద్ద దోర్నాల, ఆగస్టు 29: దోర్నాలలో మాజీ సర్పంచి వెచ్చా హరగోపాల్ నూతనంగా నిర్మించిన సినిమా మినీ థియేటర్‌ను మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి, ఎర్ర గొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కందుల రామిరెడ్డి, టీడీపీ మండల నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, చంటి, సమ్మద్ భాష, షేక్ మంజూర్ భాష, కే సుబ్బారెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, భాష, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుగా శాంతి ఉద్యోగ బాధ్యతలు


బాధ్యతలు చేపట్టిన శాంతి

పెద్దదోర్నాల, ఆగస్టు 29 : దోర్నాల మండల తహసీల్దారుగా కిన్నెర శాంతి గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన హమీద్ బదిలీపై వెళ్లారు. బాలాజీని నియమించినా బాధ్య తలు చేపట్టలేదు. దీంతో శాంతిని ప్రభుత్వం నియమించింది. బాధ్యత లు చేపట్టిన శాంతిని రెవెన్యూ అధికారులు, పలువురు రాజకీయ నాయకులు సన్మానించారు.

ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గం

గిద్దలూరు టౌన్, ఆగస్టు 29 : ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గమని హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ప్రాజెక్టు మేనేజర్ కటికల విజయకుమారి అన్నారు. గురువారం పట్టణంలోని ఎబీఎం పాలెం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విజయకుమారి మాట్లాడుతూ ఎయిడ్స్ అంటించుకునే వ్యాధి అని, ఈ వ్యాధికి చికిత్స లేదన్నారు. నివారణ ఒక్కటే మార్గమన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్నచూపు చూడవద్దన్నారు. క్షయవ్యాధి, సుఖవ్యాధుల గురించి అవగాహన కల్పించారు. హెచ్‌వోసీ సిబ్బంది ప్రసన్న, భవాని, రిబ్కా పాల్గొన్నారు.

ఘనంగా నారాయణస్వామి వర్ధంతి

పొదిలి, ఆగస్టు 29: టీడీపీ నాయకులు మాజీ మంత్రి కాటూరి పెదనారాయణస్వామి వర్ధంతిని పొదిలి టీడీపీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పొదిలి చినబస్టాండ్‌లో ఉన్న నారాయణస్వామి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జిలానీ భాష, సామిరాజ, బుడ్డి జిలాని, షహీద్, కోటి, మత్తయ్య, దేవప్రసాద్, చిన్నసుబ్బ, పీరు బుడజిలానీ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు కుంకుమబండ్లు

కొనకనమిట్ల, ఆగస్టు 29 : మండలంలోని చినారికట్ల గ్రామంలోని పోలేరమ్మకు గురువారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. తమగ్రామాన్ని చల్లగా చూడాలంటూ కుంకుమ బండ్లు కట్టారు. ఏటా శ్రావణమాసంలో పోలేరమ్మకు పూజలు చేయడం గ్రామంలో ఆనవాయితీ. ఈ సందర్భంగా పోలేరమ్మను నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకొన్నారు. నైవేద్యాలు సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సాయంత్రం వైసీపీ, టీడీపీ ఆధ్వర్యంలో కుంకుమబండ్లు కట్టి గ్రామమాడ వీధుల్లో ఊరేగించారు. ఈ సంబరాన్ని గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ సుధాకర్ సిబ్బందితో కలసి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కొమరోలు, ఆగస్టు 29 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని బాలిరెడ్డిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గురువారం రాత్రి చోటుచేసుకొంది. అందిన వివరాల మేరకు, మండలంలోని నల్లగుంట్ల గ్రామానికి చెందిన షేక్ భాష తన ద్విచక్రవాహనంపై కొమరోలుకు వచ్చి పని ముగించుకొని స్వగ్రామమైన నల్లగుంట్లకు వెళుతున్నాడు. మార్గమధ్యలో కడప- అమరావతి రాష్ట్రీయ రహదారిలోని బాలిరెడ్డిపల్లి క్రాస్ రోడ్డు వద్ద వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో భాష తలకు, కాళ్లకు తీవ్రమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుని 108 వాహనంలో గిద్దలూరు తరలించారు.

ఘనంగా తెలుగు భాష, క్రీడా దినోత్సవం

తర్లుపాడు, ఆగస్టు 29: తర్లుపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగుభాష, జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుధాకర్‌బాబు మాట్లాడుతూ.. 'దేశ భాషలందు తెలుగు లెస్స' అంటూ ఘన కీర్తి పొందిన భాష తెలుగు భాష అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినాన్ని తెలుగుభాష దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు చెంచునాయుడు ఆధ్వర్యంలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : జెడ్పీ బాలికల ఉన్నత పాఠశా లలో తెలుగు ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో తెలుగు భాషాదినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహిం చారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీదేవి మాట్లాడుతూ.. తెలుగుబాషపై పట్టుసాధిస్తే ఇతర భాషలు తేలికగా నేర్చుకోవచ్చన్నారు. తెలుగు ఉపాధ్యాయులు రవిచంద్రకుమార్, విజయలత, స్వర్ణలత, శ్రీదేవి, సాంబశివరాజులను సీనియర్ ఉపాధ్యాయని శైలజాంబ సత్కరించారు. ఇక జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా డిప్యూటీ డీఈవో చంద్రమౌళి ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థు లకు బహుమతులు అందించారు. విద్యార్థులు ఇంద్ర దనస్సుల గొడుగులు ప్రదర్శించి డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్ డి.శ్యామలాదేవి పాల్గొన్నారు. స్థానిక వాసవి విద్యానికేతన్‌లో ప్రిన్సిపాల్, డైరెక్టర్ కందెపు రంగయ్య ఆధ్వర్యంలో మాతృభాషా, క్రీడాదినోత్సవం నిర్వహించారు. శ్రీ సాయిబాలాజీలోనూ క్రీడా, మాతృభాష దినోత్సవాలు నిర్వహించారు.

పెద్దదోర్నాల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ నారాయణరెడ్డి, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.సావిత్రి ఆధ్వర్యంలో జాతీయ క్రీడాదినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్, తెలుగు భాషా కోవిధుడు గిడుగు వెంకట రామమూర్తి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలు ఆటలపోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమంలో అధ్యాపకులు విజయబాబు, జయసింహా, శ్రీనివాసాచార్యులు, నాగరాజు, అక్రమ్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు నాగమూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది రామానాయక్, విజయమాణిక్యం, అనసూయాదేవి, కిరణ్‌కుమార్, రామానాయక్, శిరీష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పామూరు, ఆగస్టు 29: మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ ఎం.భీమానాయక్ అన్నారు. విద్యపై దృష్టి సారించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని చెప్పారు. గురువారం స్థానిక అక్షర కళాశాలలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, హెల్మెట్ వాడకంతో జరిగే లాభాలు గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అక్షర విద్యాసంస్థల కరస్పాండెంట్ కదిరి బాబురంగారావు, ప్రిన్సిపాల్ జాజం శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గేదెను ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి

పామూరు, ఆగస్టు 29: గేదెను ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన పామూరు మండలం గోపాలపురం వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వగ్గంపల్లికి చెందిన బైరెడ్డి శివశంకర్‌రెడ్డి (30) పామూరు నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈక్రమంలో వగ్గంపల్లి గ్రామ సమీపంలో గేదె రోడ్డుపైకి అడ్డుగా రావడంతో ఢీకొన్నాడు. ఈప్రమాదంలో శంకర్‌రెడ్డి తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, నెలలు నిండని శిశువు ఉన్నారు.

తమ గ్రామానికి చెందిన బంధువు తలకొండపాడు వద్ద గేదెలను తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి గాయపడగా పామూరులోని ప్రయివేట్ వైద్యశాలలో చేర్పించారు. విషయం తెలుసుకొన్న శంకర్‌రెడ్డి పామూరుకు వచ్చి క్షతగాత్రున్ని మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనాన్ని తీసుకొని వగ్గంపల్లికి వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుందని మృతుని బంధువులు తెలిపారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఘనంగా రామాలయ ధ్వజస్తంభ పూజలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 29: మండలంలోని మిట్టపాలెం గ్రామంలో గల శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠచేసి పదహారు రోజుల సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి మహంకాళి మంకాల సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాములపాటి మాధవప్రసాద్, చలవాది తిరుపతయ్య, రమణయ్య, పి.నరేంద్ర, రాజేంద్రప్రసాద్, లక్ష్మీనరసయ్య, మాల్యాద్రి, ప్రసాద్, ఆదినారాయణ, పి.గురవయ్య, తదితరు లు పాల్గొన్నారు.

అపుస్మా నియోజకవర్గ అధ్యక్షుడిగా ముత్తిరెడ్డి

వెలిగండ్ల, ఆగస్టు 29: ప్రయివేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) కనిగిరి నియోజకవర్గ అధ్యక్షుడిగా నాగిరెడ్డిపల్లి పంచాయతీలోని కేవీఎస్ పాఠశాలకు చెందిన ముత్తిరెడ్డి వెంకటరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు వెలిగండ్లలో నిర్వహించిన సంఘ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మాంటిసోరి పిచ్చిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా షేక్ రఫీ, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ షరీఫ్, కోశాధికారిగా అంకిరెడ్డిని ఎన్నుకున్నారు ఈసందర్భంగా ముత్తిరెడ్డి మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న శాస్త్రవేత్తలు, విద్యార్థినులు

దర్శి, ఆగస్టు 29: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాల్సి బాధ్యత ఎంతైనా ఉందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్ తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం కస్తూర్బా పాఠశాల విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు సెప్టెంబరు నెలాఖరులోగా 80 కోట్ల మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

దొనకొండ, ఆగస్టు 29: పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని స్థానిక ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సునీత పేర్కొన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్లీ హెల్త్ డే, హ్యాండ్ వాష్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, వివాహ వయస్సు, సమతుల్య ఆహారం తీసుకోవటం, తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో విన్యాసమ్మ, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముండ్లమూరు, ఆగస్టు 29: మండలంలోని పెదఉల్లగల్లు గ్రామం వద్ద గురువారం సాయంత్రం ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. తాళ్ళూరు మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన లక్ష్మయ్య అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై దర్శి వెళుతున్నాడు. ఈక్రమంలో పెద ఉల్లగల్లు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో గాయాలయ్యాయి. స్థానిక ఆర్ఎంపీ వద్ద గ్రామస్థులు ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పల్లెల్లో ప్రశాంత వాతావరణంలో జీవించాలి

ముండ్లమూరు, ఆగస్టు 29: పల్లెల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలని డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ అన్నారు. అనవసరంగా గొడవలకు వెళ్ళి ప్రశాంతతకు భంగం కలిగించవద్దన్నారు. గురువారం మండలంలోని మారెళ్ళ గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో అందరూ ఐక్యంగా ఉండటం వల్ల ఎంతో ప్రశాంతత ఉంటుందన్నారు. కొందరు అనవసరంగా వివాదాల్లో తలదూర్చి జైలు పాలవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వై.నాగరాజు, రైటర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో చంద్రమౌళీశ్వర్

కనిగిరి ఆగస్టు 29: శాస్త్ర సాంకేతిక రంగంవైపు విద్యార్థులను ప్రోత్సహించాలని డిప్యూటీ ఈవో చంద్రమౌళీశ్వర్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలన్నారు.

కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్, బి.రమేష్, ఎంఈవోలు సంజీవి, నారాయణరెడ్డి, దేవిరెడ్డి రామిరెడ్డి, డి.రామిరెడ్డి, ఆర్. శ్రీనివాసులు, బి.తిరుపతయ్య, కె.రాము, పీవీ రమణయ్య, ఎస్.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా చేపల పెంపకం కేంద్రం

» మత్స్యకారులకు అందని సహకారం
» పట్టించుకోని అధికారులు
» వ్యాపారుల చేతుల్లో సొసైటీ చెరువులు



ఖాళీగా చేపలు పెంచే తొట్లు



మత్స్యశాఖ కార్యాలయం ఎదుట నిలబడిన మురుగునీరు

దర్శి, ఆగస్టు 29: సొసైటీ చెరువులకు చేపపిల్లలను అందించి మత్స్యకారుల జీవనోపాధి పెంపుదలకు తోడ్పడవలసిన చేపపిల్లల పెంపకం కేంద్రం నామమాత్రంగా పనిచేస్తుంది. ప్రతి ఏడాది అరకొరగా చేపపిల్లలను పెంచుతూ మమ అనిపిస్తున్నారు. ఈఏడాది ఇప్పటివరకు చేపపిల్లలను పెంచే కార్యక్రమం చేపట్టలేదు. చేపపిల్లలు పెంచే తొట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మత్స్యశాఖ అభివృద్ధి కార్యాలయం అధ్వానంగా మారింది. కార్యాలయం ఎదుట కుంటలా మురికినీరు నిల్వఉంది. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా అక్కడ పనిచేస్తున్న సిబ్బంది మురికినీరు పక్కకు పంపే ప్రయత్నం కూడా చేయలేదు. వెనుకవైపు నుంచి మరో తలుపు తీసుకొని విధులు నిర్వహిస్తున్నారు. ముందువైపు నీరు నిల్వ ఉండటంతో ముఖద్వారం తలుపునకు తాళం వేశారు. ఎన్నో సంవత్సరాలుగా మత్స్యశాఖ పనితీరు అంతంతమాత్రంగా నడుస్తుంది. ఉన్నతాధికారులు ఈ కార్యాలయం వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఎక్కువ కాలం ఇన్‌చార్జ్‌లతోనే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో మత్స్యకారులకు అవసమైన సహకారం అందటంలేదు.

వ్యాపారుల చేతుల్లో సొసైటీ చెరువులు

చేపలు పెంచుకొని జీవనం సాగించే మత్స్యకారుల కోసం ఏర్పాటుచేసిన సొసైటీ చెరువులు వ్యాపారుల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆపార్టీ నాయకుల అండతో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు సొసైటీ చెరువులను కైవసం చేసుకొన్నారు. యథేచ్ఛగా చేపలు పెంచుకొని విక్రయించి సొమ్ము చేసుకున్నారు. వాస్తవంగా మత్స్యకారులకు నామమాత్రపు ధరకు ఆ చెరువులను లీజుకు ఇస్తారు. అయితే, వ్యాపారులు మత్సకారులకు నామమాత్రంగా డబ్బులు చెల్లించి నిబంధనలకు విరుద్ధంగా ఆ చెరువుల్లో వారు చేపలు పెంచుకొని అమ్ముకొని లాభాలు గడిస్తున్నారు. మత్స్యకారులకు అందాల్సిన ఫలం వ్యాపారులు దిగమింగుతున్నారు. దర్శి మండలంలోని తూర్పువీరాయపాలెం, పోతకమూరు, ముండ్లమూరు మండలంలోని పులిపాడు చెరువులు ఒకే సొసైటీ పరిధిలో ఉన్నాయి. ఈ చెరువుల్లో మత్స్యకారుల పేరుతో ఇతర జిల్లాకు చెందిన ఒక వ్యాపారి చేపలు పెంచుకొని గత ఐదేళ్లుగా అనుభవిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో మత్స్యశాఖ పనితీరులో మార్పు వస్తుందని ఆశించారు. ఇప్పటి వరకు ఆశాఖ తీరు అలాగే కొనసాగుతోంది. ఉన్నతాధికారులు ఈవిషయాన్ని గుర్తించి నిబంధనల మేరకు సొసైటీ చెరువుల్లో మత్స్యకారులే చేపలు పెంచుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చేపపిల్ల పెంపకం కేంద్రం పూర్తిస్థాయిలో పనిచేసేవిధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యాధికారి కుర్చీలో ఇన్‌చార్జ్

» వివాదాస్పదంగా మారిన లక్ష్మి తీరు



సూపరింటెండెంట్ కుర్చీలో కూర్చొని మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఆగస్టు 29: దర్శి ప్రభుత్వ ఆస్పత్రి పనితీరును టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పరిశీలించటం వివాదాస్పదమైంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ కుర్చీలో కూర్చొని ఆమె డాక్టర్లతో చర్చించటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో ప్రజలు సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ హాస్పటల్‌లో వైద్య సేవలు ఎలా జరుగుతున్నాయో తెలుసుకునేందుకు బుధవారం ఆమె ప్రభుత్వ వైద్యశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సూపరింటెండెంట్ సీట్‌లో కూర్చొని డాక్టర్లతో మాట్లాడారు. రోగులకు వైద్యం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆమెకు ఎలాంటి హోదా లేక పోయినా నేరుగా సూపరింటెండెంట్ సీట్‌లో కూర్చోవటం వివాదాస్ప దమైంది. ఈ విషయం సర్వత్రా చర్చనీయాంశమైంది.

ఆ సీట్ సూపరింటెండెంట్‌ది కాదు

ప్రభుత్వ హాస్పటల్‌లో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కూర్చున్న సీటు సూపరింటెండెంట్‌ది కాదని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సుమన్ తెలిపారు. ఒక డాక్టర్ గదిలో ఆమె కూర్చొని మాట్లాడారని తెలిపారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మంచి పేరున్న డాక్టర్ అయినప్పటికీ డాక్టర్ సీటు పక్కన ఉన్న సీట్‌లో కూర్చునే ప్రయత్నం చేశారన్నారు. ఆ కుర్చీ సరిగా లేకపోవటంతో డాక్టర్ సీట్లో కూర్చోమని చెప్పామన్నారు. తమ విజ్ఞప్తి మేరకే అక్కడ కూర్చొని రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారని, ఆమె సూపరింటెండెంట్ సీట్‌లో కూర్చున్నారని వస్తున్న కథనాలు అవాస్తవమన్నారు. ప్రభుత్వపరంగా అవసరమైన అన్ని వనరులను హాస్పటల్‌కు సమకూర్చుతామని ఈ సందర్భంగా ఆమె చెప్పినట్టు వివరించారు.

టూరిజం ప్రాంతంగా కనిగిరికి గుర్తింపు తీసుకొస్తాం!

» ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి



పార్క్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి ఆగస్టు 29: ఎంతో పురాతన చరిత్ర వైభవం కల్గిన కనిగిరి దుర్గంను టూరిజం ప్రాంతంగా గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. హనుమంతునిపాడు మండలంలోని హాజీపురం గ్రామ పరిధిలోని ఎకో టూరిజం ఆఫ్ ఇండియా చేపట్టిన పార్క్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈప్రాంతంలో ఆహ్లాదకరమైన ప్రాంతంలో టూరిజం ఏర్పాటుచేయటం శుభపరిణామమన్నారు. పార్క్‌లో జరిగే ఏర్పాట్లపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.రామిరెడ్డితో చర్చించారు. పార్క్ ఏర్పాటుపై విస్తృత ప్రచారం జరగాలని సూచించారు. పార్క్‌లో ఏర్పాటుచేసిన క్రీడా వస్తువులను పరిశీలించారు. ఇలాంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలు తమ కుటుంబసభ్యులతో సేద తీరితే ఎంతో ఆటవిడుపుగా ఉంటుందన్నారు. పార్క్ అభివృద్ధికి తన సహకారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఫారెస్ట్ డీఆర్‌వో తులసీరావు, బీట్ ఆఫీసర్ నరసింహం, టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), గాయం తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న తురకపాలెం సచివాలయం

» తాళం అప్పగించిన కాంట్రాక్టర్



సచివాలయ కార్యదర్శికి భవనం అప్పగిస్తున్నట్లు పత్రం అందజేస్తున్న ఏఈ వెంకటేశ్వరరావు

తాళ్లూరు, ఆగస్టు 29: మండలంలోని తురకపాలెం నూతన సచివాలయం తెరుచుకుంది. సచివాలయం తాళాన్ని బుధవారం రాత్రి పంచాయతీ అధికారులు సచివాలయ కార్యదర్శికి అప్పగించారు. 'సచివాలయం వినియోగంలోకి వచ్చేనా' శీర్షికన ఈనెల 4న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం సచివాలయ తాళాన్ని వైసీపీ నేత నుంచి తీసుకుని కార్యాలయాన్ని తెరిపించారు. నూతన సచివాలయం నిర్మించిన కాంట్రాక్టర్ తనకు బిల్లులు పెండింగ్ ఉన్నాయని, చెల్లించేవరకు తాళం ఇవ్వనని స్పష్టం చేశారు. దీంతో సచివాలయ భవనం వినియోగంలోకి రాలేదు. భవన నిర్మాణ పనులు పూర్తికావటంతో వైసీపీ గ్రామ నేత ఎన్నికల ముందు జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ చేతులు మీదుగా ప్రారంభించారు. అయితే, వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోవటంతో భవనాన్ని నిర్మించిన ఆపార్టీకి చెందిన కాంట్రాక్టర్ బిల్లులు చెల్లించలేదంటూ మూడు నెలలుగా తాళం ఇవ్వలేదు. నూతన భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ గురవారెడ్డి స్థానిక ఎంపీడీవో, పంచాయతీ రాజ్ అధికారులకు అనేకమార్లు విన్నవించారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు పలుమార్లు ఎంపీడీవోను పిలిపించి మాట్లాడారు. బిల్లుల బకాయిలు ఉన్నాయని తాళం ఇవ్వక పోవటమేమిటని ప్రశ్నించారు. పనులు పూర్తికాకపోతే జడ్పీ చైర్‌పర్సన్‌తో ఎలా ప్రారంభించారని, మరలా తాళం వేయటమేమిటని నిలదీశారు. సమస్యను అధికారులు పరిష్కరించకుంటే తామే తగు చర్యలు చేపడతామని, గ్రామంలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే అందుకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమస్య జటిలమవుతుండటంతోఎంపీడీవో సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించారు. వారి ఆదేశానుసారం ఏఈ ఎం.వెంకటేశ్వర్లు కాంట్రాక్టర్‌తో మాట్లాడి నూతన సచివాలయం తాళం తీయించి సచివాలయ కార్యదర్శి కోటేశ్వరరావుకు అందజేశారు. దీంతో సమస్య వీడింది.

'దొనకొండ'కు స్కూల్ అఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న పీడీ నర్సింహారావు

దొనకొండ, ఆగస్టు 28: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన స్కూల్ అఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుకు దొనకొండ జడ్పీ పాఠశాల ఎంపికైంది. జిల్లాలో ఎంపికైన ఐదు పాఠశాలల్లో దొనకొండ పాఠశాల జిల్లాస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. గురువారం మైనంపాడులోని ప్రభుత్వ డైట్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో దొనకొండ జడ్పీ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నర్సింహారావుకు డైట్ కళాశాల ప్రిన్స్‌పాల్ శ్రీనివాసరావు, సంతనూతలపాడు ఎంఈవో వెంకటరెడ్డి, ఇతర అధికారులు మెమెంటో, సర్టిఫికెట్ అందజేసి సత్కరించారు. ఈసందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో స్కూల్ గేమ్స్ అఫ్ ఫెడరేషన్ ఇండియా వారు నిర్వహించిన జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని సాధించిన విజయాల ఆధారంగా ఈ అవార్డు పాఠశాలకు లభించిందన్నారు. రాష్ట్రస్థాయి ఎంపికలో 224 పాయింట్లు సాధించటంతో జిల్లాస్థాయిలో రెండో స్థానంలో అవార్డు అందుకోవటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ కె.వనజ, అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వీసీపల్లి, ఆగస్టు 29: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ షేక్ ఖాజావలి అన్నారు. గురువారం వీసీపల్లి పోలీసుస్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అవగాహనలేక అనేకమంది నష్టపోతున్నారన్నారు. నిరక్ష్యరాస్యులతో పాటు చదువుకున్నవారు కూడా సైబర్ నేరగాళ్ల వలలో పడి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈనేరాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మనకు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులను, మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పలు యాప్‌లను ఇన్‌స్టాల్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొరపాటున సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన పేర్కొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

పామూరు, ఆగస్టు 29: మానసిక వికాసంతో పాటు శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని ప్రిన్సిపాల్ ఎం.జయకుమార్ అన్నారు. స్థానిక సెయింట్ మార్క్స్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని క్రీడాపోటీలు నిర్వహించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించలన్నారు. అనంతరం తెలుగు బాషా దినోత్సవం నిర్వహించారు.

ఎస్ఐగా శివ బాధ్యతల స్వీకరణ

కురిచేడు, ఆగస్టు 29: కురిచేడు ఎస్ఐగా ఎం.శివ గురువారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పర్యవేక్షణకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నూతన ఎస్ఐ శివను సిబ్బందితోపాటు టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న సీఐ ఖాజావలి

సామరస్యంగా వినాయకచవితి వేడుకలు జరుపుకోవాలి

కనిగిరి ఆగస్టు 29: వినాయకచవితి వేడుకలను సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని సీఐ ఖాజావలి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులు అను మతి లేకుండా గణేష్ మండపాలు ఏర్పాటుచేయరాదన్నారు. మంటపాల వద్ద రాత్రి వేళల్లో ఇద్దరు తప్పనిసరిగా ఉండ టంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇతర మతాల వారిని గౌరవించే విధంగా నడుచుకోవాలన్నారు. నిమజ్జనం చేసే చెరువు వద్ద లైటింగ్ ఏర్పాట్లు నిర్వాహకులే చేపట్టాలన్నారు. మంటపాల వద్ద ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీలు కానీ, రాజకీయ నాయకుల ఫొటోలు కానీ ఉండరాదన్నారు. ఊరేగింపు సమయంలో యువత టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జనానికి మైనర్లను తీసుకువెళ్తే సంబంధిత నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ త్యాగరాజు, సిబ్బంది వెంకట్రావు, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

పామూరు, ఆగస్టు 29: తెలుగు భాషా దినోత్సవ వేడుకలను గురువారం స్థానిక కేజీబీవీలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు భాషకోసం రామ్మూర్తి చేసిన సేవలను, క్రీడలకు ధ్యాన్‌చంద్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కటకం సజన, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అలాగే, మండలంలోని నర్రమారెళ్ల పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ ఎం షేక్ మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు టి.రమేష్, బి.కోటేశ్వరరావు, ఎన్. నీరజ, కె.సుజాత, డి.నాగేశ్వరరావు, ఎస్వీ ప్రసాద్, ఇ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీసీపల్లిలో.. వీసీపల్లి, ఆగస్టు 29: తెలుగుభాష తీయనైన భాష అని నేరే డుపల్లి ప్రధానోపాధ్యాయురాలు టి.అంజనీదేవి అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో ఆమె మాట్లాడా రు. తెలుగు భాష అమ్మవంటిదన్నారు. ఏస్థాయికి ఎదిగినా మాతృభాష అయిన తెలుగును మరువరాదన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

తాళ్లూరులో.. తాళ్లూరు, ఆగస్టు 29: తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం తాళ్లూరు శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథపాలకురాలు వి.విజయకుమారి మాట్లాడుతూ గిడుగు వెంకటరామ్మూర్తి తెలుగుభాష అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేశారని చెప్పారు. ఆయన జయంతి రోజును తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని చెప్పారు. ముందుగా గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటానికి పూల మాల లు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

కనిగిరిలో.. కనిగిరి ఆగస్టు 29: తెలుగు భాష గొప్పతనాన్ని చాటిచెప్పాలని కేటీఆర్ టెక్నో స్కూల్ చైర్మన్ కుందురు తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం పాఠశాలలో జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. దేశంలోని అన్ని భాషలకన్నా తెలుగు భాష ఎంతో గొప్పద న్నారు. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రఘురాంరెడ్డి, ఎంఈవో ప్రసాదరావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఐకిడ్స్ స్కూల్‌లోనూ ప్రపంచ తెలుగుభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలునాటాలి

ముండ్లమూరు, ఆగస్టు 29 : ప్రతి గ్రామ పంచాయతీలో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలు నాటాలని ఉపాధి హామీ పథకం ఏపీవో కె.నాగరాజు అన్నారు. గురువారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీలో మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ హనుమంతరావు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన కలిగిఉండాలి

ముండ్లమూరు, ఆగస్టు 29: జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పులిపాడు, కెల్లంపల్లి గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఫ్లోరోసిస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఫ్లోరోసిస్ ఎలా వస్తుందని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ముండ్లమూరు వైద్యాధికారి డాక్టర్ జాస్మిన్, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.





బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు



సభా ప్రాంగణం



- సీఎం రాకతో కళాశాల దశ తిరిగేనా?
- ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలో అన్నీ సమస్యలే
- వసతి లేక బోధన సాగక విద్యార్థుల అవస్థలు
- నిర్మాణాల నుంచి నియామకాల వరకూ నిర్లక్ష్యమే
- నేడు కళాశాలలో వనమహోత్సవానికి చంద్రబాబు, పవన్ రాక

జేఎన్‌టీయూ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థ. ఇలాంటి సంస్థలో సీటు కోసం విద్యార్థులు పోటీ పడతారు. కానీ నరసరావుపేట సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ కాకినాడ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు విముఖత చూపుతున్నారు. ఎనిమిదేళ్లుగా కళాశాలలో భవన నిర్మాణాలు ఒక కొలిక్కిరాలేదు. అధ్యాపక నియామకాల్లోనూ జాప్యం చోటుచేసుకుంటుంది. మొత్తంమీద అటు వసతి.. ఇటు బోధన సక్రమంగా సాగక అడ్మిషన్లు పొందిన విద్యార్థులు అల్లాడుతున్నారు. 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు జేఎన్‌టీయూ కేకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఈ కళాశాలను పట్టించుకోలేదు. ఇదే రీతిలో వర్సిటీ పాలకులు కూడా నిర్లక్ష్యం వహిస్తూ వచ్చారు. దీంతో ప్రస్తుతం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల సమస్యల సుడిగుండలో చిక్కుకుంది. గతంలో కళాశాల ఇక్కడ నెలకొల్పేందుకు కృషి చేసి శంకుస్థాపన చేసిన చంద్రబాబు తిరిగి శుక్రవారం ముఖ్యమంత్రి హోదాలో కళాశాలకు రానున్నారు. దీంతో కళాశాల భవితపై చంద్రబాబు దృష్టి సారిస్తారని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

జేఎన్‌టీయూ.. జాప్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సా...గుతున్న కళాశాల భవన నిర్మాణాలు. పూర్తికాని భవనాల్లో తరగతులు. 73 మంది అధ్యాపకుల కొరత.. ఇదీ నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల పరిస్థితి. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ సమస్యల సుడిగుండలో చిక్కుకుంది. నరసరావుపేటకు సమీపంలో జేఎన్‌టీయూ కాకినాడ ఇంజనీరింగ్ కళాశాలను 2016లో ఏర్పాటు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కళాశాలకు శంకుస్థాపన చేశారు. కళాశాల భవనాల నిర్మాణానికి జేఎన్‌టీయూ కాకినాడ రూ.90 కోట్లు మంజూరు చేయగా రూ.28 కోట్లతో పరిపాలన, ప్రయోగశాలలు, తరగతి గదుల నిర్మాణాలను చేపట్టారు. ఐదేళ్లుగా కళాశాల భవన నిర్మాణ పనులు సాగదీస్తున్నారు. తరగతులు నిర్వహించేందుకు వీలుగా మాత్రమే పనులు పూర్తి చేశారు. రూ.62 కోట్లతో చేపట్టిన వసతి గృహాల నిర్మాణ పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తికి నోచుకోలేదు. కళాశాల భవనాలు, వసతి గృహాల నిర్మాణాలు పూర్తికాక పోవడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కళాశాలలో ఐదు బ్రాంచ్‌లు ఉండగా వెయ్యి మందికిపైగా విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ఆ స్థాయిలో సౌకర్యాలు, వసతులు, బోధన జరగడంలేదు. పూర్తికాని భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రాంగణంలో వసతి గృహాలు లేక వసతికి విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

ఖాళీల వివరాలు ఇలా..			
క్యాడర్	ఉండాల్సిన వారు	ఉన్నవారు	ఖాళీ
ప్రొఫెసర్	8	1	7
అసోసియేట్లు	18	2	16
అసిస్టెంట్లు	53	4	49

ప్రాంగణ ఎంపికలు ఇలా..	
సంవత్సరం	ఎంపికైన విద్యార్థులు
2021	180
2022	150
2023	110
2024	72

అధ్యాపకుల కొరతతో బోధన సక్రమంగా జరగకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కళాశాల తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. నరసరావుపేట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు రావడానికి విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు.

అతిథి అధ్యాపకులే దిక్కు

ఇంజనీరంగ్ కళాశాల నిర్వహణపై కాకినాడ జేఎన్‌టీ యూనివర్సిటీ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. కళాశాలను నిర్వీర్యం చేసేలా వర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా అధ్యాపకులను నియమించడంలేదన్న విమర్శలున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో వర్సిటీ ఘోరంగా విఫలమవుతోంది. 2018 డిసెంబరులో టీడీపీ ప్రభుత్వం కళాశాలకు 80 అధ్యాపక పోస్టులను మంజూరు చేసి రూ.7.11 కోట్లు వార్షిక బడ్జెట్‌ను కేటాయించింది. అయితే వైసీపీ పాలకులు అధ్యాపకులను నియమించడాన్ని విస్మరించారు. పర్మినెంట్ అధ్యాపకులు ఏడుగురు మాత్రమే కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నది ఒకే ఒక ప్రొఫెసర్ కాగా అది కూడా ప్రిన్సిపాలే. అసోసియేట్ ప్రొఫెసర్లు కేవలం ఇద్దరే ఉండగా ఒకరు క్రీడలకు కేటాయించారు. కనీసం అధ్యాపకులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించే విషయంలోనూ వర్సిటీ అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు.

ఉద్యోగాలను కోల్పోతున్న విద్యార్థులు

అధ్యాపకుల కొరత వెంటాడుతుండటంతో ప్రతిభ కలిగిన విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోంది. అధ్యాపకులు లేకపోవడంతో ఇక్కడ విద్యార్థులు చేరేందుకు ఇష్టపడటంలేదు. దీంతో సీట్లు మిగిలిపోతున్నాయి. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడాల్సిన కళాశాలను వర్సిటీ నిరుపయోగంగా మార్చేస్తోందన్న విమర్శలున్నాయి. ఏటా ఉద్యోగాలు పొందే విద్యార్థుల సంఖ్య పెరగాల్సి ఉండగా ఈ కళాశాలలో దారుణంగా పడిపోతుంది. అయినా అటు ప్రభుత్వం కానీ ఇటు వర్సిటీ పాలకవర్గం కానీ పట్టించుకోవడంలేదు.

చంద్రబాబుపైనే విద్యార్థుల ఆశలు

జేఎన్‌టీయూ కాకినాడ ఎంతో ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థ. ఈ కళాశాల తమ ప్రాంతంలో ఉండాలని ప్రజల ఆశ. ఈ విద్యా సంస్థలో చదువుకోవాలనేది విద్యార్థుల కల. అలాంటి విద్యా సంస్థను ఉమ్మడి గుంటూరు జిల్లాకు తీసుకువచ్చిన ఘనత నాటి ముఖ్యమంత్రి చంద్రబాబుది. కాగా నరసరావుపేటలో ఏర్పాటు చేసేలా నాటి అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు చేశారు. 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కళాశాలకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వైసీపీ హయాంలో కళాశాల నిర్లక్ష్యానికి గురైంది. దీంతో ఎనిమిదేళ్లుగా కళాశాలలో నిర్మాణాల నుంచి అధ్యాపకుల నియామకాల వరకూ జాప్యమే. విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్లలోనూ నష్టపోతున్నారు. ఈ దశలో శుక్రవారం కళాశాల ప్రాంగణంలో జరిగే వనమహోత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొనేందుకు రానున్నారు. వీరి పర్యటనతో అయినా కళాశాల దశ మారుతుందని విద్యార్థులు భావిస్తున్నారు. నిర్మాణాల్లో జాప్యాన్ని నివారించి అధ్యాపకులను నియమిస్తారని.. కనీస వసతులు కల్పిస్తారని సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ స్పందించి ప్రకటన చేస్తారని విద్యార్థులు.. వారి తల్లి దండ్రులు ఎంతో ఆశతో ఉన్నారు. వీరి పర్యటనతో కళాశాల సమస్యలు పరిష్కారమైతే విద్యార్థులకు మేలు జరుగుతుందని చెప్పవచ్చు.



నిర్మాణంలో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్



బాలికల వసతి గృహం



బాలుర వసతి గృహం

నేడు.. చంద్రబాబు, పవన్ రాక

- నరసరావుపేట జేఎన్‌టీయూలో వనమహోత్సవం
- మొక్కలు నాటనున్న సీఎం, డిప్యూటీ సీఎం.. భారీగా పోలీసు బందోబస్తు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌కుమార్, జేసీ సూరజ్, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా టీడీపీ, జనసేన అధినేతలైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌లు ఒకే వేదికపైకి రానున్నారు. నరసరావుపేట మండలం కాకాని వద్ద ఉన్న జేఎన్‌టీయూ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం జరగనున్నది. ఈ కార్యక్రమంలో సీఎం, డిప్యూటీ సీఎంల హోదాలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు పాల్గొననున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వేర్వేరుగా రెండు హెలికాప్టర్లలో జేఎన్‌టీయూకు రానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. చంద్రబాబు, పవన్ మొక్కలు నాటి వనమహోత్సవాన్ని ప్రారంభిస్తారు. అనంతరం జరిగే బహిరంగ సభలో వారు ప్రసంగించనున్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు సభకు హాజరుకానున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జాయింట్ కలెక్టర్ సూరజ్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు పరిశీలించారు. సభకు హాజరయ్యే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని వారు అధికారులను ఆదేశించారు. బందోబస్తు ఏర్పాట్లపై ఎస్పీ సమీక్షించారు.

ఆర్భాటాలకు దూరంగా సభ

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు హంగు, ఆర్భాటాలు లేకుండా సభకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. ఐదారు వేల లోపు స్థానిక ప్రజానీకం మధ్య వన మహోత్సవం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారన్నారు. భద్రత విషయంలో మాత్రం రాజీ లేదన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

కార్యక్రమం ఇలా..

- ఉదయం 10.10 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో చంద్రబాబు బయలుదేరుతారు.
- 9.30 గంటలకు మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి పవన్‌కల్యాణ్ హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. జెఎన్‌టీయూ వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.15గంటలకు పవన్, 10.30గంటలకు చంద్రబాబు జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు వస్తారు.
- 10.45 గంటలకు కళాశాల ప్రాంగణంలో ఇద్దరూ కలిసి మొక్కలు నాటుతారు.
- అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు.
- 12.45 గంలకు బహిరంగ సభ ముగుస్తుంది.
- 12.50గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుని బయలుదేరి వెళ్తారు.



జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్

మళ్లీ సాగర్ గేట్లెత్తారు

- 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల
- దిగువుకు 3.07 లక్షల క్యూసెక్కులు విడుదల



26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

వీపీ సౌత్, మాచర్ల రూరల్/నరసరావుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ సాగర్ బంధనాలను తెంచుకుంది. ఈ సీజన్‌లో రెండో సారి నాగార్జున సాగర్ గేట్లు మొత్తం ఎత్తి దిగువుకు నీటిని విడుదల చేశారు. నాగార్జున సాగర్‌కు ఎగువ నుంచి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో సాగర్ జలాశయం క్రస్ట్ గేట్లన్నీ మళ్లీ తెరుచుకున్నాయ్. జలాశయం 26 గేట్లు ఎత్తి నీటిని గురువారం విడుదల చేశారు. ఈ నెలలో గేట్లన్నీ తెరుచుకోవడం ఇది రెండో సారి. క్రస్ట్ గేట్ల నుంచి పాల నురగలా జాలువారుతున్న కృష్ణమ్మ సోయగాలను తనివితీరా చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. డ్యాంకు వస్తున్న నీటిని వస్తున్నట్టుగా దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌లో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకోవడంతో 26 క్రస్ట్ గేట్లలో 12 గేట్లను 5 అడుగులు, 14 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,07,382 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. పూర్తి స్థాయి సామర్థ్యం 312.05 టీఎంసీలకు 312.04 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కుడి కాల్వ ద్వారా 9387, ఎడమ కాల్వ ద్వారా 8280, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,745 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్ల ద్వారా 3,07,382, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600 మొత్తం ఔట్‌ఫ్లో 3,56,194 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3,56,194 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు పోటెత్తుతున్న వరద

సాగర్ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. భారీగా వరద వస్తుండటంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి ప్రకాశం బ్యారేజ్‌కు 2,71,983 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతలకు 1,64,573 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఈ ప్రవాహం శుక్రవారానికి మూడులక్షల క్యూసెక్కులకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. పులిచింతల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా 42.57 టీఎంసీల నిల్వ ఉంది.

తీరంలో క్రాక్-2 సందడి

- రామాపురం, వాడరేవు మధ్య హిందీ సినిమా షూటింగ్
- మలినేని గోపీచంద్ దర్శకత్వంలో చేజింగ్ దృశ్యాల చిత్రీకరణ

వేటపాలెం(చీరాల), ఆగస్టు 29: హాలీవుడ్ తీరానికి దిగొచ్చింది. గతంలో రవితేజ హీరోగా రూపొందించిన క్రాక్ సినిమాకు సీక్వెల్‌గా క్రాక్-2గా చిత్రీకరణ వేటపాలెం మండలం రామాపురం, చీరాల మండలం వాడరేవు తీరం వెంట గురువారం జరిగింది. తెలుగులో స్టార్ దర్శకుడిగా గుర్తింపు పొందిన మలినేని గోపిచంద్ దర్శకత్వంలో హీరో సన్నీడియోల్ కథానాయకుడిగా కొన్ని పోరాట సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. నాలుగు రోజులుగా చినగంజాం మండలం మోటుపల్లి పరిసర ప్రాంతాల్లో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ క్రమంలో తాజాగా రామాపురం, వాడరేవు మధ్య ఫైట్ మాస్టర్ హెన్స్‌డెగ్ పర్యవేక్షణలో కార్లు, బైక్‌లతో ఫైటర్లు, హీరో మధ్య జరిగే చేజింగ్ దృశ్యాలను చిత్రీకరించారు. మరో వారం రోజులు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతుందని చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు. దర్శకుడు మలినేని గోపిచంద్ దర్శకత్వంలో ఈ ప్రాంతంలోనే రవితేజ హీరోగా క్రాక్ సినిమా రూపుదిద్దుకుంది.



షాట్‌ను దర్శకుడికి వివరిస్తున్న ఫైట్ మాస్టర్ హెన్స్‌డెగ్



ఫైటింగ్ సీన్‌కు చేస్తున్న ఏర్పాట్లు

- క్రీడాదినోత్సవ ర్యాలీలో కలెక్టర్ వెంకటమురళి

క్రీడలతో మానసిక స్థైర్యం

బాపట్ల, ఆగస్టు 29: క్రీడలతో విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం, మానసిక స్థైర్యం పెరుగుతుందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ సాగగా అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ర్యాలీలో అగ్రభాగాన కలెక్టర్, ఎమ్మెల్యే, డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ఆర్డీవో గంధం రవీందర్‌లు ఉండగా విద్యార్థులు ముందుకు సాగారు. ముందుగా హాకీ క్రీడాకారుడు దివంగత మేజర్ ధ్యాన్‌చంద్ పటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆరోగ్యంగా ఉండటానికి నిరంతరం వ్యాయామం, క్రీడల్లో పాల్గొంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అంతర్జాతీయ స్థాయిలో ఖోఖో క్రీడలలో బంగారుపతకం సాధించిన శివనాగిరెడ్డి జాతీయ స్థాయిలో ఇత్తడి పథకం సాధించిన కె.రామ్మోహన్, ఎం.ఫణికుమార్, సైక్లింగ్‌లో జాతీయస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పి.అనురాధ రెడ్డిలను సత్కరించి సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించటానికి రాష్ట్రప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలకు విద్యార్థులు బానిసలు కాకుండా మంచి వైపు అడుగులు వేయాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమే అయినా చిన్నారుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ కోచ్ కె.పాల్‌కుమార్, డీఈవో నారాయణ, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్, తహసీల్దార్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తదితరులు

లేఅవుట్లు.. లబోదిబో

- వసతులు కల్పన ఉండదన్న ఒడా
- చీరాల పరిధిలో 81 అనధికార లేఅవుట్ల గుర్తింపు
- హెచ్చరిక బోర్డులపై అమలు కాని మంత్రి నారాయణ ఆదేశాలు

చీరాల, ఆగస్టు 29: రియల్ వ్యాపారులు యథేచ్ఛగా లేఅవుట్లు వేశారు.. అధికారులు చూసీచూడనట్లు ఉన్నారు.. సామాన్యులు ఇళ్ల స్థలాలు కొనుగోలు చేశారు. తీరా.. ఇప్పుడు ఆయా లేఅవుట్లకు అనుమతి లేదు.. రిజిస్ట్రేషన్ జరగదని.. రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ, విద్యుత్ సరఫరా తదితర మౌలిక వసతులు కల్పించబోమని, నిర్మాణాలకు అనుమతులు ఇవ్వబోమని ఒడా(ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రకటించింది. దీంతో ఇప్పుడు ఆయా లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు లబోదిబోమంటున్నారు. ఒడా గణాంకాల ప్రకారం చీరాల నియోజకవర్గంలో 81 అనధికారిక లేఅవుట్లు ఉన్నాయి. వీటిలో ప్లాట్లు(నివేశన స్థలం) పూర్తిగా విక్రయించిన లేఅవుట్లు కొన్ని కాగా, పాక్షికంగా విక్రయాలు జరిగినవి కొన్ని. ఇవి కాక అధికారుల లెక్కల్లోకి రానివి మరికొన్ని ఉంటాయి. అనధికారిక లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులు పెట్టాలని మంత్రి నారాయణ చెప్పారు. దీంతో తమకు ఇబ్బందులు తప్పవని కొనుగోలుదారులు భావిస్తున్నారు. లేఅవుట్ యజమానులను పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తే చేదు అనుభవాలు ఎదురవుతున్నాయని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వమే తమకు న్యాయమైన పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ఎక్కడెక్కడ అనధికార లేఅవుట్లు

చీరాల నియోజకవర్గంలో 81 అనధికారిక లేఅవుట్ల ఉన్నట్లు ఒడా గుర్తించింది. వేటపాలెం మండలం కొత్తపేట పరిధిలో 20, అక్కాయిపాలెం పరిధిలో 25, చల్లారెడ్డిపాలెం పరిధిలో 13, పాపాయిపాలెం పరిధిలో 6, పందిళ్లపల్లి పరిధిలో 3 మొత్తం 67, చీరాల మండలం ఈపురుపాలెంలో 1, తోటవారిపాలెంలో 3, వాడరేవులో 4, చీరాల మున్సిపల్ పరిధిలో 6 లేఅవుట్లు ఉన్నాయి. రాజకీయ ఒత్తిళ్లు, కొంత స్వప్రయోజనాలతో చీరాల, వేటపాలెం మండలాల పరిధిలో యథేచ్ఛగా లేఅవుట్లు వేశారు. రియల్ వ్యాపారుల ఉచ్చులో పడి ఆయా లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇప్పుడు ఇబ్బందుల్లో పడ్డారు. అనధికారిక లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులపై మంత్రి నారాయణ ఆదేశాలు ఇంకా అమలు కాకపోవడంతో స్థానిక అధికారులపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పరిష్కార మార్గం..?

అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఎల్ఆర్ఎస్(ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీం), బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం) కింద క్రమబద్ధీకరణకు అవకాశం ఉంది. ఖాళీ స్థలం అయితే ఎల్ఆర్ఎస్ కింద, నిర్మాణాలు జరిగి ఉంటే బీపీఎస్ కింద వెసులుబాటు కల్పించవచ్చు. అలా చేస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. కొనుగోలుదారులకు భద్రత వస్తుంది. క్రమబద్ధీకరణకు అవకాశం వస్తే ఆ రుసుము లేఅవుట్లు వేసిన వ్యక్తి చెల్లించాలా, లేదంటే కొనుగోలుదారులు చెల్లించాలా అనే అంశంపై మల్లగుల్లాలు పడుతున్నారు. కొందరైతే తాము విక్రయించాం కాబట్టి తమకేమీ సంబంధం లేదని పొడిపొడిగా చెప్తున్నట్లు తెలిసింది.



కొత్తపేట, పాపాయిపాలెం మధ్య అనధికారిక లేఅవుట్

స్వచ్ఛందంగా కాలువ మరమ్మతులు

- అయినా నీటి విడుదలకు ససేమిరా
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు



రైతులు మరమ్మతులు చేసుకున్న కాలువ

అద్దంకి, ఆగస్టు 29 : సాగర్ కాలువలలో నీరు ప్రవహిస్తున్నా అవసరమైన చోటకు విడుదల చేసేందుకు అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని నాగులపాడు చెరువుకు మణికేశ్వరం మైనర్ నుంచి నీరు నింపుకునే అవకాశం ఉంది. అయితే చెరువుకు నీరు చేరే కాలువలు సరిగ్గా లేకపోవడంతో సుమారు లక్ష రూపాయలు వెచ్చించి రైతులే స్వచ్ఛందంగా మరమ్మతులు చేసుకున్నారు. చెరువుకు నీరు పెడితే గ్రామంలో బోర్లలో నీటి లభ్యత పెరగడంతోపాటు సమీప పొలాలకు నీటి తడులకు అవకాశం ఉంటుందని మంత్రి రవికుమార్ దృష్టికి రైతులు తీసుకుపోయారు. నీటి విడుదల చేయాలని మంత్రి రవికుమార్ అధికారులకు చెప్పారు. అయితే కొద్దిపాటి నీరు విడుదల చేసిన ఎన్ఎస్‌పీ అధికారులు ఏవో కారణాలు చెప్తూ నీటి విడుదల నిలిపేశారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఉద్దేశపూర్వకంగానే నీటి విడుదల నిలిపివేశారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నాగులపాడు చెరువుకు నీటి విడుదల జరిగేలా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

నర్సింగ్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్

- పాస్ చేసేందుకు విద్యార్థుల నుంచి భారీగా వసూళ్లు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 29 : ఒంగోలులోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జరుగుతున్న నర్సింగ్ పరీక్షలలో మాస్ కాపింగ్‌కు తెర తీశారు. పరీక్ష పేపర్ల కింద స్లిప్‌లు పెట్టుకుని యథేచ్ఛగా పరీక్షలు రాయడం కనిపించింది. గురువారం నుంచి మొదలైన జనరల్ నర్సింగ్ పరీక్షలలో ఆయా కళాశాలల యాజమాన్యాలు రిమ్స్ అధికారులతో కుమ్మక్కయ్యాయి. సుమారు వారం రోజులపాటు (ఈనెల 29 నుంచి వచ్చే నెల 4 వరకు) జరిగే ఈ పరీక్షలకు జిల్లాలోని వివిధ ప్రయివేటు నర్సింగ్ కాలేజీల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే తరహాలో ఇక్కడ మాస్ కాపీయింగ్ జరుగుతోంది. అందుకు సంబంధించి రిమ్స్ అధికారులతో కుదిరిన ఒప్పందంతో ప్రయివేటు నర్సింగ్ కాలేజీలది ఇష్టారాజ్యం అయ్యింది. గ్యారెంటీ పాస్‌తో విద్యార్థుల నుంచి భారీ మొత్తంలో వసూలు చేశారు. పరీక్షల సమయంలో కాపీలు రాసుకునేందుకు అదనంగా మరి కొంత నగదు వసూలు చేసినట్లు సమాచారం. దీంతో విద్యార్థులు విద్యా సంవత్సరం మొత్తం చదవకపోయినా, గ్యారెంటీ పాస్ ఉందనే ధైర్యంతో పరీక్షలకు హాజరయ్యారు. అయితే విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న విషయం తెలుసుకున్న పలు మీడియా సంస్థలు ఆకస్మిక తనిఖీలు చేశాయి. దీంతో పరీక్ష పేపర్ల కింద స్లిప్‌లు పెట్టుకుని విద్యార్థులు యథేచ్ఛగా పరీక్షలు రాయడం కనిపించింది. మాస్ కాపీయింగ్‌పై రిమ్స్ అధికారులను ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా తమకేమి తెలియదంటూ బుకాయించారు. రెండేళ్ళుగా తమ భాగస్వామ్యం ఏమీ లేదంటూ సమాధానం దాట వేశారు. అయితే అందిన సమాచారం మేరకు అటు జీజీహెచ్, ఇటు రిమ్స్ అధికారులకు ప్రయివేటు నర్సింగ్ కాలేజీల యాజమాన్యాలు భారీగా ముడుపులు ముట్టచెప్పినట్లు సమాచారం. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి, మాస్ కాపీయింగ్‌లు జరగకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాల్సిన అవసరం ఉంది.



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ తేజ్ సంగీత్

సురక్షిత నీటిని అందించడమే జలజీవన్ లక్ష్యం

చినగంజాం, ఆగస్టు 29 : గ్రామంలోని ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీటిని సరఫరా చేయడమే జలజీవన్ మిషన్ లక్ష్యమని జిల్లా కోఆర్డినేటర్ తేజ్ సంగీత్ అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ గొల్లమూరి శివకుమారి అధ్యక్షతన జలజీవన్ మిషన్‌పై గురువారం జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో ఆర్థిక సహకారం అందిస్తూ ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ద్వారా మనిషికి 55 లీటర్ల మంచినీటిని అందించనున్నట్లు తేజ్ సంగీత్ తెలిపారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని జలజీవన్ మిషన్ జిల్లా సమన్వయ కర్త టి.రంగారావు సూచించారు. ఇళ్లవద్ద ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని తద్వారా భవిష్యత్ తరాల వారికి నీటి కొరత నుంచి రక్షణ కల్పించాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో డయేరియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎన్.సూర్యనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి.బాలసాయికుమార్, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ నున్నం అశోక్‌కుమార్, వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల హెచ్.ఎం.కుర్రా రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన పీటీసీ ప్రిన్సిపాల్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 29 : పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ) ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.వి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి ఇంటెలిజెన్స్ ఆర్ఐఓగా పనిచేస్తున్న శ్రీనివాసరావు బదిలీపై ఒంగోలు పీటీసీకి వచ్చారు. అక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఏఆర్ దామోదర్ జిల్లా ఎస్పీగా బదిలీ కావడంతో ఆ స్థానంలో శ్రీనివాసరావును నియమించారు.

జెండా ఎత్తేద్దాం

- కూటమివైపు వైసీపీ నేతల చూపు
- ఎమ్మెల్సీ సునీత పార్టీకి, పదవికి రాజీనామా
- ఆయా పార్టీల నేతల టచ్‌లో మరో ముగ్గురు మాజీలు
- జిల్లా అధ్యక్ష పదవికి ససేమిరా అంటున్న నేతలు
- కొన్ని అసెంబ్లీలకు దూరమైన ఇన్‌చార్జులు



విపక్ష వైసీపీకి జిల్లాలో ఆ పార్టీ నాయకులు గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అనేకమంది కూటమివైపు దృష్టిసారించటం అందుకు నిదర్శనం. అవకాశం ఉంటే టీడీపీలోకి లేదంటే జనసేనలోకి మరీ కాదంటే బీజేపీలో చేరేందుకు పావులు కదుపుతున్నారు. అందుకనుగుణంగా ఇప్పటికే కొందరు నాయకులు అడుగులు వేయటం ప్రారంభమైంది. గిద్దలూరు, అద్దంకి నియోజకవర్గాల్లో కొందరు బీజేపీలో చేరగా, పొదిలిలో కొందరు జనసేన జెండా పట్టుకొని తిరుగుతున్నారు. తాజాగా ఆ పార్టీ ఎమ్మెల్సీ పోతుల సునీత పదవికి, పార్టీకి రాజీనామా చేశారు ఇంకోవైపు జిల్లాలో కీలకనేత బాలినేనితో పాటు మరో ఇద్దరు, ముగ్గురు మాజీలు కూటమిలోని నేతలకు టచ్‌లో ఉన్నట్లు సమాచారం. దీనికితోడు వైసీపీ జిల్లా అధ్యక్ష పదవి తీసుకునేందుకు ఎవ్వరూ ముందుకు రావటం లేదు. ఓటమి చెందిన పలువురు మాజీలు తిరిగి తమకు పాత నియోజకవర్గాలు కేటాయించాలని అధినేతపై ఒత్తిడి చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికారాన్ని కోల్పోవటమే కాక భారీ ఓటమి ఎదురైన మా నాయకుడిలో(జగన్) ఎలాంటి మార్పు కనిపించటం లేదు. పాత పద్ధతిలోనే ఆయన పోకడ ఉంది. అందుకే మాదారి మేము చూసుకోక తప్పటం లేదు. జిల్లాలోని వైసీపీ నాయకుల్లో కొందరు చెబుతున్న మాట ఇది. అలా చెప్పే సీనియర్ నాయకులు రోజురోజుకు పెరిగిపోతుండగా గ్రామ, మండల స్థాయిలో వైసీపీ నాయకులైతే ఎప్పుడో పక్కదారి పట్టారు. కూటమి ప్రభుత్వంలోని మూడు పార్టీలు కూడా వైసీపీ నుంచి వచ్చేవారిని చేర్చుకొని ఆ పార్టీని నిర్వీర్యం చేయాలనే ఆలోచనలో ఉన్నాయి. దీంతో కూటమి వైపు దృష్టిసారించిన వైసీపీ నేతలకు కూడా సానుకూల సంకేతాలు అందుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో కూటమిలోని మూడు పార్టీల నేతలు వైసీపీ వారిని తమ పార్టీలోకి చేర్చుకునేందుకు శ్రీకారం పలికారు. ఒంగోలులో వైసీపీ కార్పొరేటర్లతోపాటు వారి వెంట వచ్చిన కొందరు నాయకులకు పచ్చకండవాలు కప్పారు. గిద్దలూరు, చీరాల మున్సిపాలిటీల్లో ఈ తంతు సాగింది. దర్శిలోని ముండ్లమూరు మండలంలోని వైసీపీ ఎంపీటీసీ సభ్యులంతా టీడీపీలో చేరిపోయారు. పొదిలిలో భూ వివాదాల్లో చిక్కుకున్న ఒక వైసీపీ నాయకుడు జనసేనలో సభ్యులను చేర్పించి ఆ పార్టీలో పెత్తనం కోసం తహతహలాడుతున్నాడు. ఇటీవల గిద్దలూరు, అద్దంకి నియోజకవర్గాలకు చెందిన కొందరు వైసీపీ నాయకులు నేరుగా బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి వద్దకు వెళ్లి ఆ పార్టీలో చేరిపోయారు. ఇలా చూస్తే ప్రతి నియోజకవర్గంలోను ఏదోస్థాయిలో వైసీపీ శ్రేణులు, నాయకులు కూటమి పార్టీల్లో చేరిపోయే తంతు జరుగుతుంది.

వైసీపీకి ఎమ్మెల్సీ సునీత రాజీనామా

ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ, వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలైన పోతుల సునీత బుధవారం శాసనమండలి సభ్యత్వానికి అలాగే వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు ఆ మేరకు అటు శాసనమండలి చైర్మన్‌కు ఇటు వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు రాజీనామా లేఖలు పంపారు. రాష్ట్రంలో వైఎస్ కుటుంబానికి సన్నిహితుడైన రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణతోపాటు మరికొందరు రాజ్యసభ సభ్యులు పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయబోతున్నట్లు వెల్లడైంది. రాజ్యసభలో అలాగే శాసనమండలిలో టీడీపీ కూటమి పార్టీలు తమ బలాన్ని పెంచుకునే దిశగా అటు రాజ్యసభ సభ్యులు ఇటు ఎమ్మెల్సీలను ప్రోత్సహిస్తున్నారు. పార్టీకే కాక పదవులకు రాజీనామా చేసి రావాలని కోరుతున్నారు. తదనుగుణంగా వారికి ప్రత్యామ్నాయ పదవులపై హామీలు కూడా ఇస్తున్నారు. రానున్న వారం రోజుల్లో వైసీపీ రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు కూటమి పార్టీల్లో చేరే ప్రక్రియ ముమ్మరమయ్యే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. పోతుల సునీత రాజీనామాను అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 2014లో టీడీపీ తరఫున చీరాల నుంచి పోటీచేసి ఓడిన ఆమెను గౌరవించి ఎమ్మెల్సీని చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే ఆమె టీడీపీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. ఒప్పందం మేరకు అక్కడ తిరిగి ఎమ్మెల్సీ అయ్యారు. నిన్న మొన్నటివరకు టీడీపీపై ముఖ్యంగా చంద్రబాబుపై తీవ్ర విమర్శలు చేసిన సునీత ఆకస్మాత్తుగా వైసీపీ పదవికి రాజీనామా చేయటంలోని పరమార్థం ఇట్టే అర్థమవుతుంది.

టచ్‌లో మరికొందరు మాజీలు

కాగా ఆ పార్టీలో కీలకంగా ఉన్న ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేనితోపాటు మరికొందరు కీలక నాయకులు కూటమిలోని మూడు పార్టీల్లో కొందరికి టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరు ముగ్గురు మాజీలైతే ఆయా పార్టీల్లోని నాయకులతో చర్చలు కూడా జరిపారు. కుదిరితే టీడీపీ, కాకపోతే జనసేన, అదీ కాకపోతే బీజేపీలో చేరేందుకు సిద్ధమై కొందరు ముఖ్యమైన నాయకుల వైపు అడుగులు వేస్తున్నట్లు సమాచారం. టీడీపీ విషయానికి వస్తే రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు ఆ తర్వాత కీలకమైన ప్రజాప్రతినిధులను మాత్రమే చేర్చుకునేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉదాహరణకు టీడీపీలో చేరబోతున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ ప్రకాశం జిల్లాలోని ఒకరిద్దరు కీలక నేతల పేర్లు కూడా టీడీపీ నాయకుల వద్ద ప్రస్తావించి తీసుకోవాలని చెప్పినట్లు తెలిసింది. ప్రస్తుతానికి బాలినేని జనసేన ముఖ్య నాయకుల మధ్య చర్చలు జరుగుతుండగా మరో ఇద్దరు మాజీలు కూటమిలోని వివిధ పార్టీల నేతలతో టచ్‌లో ఉన్నారు. ఆ పార్టీలో ఉన్న ఇద్దరు ముగ్గురు ప్రజాప్రతినిధులు కూడా కూటమి పార్టీల్లోని నేతలకు టచ్‌లో ఉండటం విశేషం. ఇక జిల్లాలోని వైసీపీ ఎంపీపీలు, జడ్పీటీసీలు అయితే ఇప్పటికే టీడీపీ ఎమ్మెల్యేలకు టచ్‌లోకి వెళ్లారు. కొన్ని నియోజకవర్గాలకు చెందిన ఐదారుగురు ఎంపీపీలు, జడ్పీటీసీలు ఇటు బీజేపీ అటు జనసేన నేతలకు టచ్‌లో ఉండటం విశేషం.

జిల్లా అధ్యక్ష పదవికి ముందుకు రాని వైనం

కాగా వైసీపీ జిల్లా అధ్యక్ష పదవి తీసుకునేందుకు ఆ పార్టీ నాయకులు ముందుకు రాకపోవటం విశేషం. ప్రస్తుత అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి పార్టీ ఓటమి అనంతరమే అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత జగన్ జిల్లాకు చెందిన నాయకులను పక్కనపెట్టి తిరుపతి జిల్లాకు చెందిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని పార్టీ అధ్యక్షుడిని చేయాలని భావించారు. ఆ ప్రతిపాదనను బాలినేనితోపాటు నాయకులందరూ వ్యతిరేకించారు. దీంతో చెవిరెడ్డికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చిన జగన్ జిల్లా అధ్యక్ష పదవికి పేర్లను ఇటు బాలినేని అటు వైవీలను సూచించాలన్నట్లు తెలిసింది. అయితే ఆ పదవి తీసుకునేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవటం విశేషం. దీంతో జగన్ బలవంతంగానైనా దర్శి ఎమ్మెల్యే బూచేపల్లికి పార్టీ బాధ్యతలు అప్పగించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ముందొచ్చిన పండుగ

- రేపే పింఛన్ల పంపిణీ
- ఒక రోజు ముందుగానే చేతికి డబ్బులు
- జిల్లాకు రూ.123 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం



ఒంగోలు నగరం, ఆగస్టు 29: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్లను ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు అందజేయనుంది. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ సొమ్మును అందిస్తున్న ప్రభుత్వం సెప్టెంబర్ మాసానికి సంబంధించిన సొమ్మును ఆ గస్టు నెల 31వ తేదీనే లబ్ధిదారుల చేతిలో పెట్టనుంది. ఒకటో తేదీ ఆదివారం కావటంతో ఒక రోజు ముందుగానే అంటే 31వ తేదీ శనివారం నాడే పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం శుక్రవారం నాటికి పూర్తి చేయనుంది. శనివారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో మొత్తం 2,89,096 పింఛన్లు ఉండగా వీరికి పింఛన్ సొమ్మును అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.123,01,33,000 లను విడుదల చేసింది. శనివారం జిల్లాలో పింఛన్లను పంపిణీ చేసేందుకు బ్యాంకుల నుంచి డబ్బులను సచివాలయ సిబ్బంది శుక్రవారమే డ్రా చేయనున్నారు. గతంలో వలంటీర్ల ద్వారా పింఛన్ల సొమ్మును పంపిణీ చేయగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీంతో ఈ నెల 31వ తేదీన కూడా ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారానే పింఛన్లను పంపిణీ చేయనుంది. జిల్లాలో వృద్ధాప్య పింఛన్లు 1,57,116, వితంతు పింఛన్లు 67,913, దివ్యాంగుల పింఛన్లు 33,590, ఒంటరి మహిళల పింఛన్లు 7,808,చర్మకారుల పింఛన్లు 5,339, డప్పు కళాకారుల పింఛన్లు 4,682,మత్స్యకారుల పింఛన్లు2,530, చేనేత కార్మికుల పింఛన్లు 1,811, కల్లుగీత కార్మికులు 246, హిజ్రాల పింఛన్లు 90తో పాటు అభయ హస్తం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, సైనిక సంక్షేమశాఖ ద్వారా గుర్తించిన వారికి ఇచ్చే పింఛన్లు మొత్తం కలిపి జిల్లాలో 2,89,096 మంది ఉన్నారు. వీరందరికీ ఈ నెల 31వ తేదీనే సెప్టెంబర్ మాసానికి సంబంధించిన పింఛన్లను ప్రభుత్వం ఇంటి వద్దనే అందించనుంది. శనివారం అందుబాటులో లేని లబ్ధిదారులకు సోమవారం ఇంటి వద్దకే వెళ్లి అందజేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. సోమవారం నాటికి నూటికి నూరుశాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పింఛన్ల పంపిణీకి తగినంత మంది సచివాలయ సిబ్బంది లేకపోవటంతో ఇతర శాఖల ఉద్యోగులను కూడా పింఛన్ల పంపిణీకి కేటాయించారు. వీరు శనివారం ఇంటింటికీ తిరిగి పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించి అమలు చేస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఒక రోజు ముందుగానే చేపట్టి లబ్ధిదారుల కళ్లల్లో ఆనందాన్ని చూడనుంది.

డోర్లు తెరవక ముందే వైసీపీ ఖాళీ

- మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 29 : తెలుగుదేశంపార్టీ డోర్లు ఓపెన్ చేయకుండానే వైసీపీ ఖాళీ అవుతోందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి అన్నారు. స్థానిక రిమ్స్‌లో బంగారు బాల్యం కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం వచ్చిన మంత్రి స్వామి విలేఖరులతో మాట్లాడారు. వైసీపీ నుంచి వచ్చే వారి జాబితా ఇప్పుడే చెప్పలేమని, ఒకసారి తెలుగుదేశం పార్టీ డోర్లు ఓపెన్ చేస్తే వైసీపీ క్లోజ్ చేసుకోవాల్సిందేనని స్వామి స్పష్టం చేశారు. జగన్ సర్కార్ వైద్యఆరోగ్యశాఖను భ్రష్టు పట్టించిందని, ఇప్పుడు వైద్యశాఖపై మాట్లాడే అర్హత జగన్మోహన్‌రెడ్డికి లేదని మంత్రి అన్నారు. సింగరాయకొండలో 30 పడకల ఆసుపత్రిని ఆరుపడకల ఆసుపత్రిగా మార్చిన ఘనత జగన్‌దని ఆయన మండిపడ్డారు. వైద్య, ఆరోగ్యశాఖను నిర్వీర్యం చేసిన వ్యక్తులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. అందరికీ వైద్యం అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తున్నామని వివరించారు. అలాగే జిల్లా వైద్యశాలలో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి స్వామి తెలిపారు.

వివాహేతర సంబంధం వద్దన్నందుకు దాడి

చీరాలటౌన్, ఆగస్టు 29 : వివాహేతర సంబంధంతో ఓ ప్రేమికుడు తల్లిదండ్రులపై దాడికి పాల్పడ్డాడు. ఈఘటన చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ప్రేమికుడు చీరాలకు చెందిన వ్యక్తి కాగా ప్రియురాలిది వేరే మండలం. అలాగే ఆమెకు ఇద్దరు కుమారులు. అయితే ప్రేమికుడికి ఇంకా పెళ్లి కాలేదు. ప్రియురాలి వద్దకు వెళ్లవద్దని తల్లిదండ్రులు మందలిస్తుండడంతో వారిపై దాడికి పాల్పడ్డాడు. అయితే బాధితులు గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా స్టేషన్ నుంచి ఇద్దరు కానిస్టేబుళ్లు అతడిని స్టేషన్‌కు తెచ్చేందుకు ఇంటికి వెళ్లారు. పోలీసులనే భయపెడుతూ ప్రియుడు నన్ను స్టేషన్‌కు తీసుకువెళితే హార్పిక్ తాగుతానని బెదిరించాడు. దీంతో భయాందోళన చెందిన పోలీసులు చేసేదిలేక వెనుదిరిగారు.

పూర్వ ఎంఈవో సస్పెన్షన్‌పై విచారణ



ఎంఈవో కార్యాలయంలో విచారణ చేస్తున్న కమిటీ

బల్లికురవ, ఆగస్టు 29 : బల్లికురవ ఎంఈవోగా పనిచేసి ఆరు మాసాల కిందట పలు ఆరోపణలతో సస్పెండ్ అయిన వీరాఘవయ్యపై గురువారం బోయపాలెం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు ఆధ్వర్యంలో కమిటీ విచారణ చేపట్టింది. ప్రస్తుతం కొరిశపాడు ఎంఈవోగా విధులలో ఉన్న వీరాఘవయ్యపై గతంలో బల్లికురవ మండలంలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పై అధికారులకు ఫిర్యాదు చేశారు. వాటిపై అప్పట్లో అధికారులు సస్పెండ్ చేశారు. అనంతరం అయపై పెట్టిన పిర్యాదులపై పూర్తి విచారణ చేయాలని గుంటూరు విద్యాశాఖ ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి బోయపాలెం డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌ను మరియు కొందిరిని కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ కమిటీ బల్లికురవ విద్యావనరుల కేంద్రానికి వచ్చి ప్రస్తుతం విధులలో ఉన్న ఎంఈవో వస్త్రంనాయక్ వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి అనంతరం పిర్యాదులు చేసిన ఉపాధ్యాయులను మరియు అభియోగాలు ఎదుర్కొంటున్న పూర్వపు ఎంఈవో వీరాఘవయ్యను విచారణ చేపట్టారు. అనంతరం వారి వద్ద వ్రాత పూర్వకంగా వివరణలు తీసుకున్నారు. నివేదికలను ఉన్నతాధికార్లకు అందజేస్తామని విచారణ కమిటీ తెలిపింది.

బాలినేని అక్రమాలపై దర్యాప్తు జరపండి

- సీఎంను కోరిన దామచర్ల, రియాజ్
- అందరూ చెప్పిన అధికారులనే వేయాలని విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు జరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్‌లు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు పలు అంశాలతో కూడిన సమాచారం లేఖను ఆయనకు అందించారు. గురువారం సాయంత్రం సచివాలయంలో ముఖ్య మంత్రిని వారు కలిశారు. ఇటీవల ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మేయర్, మరో 18 మంది కార్పొరేటర్లను దామచర్ల చంద్రబాబు వద్దకు తీసుకెళ్లారు ఆ సందర్భంగా ముందుగా రియాజ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సింగరాజు రాంబాబులను తీసుకొని చంద్రబాబును జనార్దన్ కలిశారు. ఒంగోలులో బాలినేని వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి నిర్మిస్తున్న విలాస్ ప్రాజెక్టు నిర్మాణంలో చోటుచేసుకున్న అవకతవకలపై ప్రత్యేకంగా దర్యాప్తు చేయించాలని కోరినట్లు తెలిసింది. ఎరజర్ల కొండ నుంచి అక్రమంగా ఎర్రమట్టిని తోలుకోవటంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా పైపులైన్ వేసి మంచినీటిని నిర్మాణ పనులకు వాడుకున్నారని, విద్యుత్‌శాఖ అధికారులు కూడా నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారని వారు పేర్కొన్నట్లు తెలిసింది. ఈ విషయాల్లో లోతైన దర్యాప్తు జరిపితే పలు అక్రమాలు వెలుగులోకి వస్తాయని వారు సీఎంకు వివరించే ప్రయత్నం చేశారు. అలాగే ఎరజర్ల కొండల ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు భూమి అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని వారు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. బాలినేని మంత్రిగా ఉన్న సమయంలో అక్కడ రూ.40 కోట్లు వెచ్చించారని దర్యాప్తు చేస్తే అవినీతి బాగోతం బయటపడుతుందని తెలిపినట్లు తెలిసింది. ఒంగోలులో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూకబ్జాలపై దర్యాప్తు సిట్‌ను ఏర్పాటు చేసినా సక్రమంగా దర్యాప్తు జరపలేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కొందరు భూముల ఆక్రమణల్లో బాలినేనితో పాటు అతని సన్నిహితులు హస్తం కూడా ఉందని చెప్పినట్లు తెలిసింది. సిట్‌ను పటిష్టపర్చి విచారణ చేయించాలని కోరినట్లు తెలిసింది. అలాగే ఎన్నికలకు ముందు హడావుడిగా పేదలకు నివేశన స్థలాలు కేటాయించారని అందులో సుమారు 12వేల మంది బోగస్ లబ్ధిదారులు ఉన్నారని పేర్కొంటూ ఆ అంశాన్ని పరిశీలించాలని కోరినట్లు తెలిసింది. వారు చెప్పిన అంశాలను సావధానంగా విన్న సీఎం చంద్రబాబు సీఎంవో అధికారులను వాటిని పరిశీలించాని సూచించినట్లు తెలిసింది.

బదిలీలపై కలిసి మాట్లాడండి

కాగా ఇదే సమయంలో ఎమ్మెల్యే దామచర్ల జిల్లా అధికారుల బదిలీల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. తాము సూచించిన అధికారులను నియమించే విధంగా చూడాలని కోరినట్లు తెలిసింది. మూడు నాలుగు శాఖల అధికారుల నియామకంపై ప్రతిష్టంభన ఉందని, మిగిలిన ఎమ్మెల్యేల అంగీకారంతో ఎంపిక చేసిన వారిని ఆ పోస్టులకు కేటాయించాలని కోరినట్లు తెలిసింది. సీఎం స్పందిస్తూ అన్నీ పరిశీలించే నియామకాలు జరుపుతున్నారని జిల్లా పరిధిలోని వారందరూ కూర్చుని మాట్లాడుకోవాలని చెప్పినట్లు తెలిసింది. అనంతరం ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మరో 18 మంది కార్పొరేటర్లతో పాటు టీడీపీ, జనసేనకు చెందిన అరుగురు కార్పొరేటర్లను ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. ఒంగోలు అభివృద్ధిని కాంక్షించి వారంతా పార్టీలో చేరారని ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని జనార్దన్, మేయర్ సుజాతలు సీఎంను కోరారు. అనంతరం కార్పొరేటర్లతో సీఎం గ్రూపు ఫొటో దిగారు.

చెక్‌డ్యాంలకు సాగర్ కళ


రాజుగారిపాలెంలో నీటితో కళకళ లాడుతున్న చెక్‌డ్యాం

మార్టూరు, ఆగస్టు 29 : మండలంలోని కొన్ని గ్రామాలలో చెక్‌డ్యాంలు సాగర్ నీటితో కళకళ లాడుతున్నాయి. రైతులు వర్షాలు కోసం ఎదురుచూస్తున్నారు. ఇదిగో వస్తున్నా ఇదిగో వస్తున్నా అంటూ వాన మబ్బులు ప్రజలను ఊరిస్తున్నాయేగానీ ఇంత వరకు ఒక మోస్తరు వానజల్లు కూడా కురవలేదు. పగటి పూట ఎండలు మండిపోతున్నాయి. రాత్రి సమయంలో వేసవి గాలులు వీస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ముఖ్యంగా మార్టూరు వాగుపై, రాజుగారిపాలెం వాగు, ఇసుకదర్శి వాగు, జొన్నతాళివాగులపై ఉన్న చెక్ డ్యాంలలో నీళ్లు నిండుకున్నాయి. వాటిలో రాజుగారిపాలెంలో ఉన్న 4 చెక్ డ్యాంలులో నీళ్లు నిండి కిందకు ప్రవహిస్తున్నాయి. 2016 నుంచి 2018 కాలంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రాజుగారిపాలెంలో పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు నాలుగు చెక్ డ్యాంల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాంతో అప్పటివరకు వాగు నుంచి వృథాగా దిగువకు మార్టూరు వాగుకు వెళ్లిపోయే నీరు చెక్ డ్యాంలు కారణంగా రాజుగారిపాలెంలో కొంతమేర నిలబడిపోతున్నాయి. ఆనాటి నుంచి అడపదడపా సాగర్ జలాలు వచ్చిన సమయంలోగాని, లేదా వర్షాలు కురిసిన సమయంలోగాని వాగునీరు చెక్ డ్యాంలకు చేరుతున్నది. వేసవిని తలపిస్తున్న ప్రస్తుత సమయంలో కూడా, ఇటీవల విడుదలైన సాగర్ జలాలు కారణంగా చెక్ డ్యాంలకు నీళ్లు చేరాయి. దాంతో గ్రామంలోని భూగర్భ జలాలు కూడా పెరిగాయని గ్రామస్థులు అంటున్నారు. అంతేగాకుండా ఈ చెక్ డ్యాంల పరిధిలో దాదాపుగా 200 ఎకరాలు రైతుల పొలాలు ఉన్నాయి. వాటిలో కొంతమంది రైతులు మాగాణి సాగు చేపట్టి ఇప్పటికే నార్లు పోశారు. మరి కొంతమంది రైతులు మెట్టపంటలు, కూరగాయల సాగు చేపట్టారు ఈ గ్రామంలో కూరగాయలను సాగు చేసే రైతులు ఎక్కువగా ఉన్నారు. పొలాలకు వాగు నీటితో పాటు, చెక్ డ్యాంలోని నీటిని కూడా వినియోగించుకుంటూ పంటల సాగుచేపట్టారు. సాగర్ జలాలును విడుదల చేసిన తర్వాత గ్రామాలలోని మంచినీటి చెరువులకు సమృద్ధిగా సాగర్ జలాలు చేరాయి. దాంతో పాటు చెక్ డ్యాంలకు కూడా నీళ్లు చేరడంతో వాటిపై ఆధారపడి సన్న చిన్న కారు రైతులు సాగు చేపట్టారు.

భవిత కేంద్రం తనిఖీ

యద్దనపూడి, (మార్టూరు) ఆగస్టు 29 : యద్దనపూడి మండలంలోని ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని గురువారం స్టేట్ ఐఈ వింగ్ అధికారి మల్లికారునరావు, జిల్లా కోఆర్డినేటరు ఎం.జ్యోత్స్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సం ఖ్యను పెంచాలని కోరారు. ముఖ్యంగా ప్రశస్త్ యాప్‌ను మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందరూ డౌన్‌లోడ్ చేసుకొని పిల్లల వివరాలను నమోదు చేయాలన్నారు. అనంతరం ఎంఆర్‌సీ భవనానికి వెళ్లి ఎంఈవో గోపితో మాట్లాడారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్ రజని, కే సురేఖ పాల్గొన్నారు.

అన్నిదానాల్లో నేత్రదానం మిన్న

చీరాలటౌన్, ఆగస్టు 29 : అన్నిదానాల్లో నేత్రదానం మిన్న అని ఏరియా హాస్పిటల్ వైద్యుడు డా.రాజ్‌కమాఆర్, డా.స్వేష్ట అన్నారు. 39వ నేత్రదాన పక్షోత్సవాలను గురువారం చీరాల ఏరియా హాస్పిటల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మరణించిన తరువాత సుమారు 6 గంటలపాటు వారి నేత్రాలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. చనిపోయిన తరువాత మనతో పాటు నేత్రాలు వ్యర్థం కాకుండా ఇతరులకు దానం చేయడం వలన పునఃర్జన్మ ప్రసాదించిన వారిగా చరిత్రలో మిగిలి ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారులు వెంకటేశ్వర్లు, సుధాకర్, ప్రజలు పాల్గొన్నారు


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి విజయ్‌భాస్కరరావు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చినగంజాం, ఆగస్టు 29 : వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.విజయ్‌భాస్కరరావు అన్నారు. చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెదగంజాం, కోడూరివారిపాలెం, కాటంవారిపాలెం, సోపిరాల గ్రామాల్లో జ్వరాలు వ్యాప్తి చెందకుండా నిర్మూలన కార్యక్రమం కింద ముందుస్తు జాగ్రత్తలలో భాగంగా గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ జ్వరాలతో బాధ పడే వారు పీహెచ్‌సీకి వచ్చి రక్త పరీక్షలు చేయించుకొని తగు మందులు వాడుకోవాలని సూచించారు. గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా, జ్వరాలు ప్రబలకుండా దోమల నియంత్రణపై, పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలు లేకుండా ఫ్రైడే కార్యక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెదగంజాం గ్రామ సర్పంచ్ నక్కల కృష్ణ, కార్యదర్శి ఎస్‌కే సల్మా, 104 డీఈవో పొదిలి రాఘవ, మహేష్, ఏఎన్ఎంలు నాగుల కోటేశ్వరి, రమాదేవి, సీహెచ్ వో.ఫాతిమా, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సహజ వ్యవసాయంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డీటీసీ, డీఆర్‌సీ విజయనిర్మల

వేటపాలెం(చీరాల), ఆగస్టు 29 : సహజ వ్యవసాయంపై డీటీపీ, డీఆర్‌సీ విజయనిర్మల చెప్పారు. మండల పరిధిలోని పాపాయిపాలెం రైతు సేవా కేంద్రంలో రైతులకు సహజ వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు విత్తనాల ఎంపిక, రసాయన ఎరువుల వాడకం మోతాదు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ రత్నకుమారి, చీరాల ఏడీఏ కె. భాస్కరరావు, వేటపాలెం ఏఓ కాశీవిశ్వనాథ్, ఏపీసీఎన్ఎఫ్ ట్రైనర్ భారతి, ఏఈవోలు గోపీకృష్ణ, ప్రశాంతి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పత్తి పంటలో మెలకువలు పాటించాలి

బల్లికురవ, ఆగస్టు 29 : రైతులంతా పత్తి పంటలో మెలకువలు పాటిస్తే తెగుళ్ల బారి నుంచి తప్పించుకోవచ్చని మండల వ్యవసాయ శాఖ ఏవో కుమారి తెలిపారు. మండలంలోని కొప్పెరపాలెం, సోమవరప్పాడు గ్రామాలలో రైతులు సాగు చేసిన పత్తి పంటను ఏవో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి పంటలో బెట్ట పరిస్థితుల వలన రసం పీల్చే పురుగు అధికంగా ఉందని దాని నివారణకు రైతులంతా వ్యవసాయ శాఖ సలహాలను తీసుకుని నివారణ చేసుకోవాలని రైతులకు అధికార్లు సూచించారు. అలానే లద్దె పురుగు, మరియు గులాబీ రంగు పురుగు ప్రభావం పంటపై ఉందని అధికార్లు గుర్తించారు. గులాబి రంగు నివారణకు ఎకరాలకు ఆరు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలానే లద్దె పురుగు నిషారణకు ఎకరాకు 10 కేజీల తవుడు, ఒక కిలో బెల్లం, లార్విన్ పొడి 300 గ్రాములకు తగిన నీరు కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో వీఏఏలు భాష, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రేపు కౌన్సిల్ అత్యవసర సమావేశం

చీరాల, ఆగస్టు 29 : మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్లో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన జరుగుతుందని కమీషనర్ చక్రవర్తి గురువారం తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా తెలుగుభాష, క్రీడా దినోత్సవాలు

గిడుగు, ధ్యాన్‌చంద్‌కు నివాళి


మైలవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో పరమానందయ్య శిష్యుల వేషధారణలో విద్యార్థులు

అద్దంకిటౌన్, ఆగస్టు 29 : వ్యవహార భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు అని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. గ్రాంధిక భాష నుంచి వాడుక భాషలో గ్రంథాలు ఉండాలని, తెలుగు వ్యవహార భాష కోసం గిడుగు ఉద్యమించారని గుర్తు చేశారు. మండలంలోని మైలవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. విద్యార్థులతో పరమానందయ్య శిష్యులు నాటికను ప్రదర్శించి అందరినీ అకట్టుకున్నారు. విద్యార్థులకు వక్తృత్వం, పద్యాలు, పొడుపు కథలు, గేయాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో హెచ్ఎం పద్మావతి అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవ వేడుకలను నిర్వహించా రు. 8, 9, 10 తరగతి విద్యార్థులకు జ్యోతి చంద్రమౌళి రాసిన 200 తెలుగు వ్యాకరణ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు వీరయ్య, కార్యదర్శి మురళి సుధాకరరావు పాల్గొన్నారు. అద్దంకిలోని సత్రం బడిలో ఎంఈవో సుధాకరరావు, హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు, తిమ్మాయపాలెం జడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్ఎం గంగాధరరావు, ఎన్టీఆర్ కాలనీలో ఎంపీయూపీ స్కూల్‌లో హెచ్ఎం అంజమ్మ కేఆర్‌కే డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్. వీ మోహనరా వు అధ్యాపకులు అనిత గిడుగు, ధ్యాన్‌చంద్‌కు చిత్రపటాలకు నివాళులర్పించారు. సృజన అధ్వర్యంలో గిడుగు జయంతిని నిర్వహించారు.


తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

చీరాలటౌన్ : తెలుగుభాష గొప్పతనాన్ని నేటి త రం ఎలుగెత్తి చాటాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి కోరారు. గిడుగు జయంతిని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మార్టూరు : చదువుతో పాటు క్రీడలపట్ల విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని, తద్వారా జీవితంలో పోరాటపటిమ పెరుగుతుందని స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం.శేషగిరిరావు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని మార్టూరు, వలపర్ల జడ్పీ హైస్కూల్స్‌లో ప్రత్యేక క్రీడా కార్యక్రమాలను నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మక్కెన వీర రాఘవులు సమకూర్చిన క్రీడా పతకాలను శేషగిరిరావు విద్యార్థుల మెడలో వేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రూత్ మెర్సీజాయ్,పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా వలపర్ల జడ్పీ హైస్కూల్లో పీఈటీ దేవరాజ్ ఆధ్వర్యంలో బాలికలకు క్రీడా టీ షర్టులను పంపిణీ చేశారు.

పర్చూరు : తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. తొలుత రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉప్పుటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్ఎం వసుంధరాదేవి ఆధ్వర్యంలో, శ్రీ శాతవాహనలో విద్యార్థులకు తెలుగు భాషా ఔన్నత్యాన్ని కరస్పాండెంట్ తేళ్ల రాము వివరించారు. అనంతరం శతక పద్యంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

చినగంజాం : పలు పాఠశాలల్లో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కడవకుదురు, పెదగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు హెచ్ఎంలు పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు.

ఇంకొల్లు : తెలుగు మధురమైన భాష సీఐ రమణయ్య అన్నారు. ఆదర్శ హైస్కూల్‌లో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ విజయభాస్కర్, టీచర్లు పాల్గొన్నారు.

చినగంజాం : పలు పాఠశాలల్లో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కడవకుదురు, పెదగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పంగులూరు : జూనియర్ కళాశాలలో గురువారం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా పీడీ, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


తెలుగు టీచర్లను సన్మానిస్తున్న సహచరులు


బాలికలకు బహుమతులు అందజేసిన స్టేషన్ హౌస్ ఆఫీసర్

మాతృభాషను మరువద్దు

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 29 : మాతృభాష తల్లి వంటిదని, దానిని ఎప్పటికీ మరువరాదని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. తెగులు భాషా దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం రోటరీ కమ్యూనిటీ హాలులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిడుగు వెంకట రామ్మూర్తి చరిత్రను మననం చేశారు. కార్యక్రమంలో యువనేత గౌరీ అమర్‌నాథ్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు రూ.1.50లక్షల విరాళం

వాకర్స్ అసోసియేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్యకు అసోసియేషన్ ప్రతినిధులు రూ.1.50లక్షల విలువైన చెక్కులను అన్న క్యాంటీన్‌కు విరాళంగా అందజేశామని అసోసియేషన్ ప్రెసిడెంట్ పోలుదాసు రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఏవో వెంకటకృష్ణ

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

అద్దంకిటౌన్, ఆగస్టు 29 : విత్తనశుద్ధితోనే తెగుళ్లను నివారించుకోవచ్చని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని కలవకూరు గ్రామంలో రైతులతో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వరి కేజీ విత్తనాలకు 5గ్రాముల సుడోమోనాస్‌తో విత్తన శుద్ధి చేసుకుంటే అగ్గి తెగులు, పాముపొడ తెగుళ్లను నివారించుకోవచ్చన్నారు. రైతులు మంచి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన పంటలు పండించుకోవచ్చన్నారు. విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం వలన భూమి ఆరోగ్యం, మనుషుల ఆరోగ్యం పాడైపోతాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు మస్తాన్‌రావు, రైతులు పాల్గొన్నారు.

గడపగడపకు సభ్యత్వ నమోదు

పంగులూరు, ఆగస్టు 29 : సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా భారతీయ జనతా పార్టీని గడపగడపకు తీసుకెళ్లాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మండవ రామకృష్ణ కోరారు. పార్టీ మండల కమిటీ సమావేశం గురువారం పంగులూరులో జరిగింది. కేంద్ర, రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం సెప్టెంబరు 1 నుంచి చేపట్టే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు నరసరాజు, సురేష్, కొల్లి కోటేశ్వరరావు, టైలర్ సుబ్బారావు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లను చూపిస్తున్న ఎస్ఐ శివకుమార్, సిబ్బంది

చీరాల, ఆగస్టు 29 : మండల పరిధిలోని వాడరేవు గ్రామం చినబరపలో మద్యం అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్న నేపథ్యంలో ఈపురుపాలెం ఎస్సై శివకుమార్, సిబ్బందితో కలసి గురువారం దాడి చేశారు. నిందితుల నుంచి 30 మద్యం సీసాలు(క్వార్టర్లు), 16 బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మధ్యవర్తినామా రాసి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

మహిళ అరెస్టు

కారంచేడు(పర్చూరు), ఆగస్టు 29 : కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలో అక్రమంగా మద్యంను విక్రయిస్తున్నారన్న సమాచారంతో గురువారం ఎస్ఐ వెంకటరావు అధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో గ్రామానికి చెందిన మహిళ నుంచి 9 బాటిళ్ళను పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి కూలీ మృతి

బల్లికురవ, ఆగస్టు 29 : బెండ కాయలు కోసి ఇంటికి ట్రాక్టర్ గొర్రుపై కూర్చొని వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ షేక్ కరీమూన్ (46) మృతి చెందగా, మరో కూలీ రెహానా తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం జరిగింది. కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన రైతు కొమ్మినేని పోతురాజు తన తోటలో బెండకాయలు కోసేందుకు అయిదుగురు కూలీలను ట్రాక్టర్‌పై తీసుకుని వెళ్లి తిరిగి గొర్రుపై ఎక్కించుకొని ఇంటికి తీసుకు వస్తుండగా ట్రాక్టర్ పిన్ను కూలీలకు తగలడంతో ఒక్క సారిగా గొర్రుపై ఉన్న షేక్ కరీమూన్ కింద పడిపోయి కొంత దూరం ఈడ్చుకు వచ్చి తీవ్రంగా గాయపడింది. రెహానా కూడా కిందిపడి గాయపడింది. ఇద్దరినీ నర్సారావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా సంతమాగులూరు వద్దకు వెళ్లే సరికి కరీమూన్ మృతి చెందింది. బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కరీమూన్‌కు భర్త, ఇద్దరు కుమార్తెలున్నారు.

విద్యార్థినిపై ఆటో డ్రైవర్ లైంగిక దాడి

పోక్సో కేసు నమోదు

అద్దంకి, ఆగస్టు 29 : విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక దాడికి పాల్పడ్డ సంఘటనపై అద్దంకి పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన 16 ఏళ్ల బాలిక హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల యువకుడు ఆటో నడుపుతూ 6నెలలుగా పాఠశాలకు వెళ్లి వచ్చే సమయంలో బాలిక వెంట పడుతూ బెదిరిస్తున్నాడు. తల్లిదండ్రులకు చెబితే చదువు మాన్పిస్తారన్న భయంతో బాలిక ఇంట్లో చెప్పలేదు. స్కూల్ నుంచి వచ్చే సమయంలో బెదిరించి పలుమార్లు దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆ యువకుడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ప్రవీణ పలు సెక్షన్‌లతోపాటు పోక్సో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

21 మందికి వైద్య సేవలు

ఇంకొల్లు, ఆగస్టు 29 : మండలంలోని వంకాయలపాడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వైద్య పరీక్షలు చేసారు. సుమారు 21 మందికి వైద్య సేవలందించినట్లు డాక్టర్ డా.అంజలి తెలిపారు. సీహెచ్‌వో కోటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్‌ల పంపిణీకి రంగం సిద్ధం

ఇంకొల్లు, ఆగస్టు 29 : ఇంకొల్లు మండలంలోని 15 సచివాలయాల పరిధిలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు ఎంపీడీవో రాజ్యలక్ష్మి తెలిపారు. సుమారు రూ.3,17,16,500 ఈనెల 30వ తేదీన సచివాలయాలకు అందజేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు.

బైక్ కవర్‌లో నుంచి రూ.2.50లక్షలు చోరీ

అద్దంకి, ఆగస్టు 29 : ఆపి ఉన్న మోటార్‌సైకిల్ ట్యాంక్ కవర్‌లో నుంచి రూ.2.50లక్షల నగదు అపహరించుకు పోయిన సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కలవకూరుకు చెందిన బిక్కా అంజిరెడ్డి వ్యవసాయ పనుల నిమిత్తం బుధవారం అద్దంకి పట్టణంలోని ఎస్‌బీఐ (ఏడీబీ) నుంచి రూ.2.50లక్షలు డ్రా చేసి ఇంటికి వెళ్తూ టీ తాగేందుకు భవానీసెంటర్‌లోని మసీదు సమీపంలోని టీ దుకాణం వద్ద ఆగాడు. అంజిరెడ్డి మోటార్‌సైకిల్ ఆపిన వెంటనే గుర్తు తెలియని వ్యక్తి వచ్చి రూ.2.50లక్షల నగదు తీసుకొని పరిగెత్తాడు. సమీపంలో మరో వ్యక్తి మోటార్‌సైకిల్‌పై ఆగి ఉండడంతో ఇద్దరు కలిసి ఆ మోటార్‌సైకిల్ పై వెళ్లారు. వెంబడించినప్పటికీ దొంగలు దొరకలేదు. అంజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మహిళా ఎస్ఐ ప్రవీణ తెలిపారు.


అద్దంకిలో నేడు

ఆర్టీసీ డిపో ఎదుట ఎస్ఎంయూఏ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు నైట్ అవుట్ అలవెన్స్‌లు కలపడంతో ట్రెజరీ అధికారుల వైఖరికి నిరసనగా గేట్ మీటింగ్, నల్లబ్యాడ్జీలతో నిరసన. కార్మికులు పాల్గొనాలని నాయకుడు బాబు తెలిపారు.

- వన మహోత్సవం సందర్భంగా పట్టణంలో భవానీసెంటర్‌లో ఉదయం 9.30 గంటలకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం.
- తిమ్మాయపాలెం జడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లా అటవీశాఖ, ఎన్ఆర్ఈజీఎస్‌ల సౌజన్యంతో ఉదయం 9గంటలకు వనమహోత్సవ ప్రతిజ్ఞ, గ్రామంలో ర్యాలీ, అనంతరం పాఠశాలల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమం జరగుతుందని ప్రోగ్రం అర్గనైజర్ ఎం.త్రిమూర్తులు తెలిపారు.

\- అద్దంకి టౌన్

కొత్త కరెంట్ స్తంభాలతో ఇబ్బందే


రోడ్డు పక్కనే పాతుతున్న విద్యుత్ స్తంభాలు

మేదరమెట్ల, ఆగస్టు 29 : మేదరమెట్లలో కొత్తగా వేస్తున్న కరెంట్ స్తంభాల వలన భవిష్యత్‌లో ఇబ్బందులు ఏర్పడుతాయని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. పాత గుంటూరు రోడ్డు నుంచి పాత చెక్ పోస్టు వరకు కొత్తగా వేస్తున్న స్తంభాలు సిమెంట్ రోడ్డుకు దగ్గరలో వేస్తున్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు హద్దులో ఉన్న సైడ్ కాలువ పక్కగా విద్యుత్ స్తంభాలు వేస్తే భవిష్యత్‌లో ఇబ్బంది ఉండదు. సిమెంట్ రోడ్డుకు - కాలువకు మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో పాత స్తంభాల కన్నా ఇంకా సిమెంట్ రోడ్డుకు దగ్గరలోనే కొత్త స్తంభాలు వేస్తున్నారు. గతంలో ఆర్అండ్‌బీ రోడ్డులో ఉన్న ఆక్రమణలు సైడు కాలువ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు నిధులు మంజూరయ్యాయి. భవిష్యత్‌లో ఈ రోడ్డు నిర్మాణ సమయంలో ఈ స్తంభాలు తొలగించాల్సి ఉంటుంది. మేదరమెట్లలోని రావినూతల రోడ్డులో సిమెంట్ రోడ్డుకు పక్కగానే స్తంభాలను ఏర్పాటు చేశారు. వాహనదారులకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే విద్యుత్ స్తంభాలను ఢీకొనే పరిస్థితి ఉంది. ఏదైనా భారీ వాహనాలు ఎదురెదురు పడినప్పుడు పక్కకు జరిగే సమయంలో ఈ స్తంభాలు అడ్డం అవుతాయి. విద్యుత్ శాఖ అధికారులు ముందు చూపు లేకుండా స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాలు సైడు కాలువ పక్కకు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం


మేదరమెట్ల, ఆగస్టు 29 : మేదరమెట్లలో విద్యుత్ శాఖకు సంబంధించి నూతనంగ చేపట్టిన పనుల వలన విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ షైలా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేదరమెట్లలోని రావినూతల రోడ్డులో విద్యుత్ సరఫర ఉండదని ఆయన తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5

శ్రీపొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 30 ఆగస్టు 2024





బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద ఫిషింగ్ హార్బర్ (ఫైల్)





మత్స్యకారులకు

మంచి రోజులు!

- నేడు ఫిషింగ్ హార్బర్ ప్రారంభం
- వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

ఎప్పుడెప్పుడా అని మత్స్యకారులు ఎదురుచూస్తున్న రోజు రానేవచ్చింది. బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించిన ఫిషింగ్ హార్బర్‌ను న్యూఢిల్లీ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా శుక్రవారం ప్రారంభించనున్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో మధ్యాహ్నం ఒంటిగంటకు జరిగే ఈ కార్యక్రమంలో వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ శిలాఫలకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. కాగా, 2014-19లో అప్పటి కూటమి ప్రభుత్వంలోనే పురుడు పోసుకున్న ఈ హార్బర్ నిర్మాణానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా ఖర్చు భరించేలా రూ.288 కోట్ల అంచనాతో రూపొందించారు. టీడీపీ హయాంలో స్థలసేకరణ పూర్తిచేసి అప్పగించారు. అప్పట్లో దీని నిర్మాణానికి అప్పటి సీఎం నారా చంద్రబాబు శంకుస్థాపన కూడా చేశారు. ఆ తర్వాత 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో చేపట్టిన పనుల్లో మందగమనం కనిపించింది. చేసిన పనులకు బిల్లులు రాకపోవటంతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపేశారు.

ఎన్నికల ముందు వైసీపీ హడావుడి

పనులు పూర్తి కాకుండానే ఎన్నికల నోటిఫికేషన్‌కు రెండు రోజులు ముందు అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి వర్చువల్‌గా హార్బర్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు. నిర్మాణం 70 శాతం మాత్రమే పూర్తి కావటంతో అక్కడ ప్రారంభోత్సవం చేస్తే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయని, బోగోలు ఎంపీడీవో కార్యాలయం వద్ద సీఎం వర్చువల్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు. అయితే, కేంద్రం అనుమతి లేకుండానే ప్రారంభోత్సవ ఏర్పాట్లు చేయడంపై కేంద్రం ప్రభుత్వం అభ్యంతరం తెలపడంతో వాయిదా పడినట్లు సమాచారం.

కలెక్టరేట్‌లో ఏర్పాట్లు

ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక. కొత్త కాంట్రాక్టర్‌తో పనులు పూర్తిచేయించారు. అప్పట్లో ఆగిన చేపలు ఆరబెట్టుకునేందుకు ఫ్లాట్‌ఫామ్‌లు, చేపలు నిల్వకు గోదాము నిర్మాణం పూర్తి చేశారు. అలాగే, మంచినీరు, విద్యుత్ వంటి సౌకర్యాలనూ సమకూర్చారు. ఇలా అన్ని పనులు అయ్యాక శుక్రవారం ఫిషింగ్‌హార్బర్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. కలెక్టరేట్‌లో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)/కావలి

వైసీపీకి బీఎమ్మార్ బైబై!

పూలమ్మిన చోటే కట్టెలు అమ్మాల్సిన పరిస్థితిని జీర్ణించుకోలేక రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు (బీఎమ్మార్) గురువారం వైసీపీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈయన రాజీనామా నెల్లూరు జిల్లాలో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఆ పార్టీ జిల్లా నాయకత్వంలో ఎదురవుతున్న అవమానాలను తట్టుకోలేక ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

- రాజ్యసభ పదవికీ రాజీనామా
- వైసీపీలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న మస్తాన్‌రావు
- టీడీపీలోకి ఆహ్వానించిన ఎంపీలు వేమిరెడ్డి, మాగుంట
- అధిష్ఠానం పిలుపుతో రాజధానికి బీద రవిచంద్ర
- బీఎమ్మార్‌ను తమ పార్టీలో చేర్చుకునేందుకు కమలనాథుల విశ్వప్రయత్నం?
- జిల్లాలో మారుతున్న రాజకీయ సమీకరణలు

నెల్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వ్యాపారవేత్తగా స్థిరపడిన బీద మస్తాన్‌రావు తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై రెండున్నర దశాబ్దాల క్రితం ఆ పార్టీ ద్వారా రాజకీయ అరంగేట్రం చేశారు. టీడీపీలో క్రియాశీల నాయకుడిగా గుర్తింపు పొంది 2009లో కావలి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్‌కు పోటీ చేసి, ఓటమి చెందారు. టీడీపీలో అగ్రశ్రేణి నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఇంతగా గుర్తింపు పొందిన బీఎమ్మార్ వైసీపీలోకి వెళ్లిన తరువాత రాజకీయంగా అవమనాలను ఎదుర్కోవలసి వచ్చింది. వైసీపీ అధిష్ఠానం ఆదరించి 2022లో రాజ్యసభ సభ్యత్వం ఇచ్చినా ఆ పార్టీకి చెందిన కావలి నాయకులు, జిల్లా నాయకులు మాత్రం మస్తాన్‌రావును తమలో ఒకరిగా గుర్తించలేకపోయారు. ఎంపీ పదవిలో ఉన్నా చిన్నచూపే చూశారు. సీఎం హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు వచ్చిన సందర్భాల్లో మస్తాన్‌రావు వేదికపైకి ఎక్కే అవకాశం దొరక్క వెనక్కు వెళ్లిన సంఘటనలు ఉన్నాయి. ఇక దశాబ్దాల కాలం కావలి నియోజకవర్గంలో నెంబర్ వన్ నాయకుడిగా గుర్తింపు పొందిన ఈయనకు వైసీపీలో చేరిన తరువాత ఆ పార్టీ నాయకుల చేత అవమానాలు ఎక్కువయ్యాయి. కనీసం కావలిలో ఫ్లెక్సీలు కట్టుకోలేని దుస్థితిని సైతం బీఎంఆర్ ఎదుర్కొన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు ఎంపీ స్థానానికి విజయ సాయిరెడ్డి అభ్యర్థిగా ప్రకటించిన తరువాతే మార్చి, ఏప్రిల్ ఆ రెండు నెలలు బీఎంఆర్‌కు పార్టీలో గుర్తింపు లభించింది. ఆ తరువాత ఆ ఆదరణ లేకపోగా బీఎంఆర్ తన గెలుపునకు కృషి చేయలేదని, వెన్నుపోటు పొడిచారని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మస్తాన్‌రావు మూడు నెలలుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో గురువారం రాజ్యసభ సభ్యత్వానికి, వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి బీద మస్తాన్‌రావు రాజీనామా చేశారు.



ఫలించిన వీపీఆర్ ప్రయత్నం

బీఎంఆర్ అసంతృప్తిని గమనించిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి టీడీపీ అధినేత నారా చంద్రబాబుకు విషయం తెలియజేశారు. వైసీపీని, ఆ పార్టీ ద్వారా సంక్రమించిన రాజ్యసభ సభ్యత్వాన్ని వదులుకునే క్రమంలో బీఎమ్మార్‌ను టీడీపీలోకి తెచ్చుకోవాలని ఆ పార్టీ అగ్రనేతలు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డిలు బీఎమ్మార్‌ను మాతృ పార్టీలోకి రావాలని ఆహ్వానించినట్లు తెలిసింది. ఈ విషయమై చర్చించడానికి ఆయన తమ్ముడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రకు పిలుపురావడంతో గురువారం ఉదయం ఆయన అమరావతికి చేరుకున్నారు. ఇదే సమయంలో తమిళనాడుకు చెందిన బీజేపీ నాయకులు, రాజ్యసభలోని బీజేపీ మిత్రులు బీఎంఆర్‌ను తమ పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఒకటీ రెండు రోజుల్లో రాజకీయంగా బీద మస్తాన్‌రావు కీలక ప్రకటన చేసే సూచనలు ఉన్నాయని విశ్వసనీయ సమాచారం.

జలజీవన్ పనులకు ప్రాధాన్యమివ్వండి

- పూర్తయిన పనులకు బిల్లులు సిద్ధం చేయండి
- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చైర్‌పర్సన్ ఆదేశం



జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ అరుణమ్మ, అధికారులు, సభ్యులు

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 29: జిల్లాలో ప్రతి ఇంటికి తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఇంజనీరింగ్ శాఖలపై సమగ్రంగా చర్చించారు. గత ప్రభుత్వంలో చేపట్టిన సచివాలయాలు, ఆర్బీకేలు, వివిధ భవనాలు, ఇతర పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్ ఉన్నాయని, నాలుగేళ్లగా మొత్తుకుంటున్నా పూర్తయిన పనులకు బిల్లులు రాలేదని, ఇప్పటికైనా వాటిని మంజూరు చేయించాలని జడ్పీటీసీ సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, మాల్యాద్రి, వెంకట్రావు, రాఘవులు తదితర సభ్యులు విన్నవించారు. అలాగే రోడ్ల పనులు మంజూరైనా ఇంతవరకు టెండర్లు పిలవలేదని, ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయని వాపోయారు. జలజీవన్ పనులు సక్రమంగా జరగలేదని, స్థానిక ఎంపీడీవోలు పనుల పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వలేదని మండిపడ్డారు. దీంతో జడ్పీ చైర్‌పర్సన్, సీఈవో కన్నమనాయుడు మాట్లాడుతూ పనులు పూర్తయిన వాటికి ఎంబుక్‌ల రికార్డులను ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేయాలన్నారు. పార్టీలకతీతంగా బిల్లులకు సంబంధించి రికార్డులను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. ప్రస్తుతం జలజీవన్ పనులపై సర్వే జరుగుతున్నందున ప్రజాప్రతి నిధులంతా మండలస్థాయిలో సమీక్షించి, ఆ పనుల్లో లోటుపాట్లను సరిదిద్దేందుకు సహకరించాలని కోరారు. ప్రతి ఇంటికి తాగునీటి కొళాయిని అందించేందుకు అధికారులంతా యుద్ధ ప్రాతి పదికన పనులు చేపట్టాలన్నారు. విడవలూరు జడ్పీటీసీ లక్ష్మయ్య మాట్లాడుతూ తీరప్రాంతాలలో మంచినీటి పథకాలకు కరెంటు సరఫరా సక్రమంగా ఉండదని, చేతిబోర్లు, ప్రజలకు ఉపయోగపడు తుండగా, కొంతకాలంగా అవి మరమ్మ తులకు గురయ్యాయన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరికరాల మంజూరుకు ఉన్నతాధికారులు కృషి చేయాలని చైర్‌పర్సన్ సూచించారు.

తాగునీటి పథకాలకు సౌరవిద్యుత్తు

జిల్లాలో పంచాయతీలకు విద్యుత్ బిల్లుల భారం నుంచి విముక్తి కలిగించేందుకు సౌరవిద్యుత్తు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించినట్లు సీఈవో కన్నమనాయుడు జడ్పీటీసీలు, అధికారులకు తెలిపారు. తొలిగా మంచినీటి పథకాలకు అవసరమైన సౌర విద్యుత్తును వినియోగించుకునేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయించుకోవాలన్నారు. దీంతో బిల్లుల భారం పూర్తిగా తగ్గిపోతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంటే వాటి మంజూరుకు నివేదికలను కలెక్టర్‌కు పంపడం జరుగుతుందన్నారు.

తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు

- జయంతిలో కలెక్టర్ ఆనంద్



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 29 : తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని కలెక్టర్ ఆనంద్ కొనియాడారు. గురువారం తెలుగు భాషాదినోత్సవం, రామ్మూర్తి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో గిడుగు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాషకు రామ్మూర్తి ఎనలేని సేవ చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవహారిక భాషోద్యమానికి ఆయన మూలపురుషుడన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో లవన్న, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి

- ఐదు పాఠశాలలకు రాష్ట్రస్థాయి అవార్డులు : డీఈవో



అవార్డులు అందుకుంటున్న పాఠశాలల ప్రతినిధులు

నెల్లూరు (విద్య), ఆగస్టు 29 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిని క్రీడల్లో రాణించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని డీఈవో రామారావు సూచించారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో గురువారం పలు పాఠశాలలకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులను అందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహిస్తుండడంతో జిల్లాలో ఐదు పాఠశాలలు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందాయని చెప్పారు. 2023-24 విద్యా సంవత్సరానికి బీవీనగర్ కేఎస్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల, బీవీఎస్ బాలికల ఉన్నత పాఠశాల, కోవూరు జడ్పీ బాలికోన్నత పాఠశాల, పాటూరు జడ్పీ ఉన్నత పాఠశాల, పొదలకూరు మండలం మహ్మదాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలను విద్యాశాఖ క్రీడా అవార్డులకు ఎంపిక చేసిందని చెప్పారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, పీడీలకు అవార్డులను అందచేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తీరనున్న ఇసుక కష్టాలు

జిల్లాలో ఇసుక కష్టాలు తీరనున్నాయి. ఒకటీ రెండు రోజుల్లో డీసిల్టేషన్ పాయింట్ల వద్ద ఇసుక తవ్వకాలు ప్రారంభం కానున్నాయి. సంగం బ్యారేజీకి రెండు వైపులా ఉన్న సంగం, సూరాయపాలెం పాయింట్లతో పాటు కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం వద్ద నెల్లూరు బ్యారేజీకి సంబంధించి డీసిల్టేషన్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. వీటినుంచి డిమాండ్‌కు తగ్గట్టుగా ఇసుకను వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఓ ఆనంద్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ (డీఎస్ఎస్‌సీ)లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

- కొలిక్కి వచ్చిన టెండర్ల ప్రక్రియ
- 15 మంది కాంట్రాక్టర్లకు డ్రెడ్జింగ్ పనులు
- రేపటి నుంచి తవ్వకాలు జరపాలని నిర్ణయం
- యార్డుల్లో టన్ను ధర రూ.380గా ఖరారు
- డీఎల్ఎస్‌సీ సమావేశంలో కీలక నిర్ణయాలు
- మర్రిపాడు యార్డులో కరిగిన నిల్వలు



మర్రిపాడు యార్డులో మట్టిలో కలిసి పనికి రాని ఇసుక

జిల్లాలో ఇసుక కొరతను తీర్చేందుకు వేగంగా చర్యలు తీసుకుంటున్నాం. పెన్నా, సంగం బ్యారేజీల వద్ద డీసిల్టేషన్ చేసి ప్రాజెక్టుల వద్ద నీటి నిల్వ సామర్థ్యం పెంచడంతో పాటు అక్కడి ఇసుకను ప్రజలకు అందిస్తాం. ఇందుకు సంబంధించి ఆసక్తి కలిగిన బోట్స్‌మెన్ సొసైటీలను కూడా ఎంపానెల్ చేశాం. ఒకటి, రెండు రోజుల్లోనే డీసిల్టేషన్ పనులు మొదలవుతాయి.

- ఓ ఆనంద్, జిల్లా కలెక్టర్

ఒకటీ రెండు రోజుల్లో ప్రారంభం

నెల్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : యార్డుల్లో ఇసుక నిల్వలు తరిగిపోవడంతో గడిచిన కొన్ని రోజులుగా ఇసుకకు డిమాండ్ ఏర్పడింది. రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు రావడం ఆలస్యమవుతున్న నేపథ్యంలో ఎలాగైనా ఇసుక కొరత తీర్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే బ్యారేజీల వద్ద డీసిల్టేషన్ పాయింట్లలో ఇసుక తవ్వకాలకు నిర్ణయం తీసుకుంది.

15 సొసైటీల ఎంపిక

పెన్నా, సంగం బ్యారేజీల వద్ద డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక తవ్వకాలు జరపాల్సి ఉండటంతో అందుకు సంబంధించిన ప్రక్రియలను వేగంగా పూర్తి చేసింది. ఆసక్తి కలిగిన పడవలు కలిగిన సొసైటీల (బోట్స్‌మన్) నుంచి జిల్లా అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. మొత్తం 15 సొసైటీలకు సంబంధించి 27 దరఖాస్తులు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ నేతృత్వంలోని డీసిల్టేషన్ కమిటీ రెండు రోజులపాటు దరఖాస్తులను పరిశీలించి, 15 సొసైటీలను అర్హులుగా ప్రకటించింది. వీరందరూ బ్యారేజీల వద్ద డీసిల్టేషన్ చేసేందుకు సిద్ధం కావాలని అధికారులు సూచించారు.

ట్రాక్టర్ ఇసుక రూ.1520

ఇక యార్డు నిర్వహణ, సీనరైజ్ చార్జీలు, డీఎంఎఫ్‌టీ, ఇతర చార్జీలు కలుపుకొని యార్డు వద్ద టన్ను ఇసుకను ప్రజలకు రూ.380కు విక్రయించేలా నిర్ణయం తీసుకున్నారు. అంటే ఒక ట్రాక్టర్ (నాలుగు టన్నులు) ఇసుక ధర రూ.1520కు యార్డుల వద్ద విక్రయిస్తారు. పోతిరెడ్డిపాలెం యార్డు నుంచి నెల్లూరు నగరం, రూరల్, కోవూరు, కావలి నియోజకవర్గాలకు దగ్గరగా ఇసుకను తీసుకెళ్లవచ్చు. అలానే సూరాయపాలెం నుంచి సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాలకు, సంగం నుంచి ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు ఇసుకను తక్కువ ధరకు (రవాణాతో కలిపి) తీసుకెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుంది. కాగా అక్టోబరు 15 తర్వాత నుంచి ఇసుక రీచ్‌లలో తవ్వకాలు ప్రారంభం కానున్నాయి. అప్పుడు డ్రెడ్జింగ్, యార్డు నిర్వహణ వంటి చార్జీలు తగ్గిపోతున్నాయి. దీంతో ఇంకా తక్కువ ధరకు అప్పుడు ఇసుక లభిస్తుంది.

తవ్వి, తరలించినందుకు..

మూడు డీసిల్టేషన్ పాయింట్ల వద్ద ముందుకొచ్చిన కాంట్రాక్టర్లకు డ్రెడ్జింగ్ ద్వారా ఇసుకను తవ్వి తీసుకొచ్చేందుకు అవకాశం కల్పిస్తారు. ఇలా తవ్వి బోట్లలో తీసుకొచ్చిన ఇసుకను సమీపంలో ఏర్పాటు చేసిన యార్డుకు సదరు కాంట్రాక్టర్లే తరలించాల్సి ఉంటుంది. ఇందుకుగానూ టన్ను ఇసుకకు ధరను కూడా డీఎల్ఎస్‌సీ సమావేశంలో నిర్ణయించారు. సూరాయ పాలెంలో నదికి, యార్డుకు ఒక కిలోమీటర్ దూరం ఉండడంతో ఇక్కడ టన్నుకు రూ.125, పోతిరెడ్డిపాలెం వద్ద రెండు కి.మీ ఉండటంతో రూ.135, సంగం వద్ద 3 కి.మీ దూరం ఉండటంతో రూ.140 కాంట్రాక్టర్లకు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారు.

మర్రిపాడులో కరిగిన నిల్వలు

వైసీపీ ప్రభుత్వం పుణ్యమా అని ఇసుక రీచ్ లలో తవ్వకాలు చేయలేని పరిస్థితి నెలకొంది. నాడు పర్యావరణ అనుమ తులు లేకుండా విచ్చల విడిగా తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకున్నారు. ఈ అక్రమాలపై జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌తోపాటు సుప్రీంకోర్టులో కూడా కేసులు నడుస్తున్నాయి. ఆ ప్రభావంతో రీచ్‌లలో తవ్వకాలు జరపలేక యార్డుల్లో నిల్వ ఉన్న ఇసుకనే ప్రభుత్వం అందించాల్సి వచ్చింది. అందులోనూ పల్లిపాడు, మినగల్లు యార్డుల్లో తక్కువ క్వాంటిటీ ఉండడంతో రెండు వారాల్లోనే అక్కడి యార్డులు ఖాళీ అయ్యాయి. మర్రిపాడులో మాత్రం 1.20 లక్షల టన్నుల ఇసుక నిల్వలు ఉండడంతో ఇప్పటివరకూ అక్కడి నుంచే జిల్లా అవసరాలు తీరుతూ వచ్చాయి. కానీ ప్రస్తుతం ఆ యార్డులో అధికారికంగా 25 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఇసుక నిల్వలు ఉన్నాయి. అందులోనూ దాదాపు 15 వేల టన్నుల వరకూ గ్రౌండ్ లాస్ (మట్టి కలిసిన ఇసుక), లోడింగ్ లాస్(ఎలక్ట్రానిక్ కాటా లేకపోవడంతో జరిగిన నష్టం) ఉన్నాయి. ఇక మిగిలింది దాదాపు 10 వేల టన్నులు మాత్రమే. ప్రస్తుతం సోమశిల జలాశయం ఆప్రాన్ పనులు జరుగుతుండటంతో అక్కడకు మరో 13 వేల టన్నుల ఇసుక అవసరం కానుంది. ఇప్పుడున్న మిగిలి ఉన్న ఇసుకను సోమశిలకు తరలించే విధంగా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో మర్రిపాడు యార్డులో ఇసుక విక్రయాలు నిలిచిపోయాయి.

మేయర్ భర్తకు సుప్రీంలోనూ చుక్కెదురు

నెల్లూరు(సిటీ), ఆగస్టు 29 : నెల్లూరు నగర మేయర్ పోట్లూరి స్రవంతి భర్త జయవర్ధన్‌కు సుప్రీం కోర్టులోనూ భంగపాటు తప్పలేదు. పూర్వ కమిషనర్ ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ సంతకం ఫోర్జరీ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని భారత అత్యున్నత న్యాయస్థానాన్ని జయవర్ధన్ ఆశ్రయించారు. అయితే అతని అభ్యర్థనను న్యాయస్థానం గురువారం తిరస్కరించినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. ఇటీవల ఇదే అంశంపై ఏపీ హైకోర్టు తలుపు తట్టగా అక్కడా చుక్కెదురైన విషయం విదితమే. ప్రస్తుతం పరారీలో ఉన్న జయవర్ధన్‌ను అదుపులోకి తీసుకునేందుకు నెల్లూరు పోలీసులు గాలిస్తున్నారు. వారి అరెస్టు నుంచి తప్పించుకునేందుకు జయవర్ధన్ ముందస్తు బెయిల్ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. కాగా, అతనిని అదుపులోకి తీసుకోవడంపై పోలీసు వర్గాలు ఆశించినంతగా శ్రద్ధ చూపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మరో టీపీవో అరెస్టు

నెల్లూరు(క్రైం): సంతకాల ఫోర్జరీ కేసులో మరో అధికారి అరెస్టు అయ్యారు. కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారి బీ ప్రవీణ్‌కుమార్‌ను నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి గురువారం అరెస్టు చేశారు. ఈ కేసులో ఇద్దరు టీపీవోలు, మేయర్ భర్త జయవర్ధన్, ఆయన సహాయకుడు, ఇద్దరు సచివాలయ ఉద్యోగులు, ప్రైవేటు ఇంజనీర్‌పై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే శివకృష్ణ, టీపీవో దేవేంద్రను పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా కరెంట్ ఆఫీసు సెంటర్ వద్ద టీపీవో బీ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేశారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఘనంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవం

భాషా శాస్త్రవేత్త గిడుగు రామ్మూర్తికి, మేటి క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌కి పలువురి నివాళులు

జిల్లా వ్యాప్తంగా గురువారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల్లో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా శాస్త్రవేత్త గిడుగు రామ్మూర్తి, మేటి క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి సేవలను స్మరించుకున్నారు. ఆ వివరాలు..



కందుకూరు : టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుభాష, జాతీయ క్రీడా దినోత్సవంలో మాట్లాడుతున్న అధ్యాపకురాలు


కావలి : గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు


లింగసముద్రంలో..


వలేటివారిపాలెంలో విద్యార్థులు, టీచర్ల ర్యాలీ

కావలిటౌన్, ఆగస్టు29: పట్టణంలో గురువారం తెలుగుభాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ఎంఈవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-1 గోవిందయ్య, ఎంఈవో-2 వెంకటసుబ్బయ్య గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జేబీ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖాధి పతి పీ నారాయణ అధ్యక్షతన జరిగిన భాషా దినోత్సవంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల సంచాలకుడు ఆర్ మాల్యాద్రి, అధ్యాపకులు రమణ తదితరులు పాల్గొని గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే పట్టణ పరిధిలోని పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

కందుకూరు : పట్టణంలోని టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని, క్రీడాదినోత్సవాన్ని వేర్వేరుగా నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టరు నరేంద్ర ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు తెలుగుభాషాభివృద్ధిపై మాట్లాడారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే మేటి క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నిర్వహించిన వివిధపోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్, అధ్యాపకులు రాజగోపాల్‌బాబు, నరేష్‌రాజా, కే సుజాత, షానాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు. టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవితలు, పద్యాలు, ప్రాచీన తెలుగుభాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.

● **తెలుగు ఉపాధ్యాయులకు సన్మానం**

కందుకూరు మండలంలోని ఓగూరు వద్ద ఉన్న సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులను సన్మానించారు. తెలుగు ఉపాధ్యాయుడు ఇనకొల్లు మస్తానయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గిడుగు వెంకట రామమూర్తికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత తెలుగు పండితులు గుర్రం వెంకటస్వామి, తెలుగు ఉపాధ్యాయిని ఏ. శ్రీవాణిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలుగులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

లింగసముద్రం : మండలంలోని పెంట్రాల యూపీ పాఠశాలలో గురువారం గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు.అనంతరం తెలుగు ఉపాధ్యాయురాలు హైమారాణి మాట్లాడారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే మోహన్‌రావు, శ్రీనివాస్ ఆచారి, కే వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : గ్రామంలోని హైస్కూల్‌లో గురువారం తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, టీచర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కమల్‌కుమార్ మాట్లాడారు. ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్లూరు : తెలుగుభాషా దినోత్సవాన్ని పురష్కరించుకొని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దారు లక్ష్మీ నారాయణ గురువారం గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు సుధీర్, వీఆర్వో రంతుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

ఉలవపాడు : జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు మాతృభాషా దినోత్సవాలను మండలంలోని పలు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో గురువారం ఘనంగా జరుపుకున్నారు. రామాయపట్నం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్, పీడీ జీవన్‌కుమార్ క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. గిడుగు రామమూర్తి తెలుగు భాషకు చేకూర్చిన ప్రాధాన్యతను స్మరించుకుంటూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఉలవపాడు ప్రభుత్వ జూనియర్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, కరేడు, చాకిచర్ల, వీరేపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

కలిగిరి : స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా వస్త్రధారణ చేశారు. జిర్రావారిపాలెం విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం అలరించింది. పాఠశాలలో వక్తృత్వ, పద్య పఠన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

సంగం : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తెలుగుభాష పితామహుడు గిడుగు రామూర్తి చిత్రపటానికి తహసీల్దారు సోమ్లా నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. సంగం, తరుణవాయి దువ్వూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు తెలుగుతల్లి, తెలుగు కవుల వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ముండలం, మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో గురువారం గిడుగు రామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాణీశ్రీ, మండల కార్యాలయంలో ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పంచాయతీరాజ్‌శాఖ ఏఈ షేక్ ఖాదర్‌బాష, కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి తహసీల్దారు ఎం.సుభద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సందానీ, సర్వేయరు రవి, వీఆర్వోలు పాల్గొన్నారు. కాగా దుత్తలూరు తహసీల్దారు కార్యాలయంలో గిడుగు చిత్రపటానికి తహసీల్దారు నాగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ గులాం, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఏఎస్ పేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో సాయి ప్రసాద్, హెడ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వహకులు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరం: వెంగంపల్లి ఉన్నత పాఠశాలలో తెలుగు సేవాసమితి సభ్యులు విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సుబ్బరాయుడు, సభ్యులు గోవిందరెడ్డి, వెంకటరెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు. అలాగే చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో ఈ వేడుకలు నిర్వహించారు.

మర్రిపాడు: మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో గ్రంథాలయం ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు పద్యాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీదేవి, గ్రంథాలయాధికారి నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వింజమూరు: చాకలకొండ రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష, క్రీడా దినోత్సవాలు ప్రధానోపాధ్యాయులు పోలుబోయిన రమేష్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు ఏ.సుభాషిణి, షేక్.షమీల బేగం, వ్యాయామ ఉపాధ్యాయులు వెలుగోటి కృష్ణ, ఉపాధ్యాయులు ఏ.సుభాషిణి, సీతామహాలక్ష్మి, శ్రీరాములు, సురరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు: ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది


సంగం: పూలమాల వేస్తున్న తహసీల్దారు సోమ్లానాయక్


దుత్తలూరు తహసీల్దారు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న తహసీల్దారు, ఉద్యోగులు


అనంతసాగరంలో మాట్లాడుతున్న సుబ్బరాయుడు, వింజమూరు: వివిధ వేషధారణల్లో విద్యార్థులు


అల్లూరు : గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ


ఉలవపాడు : ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కావలిటౌన్, ఆగస్టు29: జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం విశ్వోదయ పాఠశాల, సంయుక్త సేవాసంస్థ సహకారంతో బాపూజీనగర్‌లోని బీసీ బాలికల పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు పారిశ్రామికవేత్త జయచంద్రనాయుడు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని లక్ష్మీమాధవి, పీఈటీ రాజ్యలక్ష్మి, రెడ్‌క్రాస్ జిల్లా బాధ్యులు గంధం ప్రసన్న, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, బుర్లా రఘుకుమార్ రెడ్డి, సంస్థ అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు. అలాగే వెంగళరావునగర్‌లోని మున్సిపల్ పాఠశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో రన్ ఫర్ ఫిట్‌ను నిర్వహించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కొండారెడ్డి పర్యవేక్షణలో జరిగిన రన్‌ను హెచ్‌ఎం హయ్యుల్ హయ్యూమ్ జెండా ఊపి ప్రారంభించారు.

ఉదయగిరి రూరల్ : స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ప్రముఖ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నాలుగు రోజులుగా వాలీబాల్, టెన్నీస్ బాల్, చెస్, బాస్కెట్‌బాల్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. గురువారం పోటీలోని విజేతలకు ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ కేఎస్‌ఆర్ పాల్ బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ రమేష్, పీడీ రమణ, ప్రొఫెసర్లు సునీత, కిషన్‌తేజ, అశోక్, మాధవి, శోభ, సూర్య పాల్గొన్నారు.

సంగం: స్థానిక జడ్పీహెచ్‌ఎస్‌లో ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి సంగం బస్టాండ్ వరకు ర్యాలీని కొన సాగించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ మాస్టర్ లక్ష్మీనారాయణ, పీడీ అంజయ్య, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.


కావలిలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

సీతారామపురం: సంగసానిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పేరాల శ్రీనివాసులు గిడుగు రామ మూర్తి, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు ఎంఈవో మస్తాన్‌వలి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వరలక్ష్మితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామనికి చెందిన వెంగళశెట్టి బాబురావు పాఠశాలకు ప్రొజెక్టర్, సీపీయూను బహూకరించారు. గిడుగు రామమూర్తి జీవిత చరిత్రను ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మౌలాలి, పాఠశాల కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : స్థానిక డాక్టర్ ఎస్‌ఆర్‌జె డిగ్రీ కళాశాలలో హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురష్కరించుకుని గురువారం పీడీ సిరిమావిళ్ల వెంకటేశ్వర్లు ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్, లైబ్రేరియన్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు అనంతలక్ష్మీ ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గిడుగు రామ్మూర్తిపంతులు జయంతిని జరిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు డిప్యూటీ డీఈవో గోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో తెలుగు పండితులు మధుసూధనశాస్త్రి, డాక్టర్ ఎం.పెంచలప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

77మందికి ఉద్యోగాలు

కందుకూరు, ఆగస్టు 29: బెంగళూరు ఆల్‌సెక్, పీఎస్‌కే కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు బుధ, గురువారాలలో ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 77 మందికి ఉద్యోగాలు దక్కాయని టెక్నికల్ డైరెక్టర్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుదాం: ఎమ్మెల్యే కావ్య

కావలి, ఆగస్టు 29: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. రుద్రకోటలోని ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయ ఆవరణలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎక్కువ ఆక్సిజన్ అందించే రాగి, వేప, మారేడు, నేరేడు మొక్కలు నాటాలని కోరారు. నియోజకవర్గ ప్రజలు తనకు 30,948ఓట్ల మెజార్టీ ఇచ్చారని, అదే సంఖ్యలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రాంతీయ రవాణాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వాహనదారుల నిబంధనలను వివరించారు. ఎంవీఐ సుందరరావు, ఏఎంవీఐ కరుణాకర్ పాల్గొన్నారు.


రవాణాశాఖ కార్యాలయంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, అధికారులు

బిట్రగుంట, (దగదర్తి) : కావలి నియోజకవర్గానికి దామవరం ఎయిర్‌పోర్టు మణిహారమని ఎమ్మెల్యే దగు మాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. దగదర్తి మండలం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో గురువారం టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని ప్రతి చెరువుకు నీరందించేలా చర్యలు చేపడతానని అన్నారు. దగదర్తి-బుచ్చి రోడ్డుకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబు, ఇబ్రీస్, శ్రీహరినాయుడు, మన్నవ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడులో శ్రీవారి శాంతి కల్యాణం

మర్రిపాడు : చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక వెంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి, సతీమణి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శాంతికుమారి మొక్కుకున్నారు. ఈ మేరకు గురువారం రాత్రి మర్రిపాడులోని వారి స్వగృహంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వా మి కల్యాణంను అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లాలోని పలువురు కూటమి నా యకులు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూచిపూడి, భరత నాట్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.


కల్యాణ మహోత్సవంలో మేకపాటి దంపతులు

వివాదాస్పద స్థలం పరిశీలన

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : కట్టకిందపల్లి ఎస్సీ కాలనీలోని పోరంబోకు భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన స్థలాన్ని గురువారం తహసీల్దారు నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అడిగి వివరాలు తెలుసుకొన్నారు.

ఉద్యాన కళాశాలకు నిధులు మంజూరు చేయండి

కందుకూరు, ఆగస్టు 29: నియోజక వర్గంలో చినలాటిరిపి వద్ద ఉన్న ఉద్యాన కళాశాల శాశ్వత భవనాల నిర్మాణానికి నిధు లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. గురువారం విజయవాడలో మంత్రి కింజరపు అచ్చెన్నాయుడును కలిసి కొన్నేళ్లుగా ఉద్యాన కళాశాల కందుకూరు సమీపంలో అద్దె భవనాల్లో నడుస్తున్నదన్నారు. చినలాటిరిపి వద్ద భూ కేటా యింపులు కూడా జరిగినా నిధులు విడుదల లో జాప్యంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. నిధులు మంజూరు చేయాలన్నారు. అనంతరం కార్మికశాఖామంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కూడా ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు.

వీఆర్‌ఏ మృతి

అల్లూరు, ఆగస్టు 29: పురుగు మందుతాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నార్తుఆములూరు వీఆర్‌ఏ సునీల్‌కుమార్ (29) మృతి చెందాడు. కుటుంబ కలహాలతో తాను చనిపోతున్నానని ఈ నెల 27న వీఆర్‌ఏ పోలీసులకు సమాచారమిచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహానికి కుటుంబసభ్యులకు అప్పగించారు. స్వగ్రామం లో అంత్యక్రియలు నిర్వహించారు.

విధుల్లోకి తీసుకోండి

కలిగిరి, ఆగస్టు 29:రావులకొల్లు ఆశా వర్కర్ పందిటి విజయమ్మను విధుల్లోకి తీసుకోవాలంటూ ఆశావర్కర్లు గురువారం స్థానిక పీహెచ్‌సీ ఎదుట నిరసన చేపట్టారు. విజయమ్మ విధులు నిర్వహించడంలో అలసత్వం వహిస్తుందంటూ రావులకొల్లులో గ్రామసభ నిర్వహించి, సర్పంచు, కార్యదర్శులు తీర్మానం చేశారు. అనంతరం వైద్యాధికారికి వినతిపత్రం అందించారు.

ఎమ్మార్పీఎస్ నేతలకు సన్మానం

కందుకూరు, ఆగస్టు 29: ఎస్సీ వర్గీకరణ కోసం జరిగిన క్రియాశీలక పోరాటంలో పనిచేసిన పందలపాడు సీనియర్ నాయకులు వర్ల దేవదాసు, కాంతారావులను గ్రామస్థులు, ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం రాత్రి సన్మానించారు. ఉపసర్పంచి వర్ల నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామస్థులు, ఎమ్మార్పీఎస్, మాదిగ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శివకృష్ణారెడ్డి సేవలు అభినందనీయం

బిట్రగుంట, ఆగస్టు 29: నెల్లూరు శివకృష్ణారెడ్డి సొంత నిధులతో కొత్తూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణంలోని గోతులు పూడ్చివేయించారని, బృందావన, జెండాచెట్టు వీధుల్లో అంతర్గత రోడ్లను మరమ్మతులు చేయించారు. గురువారం ఈయన్ను గ్రామ పెద్దలు అభినందించారు.

జగనన్న కాలనీలో విజిలెన్స్ తనిఖీలు

బిట్రగుంట, ఆగస్టు 29: బోగోలు మండల పరిధిలో నిర్మాణంలో ఉన్న జగనన్న లే అవుట్లలోని గృహాలను జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటరెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇప్పటి వరకు పూర్తి అయిన, వివిధ దశల్లో ఉన్న గృహాల వివరాలను ఇన్‌చార్జి ఏఈ శ్వేతను అడిగి తెలుసుకున్నారు. బోగోలు కాలనీకి సంబంధించిన రికార్డులు పరిశీలించారు.

ఖేలో ఇండియా పోటీలకు విద్యార్థిని

కందుకూరు, ఆగస్టు 29: తిరుపతిలో ఈనెల 31, సెప్టెంబరు 1 తేదీల్లో జరగనున్న ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యార్థిని భవ్యశ్రీ ఎంపికైందని తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్ సలాం గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భవ్యశ్రీని విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాలభాస్కరరావు, నరేంద్రబాబు అభినందించారు.

లేఅవుట్ల పరిశీలన

అల్లూరు, ఆగస్టు 29: మండలంలోని ప్రభుత్వ స్థలాల లేఅవుట్లను విజిలెన్స్ అధికారులు గురువారం పరిశీలించారు. అల్లూరులోని టైలర్స్‌కాలనీ, దయాకర్‌రెడ్డి లేఅవుట్లతోపాటు పలు లేఅవుట్లలో నిర్మించిన గృహాలు, నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. గోదాముల్లో నిల్వ ఉన్న ఐరన్, సిమెంట్ వివరాలను సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందచేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మాధవ్, ఉషా, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు జోక్యంతోనే : ఎమ్మెల్యే కావ్య

కావలి : జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో శుక్రవారం ప్రారంభించనున్నట్లు కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జోక్యంతో ప్రధాని మంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా హార్బర్‌ను ప్రారంభించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

చేజర్ల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డీఈవో గోపాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌తో సమావేశమై నిర్వహణకు సం బంధించి సలహాలు ఇచ్చారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ టీకా వేయాలి

ఉదయగిరి రూరల్ : అర్హులైన ప్రతిఒక్కరికీ అడల్ట్ బీసీజీ టీకా వేయిం చాలని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం మాసాయిపేట, గంగిరెడ్డిపల్లి, ఉదయగిరిలోని టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. క్షయవ్యాధి ఆరోగ్య పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉదయగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయండి

ఉదయగిరి రూరల్/ కలిగిరి : ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను గురువారం విజయవాడలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం

సంగం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై గురువారం ఎంపీడీవో గోపీ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ సెప్టెంబరు 1 ఆదివారం రావడంతో ఈ నెల 31వ తేదీనే పింఛన్లు పం పిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిదన్నారు. ఆ మేరకు శనివారం ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ అప్పాజీ ఉన్నారు.

ఆత్మకూరు: మండలంలో శనివారం ఉదయం 6 గంటల నుంచే సంబంధిత గ్రామ సచివాలయ సిబ్బంది ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తారని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైద్యశాల నిర్మాణానికి స్థలపరిశీలన

మర్రిపాడు : కృష్ణాపురంలో నూతన వైద్యశాల నిర్మాణానికి 1.50సెంట్ల భూ మిని కేటాయించారు. ఈ భూమిని గురువారం ఆర్డీవో మధులత పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అనంతసాగరం : సోమశిల పెన్నా పరివాహక ప్రాంతం నుంచి ఇసుక అక్ర మ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను గుర్తించి సోమశిల పోలీసులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేస్తామన్నారు.

గీతాశ్రమంలో హనుమాన్‌చాలీసా పఠనం

అల్లూరు : కృష్ణాష్టమిని పురస్కరించుకొని స్థానిక గీతాశ్రమంలో గురువారం హనుమాన్ చాలీసా పఠనం చేపట్టారు. ఖమ్మంకు చెందిన కళాకారులు గురువారం ఉద యం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని నిర్వాహకులు అనంతరాజు బాలకృష్ణంరాజు తెలిపారు. కార్యక్రమంలో యరటపల్లి శేఖర్‌రెడ్డి, మోమిడి మాధవరావు, పప్పు సుధాకర్, సురేష్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జలదంకిలో బీజేపీ సమావేశం

జలదంకి : స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు కంచర్ల శరత్‌బాబు అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం జరిగింది. మండల ఇన్‌చార్జ్ పూనూరు మాధవిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా కార్యదర్శి మారెళ్ళ బహ్మారెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో జలదంకి ఎంపీటీసీ కే మాధవరావుయాదవ్, నాయకులు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, బండారు తిరుపతిరెడ్డి, వీ రాకేష్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.